www.prajanaava.in

Telugu Daily

ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల రూ.5.00

Published from: **Hyderabad, Rangareddy, Karimnagar** Circulated to: **Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad**

హైదరాబాద్ | సంపుటి 01 | సంచిక: 75 | ఆదివారం | 25 అక్టోబర్, 2026



ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్‌కు సింధు

- జపాన్ షట్లర్‌పై హోరాహోరీ పోరులో విజయం
- ఈ ఏడాది రెండో సూపర్ 750 ఫైనల్‌కు

7

గంగా తీరాన గగన విన్యాసాలు!

భారత వైమానిక దళం 94వ వార్షికోత్సవం సందర్భంగా ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి నమో ఘాట్ వద్ద నిర్వహిస్తున్న వైమానిక ప్రదర్శన చివరి రోజు కార్యక్రమానికి హాజరయ్యేందుకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ శనివారం నగరానికి చేరుకున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, గవర్నర్ ఆనందీబెన్ పటేల్ ఆదివారం ప్రదర్శనను తిలకించనున్నారు. 'వింగ్స్ ఓవర్ గంగా' ఇతివృత్తంతో జరుగుతున్న ఈ ప్రదర్శనలో తేజస్, ప్రచండ్ తేలికపాటి యుద్ధ హెలికాప్టర్, సుఖోయ్–30ఎంకేఐ, రఫేల్‌తో పాటు రవాణా విమానాలు, నౌకాదళం, సైన్యానికి చెందిన విమానాలు, హెలికాప్టర్లు విన్యాసాలు చేయనున్నాయి. సూర్యకిరణ్ ఏరోబాటిక్, సారంగ్ హెలికాప్టర్ బృందాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. గురువారం ప్రారంభమైన మూడు రోజుల ప్రదర్శన శుక్రవారం శానన మండలి ఎన్నికల కారణంగా నిలిచిపోయింది.





బీఆర్ఎస్ తప్పిదాలకు రైతాంగం బలి

- ప్రాణహితను పక్కనపెట్టి.. తెలంగాణను అప్పుల ఊబిలోకి నెట్టారు!
- అబద్ధాల ప్రచారంలో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు గోబెల్స్‌ను మించిపోయారు
- అసంపూర్తి ప్రాజెక్టులతో రైతాంగానికి తీరని నష్టం.. ఎల్‌నినోను ఎదుర్కొనే సాగునీటి భరోసా కరువు
- మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల పునరుద్ధరణకు కార్యాచరణ.. 2027 వర్షాకాలానికి ముందే పూర్తి చేయడమే లక్ష్యం
- మీడియా సమావేశంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

2

రైతులకు సాగునీటి భరోసా కల్పించాల్సిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టుల రీడిజైన్ పేరుతో తెలంగాణను అప్పుల ఊబిలోకి నెట్టిందని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును మొదట ప్రతిపాదించిన విధంగా పూర్తి చేయకుండా, దాని స్వరూపాన్ని మార్చి కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో మేడిగడ్డను కేంద్రంగా చేసుకోవడం బీఆర్ఎస్ చేసిన చారిత్రక తప్పిదమని ఆరోపించారు. భారీగా అప్పులు తెచ్చి ఖర్చు చేసినప్పటికీ ఎన్ఎల్‌బీసీ, దేవాదుల, సీతారామ తదితర కీలక ప్రాజెక్టులను అసంపూర్తిగా వదిలేయడంతో రాష్ట్రానికి ఆశించిన సాగునీటి ప్రయోజనాలు అందలేదన్నారు. ఈ ప్రాజెక్టులన్నీ పూర్తయి ఉంటే ప్రస్తుతం ఎదురవుతున్న ఎల్‌నినో ప్రభావిత కరువు పరిస్థితులను మరింత సమర్థంగా ఎదుర్కొనే అవకాశం ఉండేదని పేర్కొన్నారు.

రేపు ముంబైకి సీఎం రేవంత్ బృందం

తుమ్మిడిహట్టి బ్యారేజీపై మహారాష్ట్రతో కీలక చర్చలు

సీఎం ఫడ్నవీస్‌తో రేవంత్ భేటీ.. 152 మీటర్ల ఎత్తుపై ప్రతిపాదనలు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రెండు లక్షల ఎకరాలకు సాగునీరు లక్ష్యం

ముంబై పర్యటన నేపథ్యంలో మంగళవారానికి వాయిదా పడిన కృష్ణా బోర్డు సమావేశం

ప్రజానావ, హైదరాబాద్:

అంతరాష్ట్ర జలవివాదాల పరిష్కారం, పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులకు ముందడుగు వేసే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా రంగంలోకి దిగుతున్నారు. ఇందులో భాగంగా సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఆ శాఖ ఉన్నతాధికారుల బృందం ముంబైకి వెళ్లనుంది. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో రేవంత్‌రెడ్డి సమావేశమై ప్రాణహిత నదిపై తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణం, దాని ఎత్తు, నీటి మళ్లింపు, ముంపు ప్రభావం వంటి కీలక అంశాలపై చర్చించనున్నారు. ఈ భేటీకి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత నిస్తోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సాగునీటి అవసరాలను తీర్చడంలో కీలకమైన తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించడమే ఈ పర్యటనలో ప్రధాన అజెండాగా కనిపిస్తోంది. ప్రాణహిత నదిపై తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీ నిర్మించడం ద్వారా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సుమారు రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఇందుకోసం బ్యారేజీ ఎత్తును 152 మీటర్లుగా నిర్ణయించే ప్రతిపాదనపై తెలంగాణ ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. గతంలో ఈ ప్రాజెక్టుకు సంబంధించి వివిధ అంశాలపై చర్చలు జరిగినప్పటికీ, బ్యారేజీ ఎత్తు, మహారాష్ట్ర భూభాగంలో ముంపు ప్రభావం, నీటి లభ్యత వంటి అంశాలు కీలకంగా మారాయి. ఈ నేపథ్యంలో పొరుగు రాష్ట్రానికి ఎదురయ్యే అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుంటూనే తెలంగాణకు గరిష్ఠ ప్రయోజనం చేకూరేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. సాంకేతికంగా సాధ్యమయ్యే మార్గాలను పరిశీలించి, చర్చల్లో సమర్థంగా వివరించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు.

152 మీటర్ల ఎత్తుపై కసరత్తు

తుమ్మిడిహట్టి బ్యారేజీ ఎత్తును 152 మీటర్లకు పెంచితే మహారాష్ట్ర వైపు ముంపు ఎంతవరకు ఉంటుందనే అంశంపై అధికారులు సాంకేతిక వివరాలను సిద్ధం చేస్తున్నారు. అదే సమయంలో బ్యారేజీ వద్ద లభించే నీటి పరిమాణం, దిగువ ప్రాంతాలకు నీటిని తరలించే అవకాశాలు, ప్రాజెక్టు నిర్వహణకు సంబంధించిన అంశాలను కూడా పరిశీలిస్తున్నారు. బ్యారేజీ ఎత్తును 150 మీటర్లుగా నిర్ణయిస్తే అక్కడి నుంచి ఎల్లంపల్లి రిజర్వాయర్ వరకు ఎంత నీటిని తరలించవచ్చనే అంశంపైనా లెక్కలు రూపొందించినట్లు సమాచారం. ఈ వివరాలపై ముఖ్యమంత్రి ఇప్పటికే అధికారులతో చర్చించి ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలపై అవగాహనకు వచ్చినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ముంబై సమావేశంలో సాంకేతిక నివేదికలు, నీటి మళ్లింపు ప్రతిపాదనలు, ముంపు అంచనాలను మహారాష్ట్ర ప్రభుత్వానికి వివరించే అవకాశం ఉంది. ఇరు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదిరితే ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి తదుపరి చర్యలు వేగవంతమయ్యే అవకాశం ఉంది. తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణం కార్యరూపం దాల్చితే ఉత్తర తెలంగాణలో సాగునీటి అవసరాలకు గణనీయమైన ఊరట లభించనుంది. ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని సాగునీటి తరువాయి 2లో..



ఏఐని భూతంలా చూడొద్దు

- మార్పులకు అనుగుణంగా నైపుణ్యాలు పెంచుకోవాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- హైదరాబాద్‌లో రాండమ్ ట్రీస్ కార్యాలయం ప్రారంభం

2

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ను ఉద్యోగాలను హరించే భూతంలా కాకుండా, కొత్త అవకాశాలను సృష్టించే సాంకేతిక పరిజ్ఞానంగా చూడాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ యువతకు పిలుపునిచ్చారు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకుంటూ, కొత్త ఆవిష్కరణలకు సిద్ధం కావాలని సూచించారు. డేటా, ఏఐ, ఇన్నోవేషన్ రంగాల్లో పనిచేస్తున్న రాండమ్ ట్రీస్ సంస్థ భారత ప్రధాన కార్యాలయాన్ని శనివారం హైదరాబాద్‌లో కేటీఆర్ ప్రారంభించారు.

రేపు ముంబైకి సీఎం రేవంత్ బృందం

(మొదటిపేజీ తరువాయి)

సమస్యలను పరిష్కరించేందుకు ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అయితే బ్యారేజీ నిర్మాణం, నీటి వినియోగం, అంతర్రాష్ట్ర సమన్వయం వంటి అంశాలపై మహారాష్ట్ర సహకారం కీలకం కానుంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి స్థాయిలో జరిగే చర్చలు ప్రాజెక్టు భవిష్యత్తుకు కీలకంగా మారనున్నాయి. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుతూనే మహారాష్ట్ర అభ్యంతరాలను పరిష్కరించగలిగితే తుమ్మిడిహట్టి ప్రాజెక్టుపై ముందడుగు పడే అవకాశం ఉంది. సమావేశంలో కుదిరే అవగాహన, తదుపరి కార్యాచరణపై సాగునీటి వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

మంగళవారానికి కేఆర్ఎంబీ సమావేశం వాయిదా

సోమవారం జరగాల్సిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) సమావేశం వాయిదా పడింది. అదే రోజు ముంబైలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో రేవంత్‌రెడ్డి సమావేశం ఉన్నందున, కేఆర్ఎంబీ భేటీని వాయిదా వేయాలని తెలంగాణ ప్రభుత్వం కోరింది. ఈ విజ్ఞప్తికి బోర్డు అంగీకరించడంతో సమావేశాన్ని సోమవారం నుంచి మంగళవారానికి మార్చారు. ఒకవైపు తుమ్మిడిహట్టి బ్యారేజీపై మహారాష్ట్రతో చర్చలకు ముఖ్యమంత్రి సిద్ధమవుతుండగా, మరోవైపు కృష్ణా జలాలకు సంబంధించిన అంశాలపై కేఆర్ఎంబీ సమావేశం జరగనుంది. రాష్ట్ర సాగునీటి ప్రయోజనాలకు సంబంధించిన రెండు కీలక పరిణామాలు వరుసగా చోటుచేసుకోనున్న నేపథ్యంలో ఈ సమావేశాలపై ప్రాధాన్యత ఏర్పడింది.

ఫ్రాన్స్‌లో మళ్లీ నిరసనల సెగ

- 70 వేల మంది పోలీసులతో భద్రత

పారిస్: ఫ్రాన్స్‌లో జీవన వ్యయం పెరుగుదల, విద్యార్థుల సమస్యలపై మరోసారి భారీ నిరసనలకు రంగం సిద్ధమైంది. 'ఎల్లో వెస్ట్స్' ఉద్యమకారులు, కార్మిక సంఘాలు, విద్యార్థులు శనివారం దేశవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునిచ్చారు. పారిస్‌లో ముందుగా నిర్ణయించిన ర్యాలీ మార్గాన్ని పోలీసులు చివరి నిమిషంలో మార్చడంపై వామపక్ష నేతలు, నిరసన నిర్వాహకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పోలీసుల ఆదేశాలు ఉన్నప్పటికీ, తొలుత నిర్ణయించిన బాస్టిల్ నుంచి నేషన్ వరకు ఉన్న మార్గంలోనే ర్యాలీ నిర్వహిస్తామని స్పష్టం చేశారు. గత వారం జరిగిన నిరసనల్లో హింస చెలరేగిన నేపథ్యంలో అధికారులు భద్రతను కట్టుదిట్టం చేశారు. దేశవ్యాప్తంగా 70 వేల మంది పోలీసులను మోహరిస్తున్నట్లు అంతర్గత వ్యవహారాల మంత్రి ప్రకటించారు. హెలికాప్టర్లు, సాయుధ వాహనాలు, వాటర్ కేనన్లను కూడా సిద్ధం చేశారు. దేశవ్యాప్తంగా 700కు పైగా 'ఎల్లో వెస్ట్స్' నిరసనలు జరగనున్నట్లు సమాచారం. గత వారం ఆందోళనల్లో ఐదు లక్షల మందికి పైగా పాల్గొనగా, కొన్ని ప్రాంతాల్లో వ్యాపార సంస్థలు, ప్రభుత్వ భవనాలపై దాడులు జరిగాయి. ఈ హింసకు సంబంధించి 217 మందికి జైలు శిక్షలు విధించినట్లు న్యాయశాఖ మంత్రి తెలిపారు.

ఏఐని భూతంలా చూడొద్దు

ప్రజానావ, హైదరాబాద్: ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ను ఉద్యోగాలను హరించే భూతంలా కాకుండా, కొత్త అవకాశాలను సృష్టించే సాంకేతిక పరిజ్ఞానంగా చూడాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ యువతకు పిలుపునిచ్చారు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకుంటూ, కొత్త ఆవిష్కరణలకు సిద్ధం కావాలని సూచించారు. డేటా, ఏఐ, ఇన్నోవేషన్ రంగాల్లో పనిచేస్తున్న రాండమ్ ట్రీస్ సంస్థ భారత ప్రధాన కార్యాలయాన్ని శనివారం హైదరాబాద్‌లో కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి సాంకేతిక విప్లవం మొదట భయాలు, సందేహాలను సృష్టించినా.. ఆ తర్వాత కొత్త రంగాలు, ఉపాధి అవకాశాలకు మార్గం సుగమం చేసిందన్నారు. గతంలో బ్యాంకింగ్ రంగంలో కంప్యూటర్ల ప్రవేశాన్ని వ్యతిరేకించిన విషయాన్ని గుర్తుచేశారు. మార్పులను అడ్డుకోవడం కంటే వాటికి అనుగుణంగా మారడమే అభివృద్ధికి మార్గమని పేర్కొన్నారు. స్కిల్లింగ్, అప్‌స్కిల్లింగ్, రీస్కిల్లింగ్‌తో పాటు నిరంతరం కొత్త విషయాలను నేర్చుకోవడం నేటి ఉద్యోగ ప్రపంచంలో కీలకమని చెప్పారు. ప్రభుత్వాలు అందరికీ ఉద్యోగాలు కల్పించడం సాధ్యం కాదని, ప్రైవేట్ రంగం అభివృద్ధి చెందేందుకు అనుకూల వాతావరణాన్ని సృష్టించడం ముఖ్యమని అన్నారు. పెట్టుబడిదారులకు అడ్డంకులు లేకుండా చూడటం, వ్యాపార నిర్వహణను సులభతరం చేయడం, రహదారులు, విద్యుత్, నీరు, రవాణా, పట్టణ మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం ద్వారా ఉపాధి అవకాశాలను పెంచొచ్చని వివరించారు. గత పదేళ్లలో తెలంగాణలో ఐటీ రంగం అభివృద్ధికి, హైదరాబాద్‌ను అంతర్జాతీయ సంస్థలకు ఆకర్షణీయమైన గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు తమ ప్రభుత్వం కృషి చేసిందని తెలిపారు. నగరం ఐటీ సేవలకే పరిమితం కాకుండా ఏఐ పరిశోధన, డేటా సైన్స్, ఉత్పత్తుల అభివృద్ధి, సాంకేతిక ఆవిష్కరణలకు కేంద్రంగా ఎదగాలని ఆకాంక్షించారు. రాండమ్ ట్రీస్ వంటి సంస్థల విస్తరణతో సాంకేతిక రంగానికి, యువత ఉపాధికి మరింత ఊతం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సిరిసిల్లలో చేపట్టిన 'సాగు – బాగు' కార్యక్రమాన్ని ప్రస్తావిస్తూ.. పంటలకు సోకే చీడపీడలను ఫొటోల ద్వారా గుర్తించి, నివారణ సూచనలు అందించే సాంకేతిక పరిష్కారాలను ప్రయోగాత్మకంగా వినియోగించినట్లు కేటీఆర్ వివరించారు. వ్యవసాయం, వైద్యం, విద్య, పరిశ్రమలు, ప్రభుత్వ సేవల్లో ఆధునిక సాంకేతికతతో సేవల నాణ్యతను మెరుగుపరచవచ్చన్నారు. సాంకేతిక పరిజ్ఞానం సామాన్యులకు సైతం అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. స్విగ్గీ, జొమాటో, జెప్టో, బ్లింకిట్ వంటి డిజిటల్ వేదికలు కొత్త వ్యాపార నమూనాలు, ఉపాధి అవకాశాలకు దోహదపడ్డాయని చెప్పారు. ఏఐ ఆధారిత స్టార్టప్‌లు కూడా భవిష్యత్తులో కొత్త ఉద్యోగాలను సృష్టించే అవకాశముందన్నారు. ప్రభుత్వాలు, పరిశ్రమలు, విద్యాసంస్థలు సమన్వయంతో పనిచేసి యువతకు పరిశ్రమ అవసరాలకు తగిన నైపుణ్యాలు అందించాలని సూచించారు.

అల్లూరి జిల్లాలో భారీ పేలుడు

- జిలెటిన్ స్టిక్స్ పేలి ఓ ప్రభుత్వ ఉపాధ్యాయురాలితో సహా ఏడుగురు దుర్మరణం

ప్రజానావ, హైదరాబాద్: ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లాలో శనివారం ఉదయం ఘోర ప్రమాదం సంభవించింది. అనంతగిరి మండలం పీసుమామిడి ఘాట్ రోడ్డులో నిర్మాణ పనుల్లో భాగంగా జిలెటిన్ స్టిక్స్ పేలడంతో ఏడుగురు మృతి చెందారు. మృతుల్లో, విధి నిర్వహణకు వెళుతున్న ప్రభుత్వ ఉపాధ్యాయురాలు కూడా ఉండటం తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘటనలో ఒక బొలెరో, ఒక టిప్పర్ వాహనాలు పూర్తిగా కాలిపోయాయి. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. రోడ్డు విస్తరణ పనుల కోసం రాళ్లను పగలగొట్టేందుకు బొలెరో వాహనంలో జిలెటిన్ స్టిక్స్ ఉంచారు. సమీపంలో ఉన్న టిప్పర్‌కు డీజిల్ నింపుతుండగా ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుంది. ఈ మంటలు వేగంగా వ్యాపించి జిలెటిన్ స్టిక్స్ ఉన్న వాహనానికి అంటుకోవడంతో భారీ పేలుడు సంభవించింది. ఈ దుర్ఘటనలో విశాఖపట్నం నుంచి మద్దిరేబు ఎంపీపీ పాఠశాలకు వెళుతున్న ఉపాధ్యాయురాలు విశాఖకు చెందిన సునీతతో పాటు కార్మికులు దేవరాపల్లికి చెందిన మణి, చీడికాడకకు చెందిన నారాయణరావు, కడపకు చెందిన పవన్ కుమార్, కడపకు చెందిన డ్రైవర్ ప్రవీణ్, అసోంకు చెందిన హెల్పర్ నసీరుద్దీన్, బీహార్ కు చెందిన ఆపరేటర్ టింకు ప్రాణాలు కోల్పోయారు. అయితే ఈ పేలుడులో మృతదేహాలు గుర్తుపట్టలేని విధంగా ఉన్నట్లు తెలుస్తోంది. అనంతగిరి మండల కేంద్రానికి సుమారు 90 కిలోమీటర్ల దూరంలో ప్రమాదం చోటు చేసుకుంది. గుత్తేదారు రోడ్డు నిర్మాణ పనులు నిమిత్తం జిలెటిన్ స్టిక్స్ తీసుకున్న సమయంలో పేలుడు సంభవించిందని సమాచారం. రోడ్డు నిర్మాణ పనులు జరుగుతుండగా ఈ పేలుడు జరిగినట్లు తెలుస్తోంది. విషయం తెలుసుకున్న అధికారులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు.

ప్రమాదంపై స్పందించిన హోం మంత్రి అనిత

అల్లూరి జిల్లాలోని అనంతగిరి మండలం పినకోట ప్రాంతంలో పేలుడు ఘటనపై హోం మంత్రి వంగలపూడి అనిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పేలుడు జరగడం అత్యంత బాధాకరం అన్నారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన వారి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. అల్లూరి జిల్లా కలెక్టర్, ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడిన హోం మంత్రి అనిత.. పేలుడు ఘటనపై ఆరా తీశారు. పేలుడు ఘటనలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను అనిత ఆదేశించారు. ఘటనాస్థలిలో బాధితులకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రమాద బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఈ దుర్ఘటనపై వైసీపీ అధినేత జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనలో మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్ తప్పిదాలకు రైతాంగం బలి

ప్రజానావ, హైదరాబాద్: రైతులకు సాగునీటి భరోసా కల్పించాల్సిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టుల రీడిజైన్ పేరుతో తెలంగాణను అప్పుల ఊబిలోకి నెట్టిందని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును మొదట ప్రతిపాదించిన విధంగా పూర్తి చేయకుండా, దాని స్వరూపాన్ని మార్చి కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో మేడిగడ్డను కేంద్రంగా చేసుకోవడం బీఆర్ఎస్ చేసిన చారిత్రక తప్పిదమని ఆరోపించారు. భారీగా అప్పులు తెచ్చి ఖర్చు చేసినప్పటికీ ఎస్ఎల్‌బీసీ, దేవాదుల, సీతారామ తదితర కీలక ప్రాజెక్టులను అసంపూర్తిగా వదిలేయడంతో రాష్ట్రానికి ఆశించిన సాగునీటి ప్రయోజనాలు అందలేదన్నారు. ఈ ప్రాజెక్టులన్నీ పూర్తయి ఉంటే ప్రస్తుతం ఎదురవుతున్న ఎల్‌నినో ప్రభావిత కరువు పరిస్థితులను మరింత సమర్థంగా ఎదుర్కొనే అవకాశం ఉండేదని పేర్కొన్నారు. సచివాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణం, నిర్వహణలో చోటుచేసుకున్న వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే బీఆర్ఎస్ నాయకులు ఇప్పుడు తప్పుడు ప్రచారానికి దిగుతున్నారని మండిపడ్డారు. ఎల్‌నినో వంటి ప్రకృతి పరిస్థితులను సైతం రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. అబద్ధాల ప్రచారంలో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు జర్మనీ నాజీ నాయకుడు జోసెఫ్ గోబెల్స్‌ను మించిపోయారని వ్యాఖ్యానించారు.

ప్రాణహిత–చేవెళ్లను మార్చి రైతులకు అన్యాయం

ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును సుమారు రూ.38 వేల కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదించారని, దాన్ని మొదట అనుకున్న విధంగా పూర్తి చేసి ఉంటే ఉత్తర తెలంగాణలో సాగునీటి వ్యవస్థ మరింత బలోపేతమయ్యేదని మంత్రి తెలిపారు. ప్రాజెక్టు రూపకల్పనను మార్చడం ద్వారా రైతులకు వాగ్దానం చేసిన ప్రయోజనాలు అందకుండా పోయాయని ఆరోపించారు. రాష్ట్రంపై భారీ ఆర్థిక భారం పడటమే కాకుండా, దీర్ఘకాలిక సాగునీటి అవసరాలు కూడా తీరలేదన్నారు. ప్రాజెక్టుల నిర్మాణంలో రైతుల ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన చోట ఇతర అంశాలకు ప్రాధాన్యం ఇచ్చారని విమర్శించారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం సాగునీటి రంగానికి భారీగా నిధులు ఖర్చు చేసినట్లు చెప్పుకున్నప్పటికీ, కీలక ప్రాజెక్టులను పూర్తి చేయడంలో విఫలమైందని ఉత్తమ్ అన్నారు. కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, ఎస్ఎల్‌బీసీ, దేవాదుల, సీతారామ ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేసి ఉంటే రైతాంగానికి ప్రస్తుతం ఎదురవుతున్న కష్టాలు కొంతమేర తగ్గేవని అభిప్రాయపడ్డారు. పాలమూరు–రంగారెడ్డి, సీతారామ ప్రాజెక్టుల ద్వారా వాస్తవంగా ఎన్ని ఎకరాలకు సాగునీరు అందించారో బీఆర్ఎస్ నాయకులు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ఎస్ఎల్‌బీసీ సొరంగాన్ని ఎందుకు పూర్తిచేయలేకపోయారని నిలదీశారు. ప్రాజెక్టుల నిర్మాణం పూర్తికాకపోవడం వల్లే వర్షపాతం లోటు, భూగర్భజలాల తగ్గుదల వంటి పరిస్థితులు ఏర్పడినప్పుడు రైతులకు ప్రత్యామ్నాయ సాగునీటి భరోసా కల్పించడం కష్టమవుతోందని పేర్కొన్నారు. పదేళ్లలో తెచ్చిన అప్పులను సద్వినియోగం చేసి, సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి ఉంటే ఎల్‌నినో ప్రభావం రైతాంగంపై ఇంత తీవ్రంగా పడేది కాదని అన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణం, డిజైన్, నిర్వహణలో లోపాలను గత ప్రభుత్వ హయాంలోనే జాతీయ ఆనకట్టల భద్రతా ప్రాధికార సంస్థ (ఎన్‌డీఎస్‌ఏ) గుర్తించిందని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పేలవమైన డిజైన్, నిర్మాణ లోపాలే మూడు బ్యారేజీల ప్రస్తుత దుస్థితికి కారణమని ఆరోపించారు. సాంకేతిక పరిశీలనలు, న్యాయ విచారణలు, విజిలెన్స్ నివేదికలు కూడా ఈ అంశాలను స్పష్టం చేశాయని పేర్కొన్నారు. బ్యారేజీల భద్రతకు సంబంధించి గేట్లను ఎత్తి ఉంచాలని డ్యామ్ సేఫ్టీ అథారిటీ లిఖితపూర్వకంగా సూచించిందని గుర్తుచేశారు. నిర్మాణాల్లోని లోపాలను సరిదిద్దకుండా, తమ హయాంలో జరిగిన తప్పిదాలకు బాధ్యత వహించకుండా బీఆర్ఎస్ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. అవినీతి, స్వార్థ ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రజలను, రైతాంగాన్ని ఇబ్బందుల్లోకి నెట్టి, ఇప్పుడు రాజకీయ నాటకాలకు తెరతీస్తున్నారని మండిపడ్డారు. మూడు బ్యారేజీలు నిరుపయోగంగా ఉన్నప్పటికీ, ప్రస్తుత ప్రభుత్వం గోదావరి బేసిన్‌లో రికార్డు స్థాయిలో సాగునీరు అందించిందని మంత్రి పేర్కొన్నారు. కృష్ణా, గోదావరి బేసిన్లలో సాగు విస్తీర్ణం, పంట ఉత్పత్తి పెరిగాయని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నాయకత్వంలో వరి సాగు, ధాన్యం కొనుగోళ్లలో రికార్డులు నమోదయ్యాయని వెల్లడించారు. బ్యారేజీలను వినియోగించుకోలేని పరిస్థితుల్లోనూ సాగునీటి నిర్వహణ, రైతులకు మద్దతు విషయంలో ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

2027 వర్షాకాలానికి ముందే పునరుద్ధరణ లక్ష్యం

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణకు ప్రభుత్వం నిర్దిష్ట గడువులతో కార్యాచరణ రూపొందించిందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. దేశీయ, అంతర్జాతీయ నిపుణుల సలహాలు తీసుకుంటూ సాంకేతికంగా పటిష్టమైన పరిష్కారాల దిశగా ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. పునరుద్ధరణ పనులను నాలుగు కీలక దశలుగా విభజించినట్లు వివరించారు. ప్రాథమిక నమూనాలు, కాన్సెప్ట్ డిజైన్ల రూపకల్పనను సెప్టెంబరు నెలాఖరుకు పూర్తి చేసినట్లు చెప్పారు. అంచనాల తయారీ, ప్రభుత్వ ఆమోదాలను అక్టోబరు నెలాఖరుకు పొందాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. పనులు చేపట్టే ఏజెన్సీల సన్నద్ధత, అవసరమైన వనరుల సమీకరణను నవంబరు నెలాఖరుకు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. అన్ని పనివిభాగాల్లో డిసెంబరు నెలాఖరుకు పనులు ప్రారంభించి, సాంకేతిక అనుమతులు, పనుల పురోగతికి అనుగుణంగా 2027 వర్షాకాలానికి ముందే పునరుద్ధరణ పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు వెల్లడించారు. బ్యారేజీల పునరుద్ధరణకు అవసరమైన పరిశోధనలు, పరీక్షల కోసం కేంద్ర జల, విద్యుత్ పరిశోధన కేంద్రం (సీడబ్ల్యూపీఆర్ఎస్)ను నియమించినట్లు మంత్రి తెలిపారు. డిజైన్ల రూపకల్పనలో ఐఐటీ బాంబేతో కలిసి ఏఎఫ్ఆర్వై సంస్థ పనిచేస్తోందన్నారు. జాతీయ ఆనకట్టల భద్రతా ప్రాధికార సంస్థ సిఫార్సులకు అనుగుణంగా పునరుద్ధరణ పనులను సమన్వయం చేసేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ కమిటీలో సాంకేతిక నిపుణులతో పాటు నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ, సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్, రాష్ట్ర ఆనకట్టల భద్రతా సంస్థ ఉన్నతాధికారులు భాగస్వాములుగా ఉన్నారని వివరించారు. కేంద్ర జలశక్తి శాఖ 2026 జూన్ 30న ఏర్పాటు చేసిన టెక్నికల్ ఓవర్‌సైట్ కమిటీ (టీవోసీ) ఇప్పటికే పునరుద్ధరణ వ్యూహాన్ని సమీక్షించిందన్నారు. జూలై 31, అక్టోబరు 14 తేదీల్లో ఢిల్లీలో జరిగిన సమావేశాల్లో ఈ అంశాలపై చర్చించినట్లు తెలిపారు. పునరుద్ధరణ డిజైన్లు, అదనపు పనులు టీవోసీతో పాటు కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) సాంకేతిక పరిశీలనకు లోబడి ఉంటాయని స్పష్టం చేశారు. నిపుణుల పరిశీలనలు, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా మాత్రమే పనులకు తుది రూపం ఇస్తామని పేర్కొన్నారు. మూడు బ్యారేజీల పునరుద్ధరణలో భాగంగా స్టిల్లింగ్ బేసిన్ల పొడవును పెంచేందుకు ప్రాథమిక నమూనాల్లో ప్రతిపాదనలు రూపొందించినట్లు ఉత్తమ్ వివరించారు. బ్యారేజీల నిర్మాణ భద్రతను మెరుగుపరిచే దిశగా ఈ మార్పులను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. మేడిగడ్డ బ్యారేజీ స్టిల్లింగ్ బేసిన్ ప్రస్తుత పొడవు 46.8 మీటర్లు ఉండగా, దాన్ని 66 మీటర్లకు పెంచాలని ప్రతిపాదించినట్లు వెల్లడించారు. అన్నారం బ్యారేజీ స్టిల్లింగ్ బేసిన్ పొడవును 45 మీటర్ల నుంచి 66 మీటర్లకు, సుందిళ్ల బ్యారేజీ స్టిల్లింగ్ బేసిన్ పొడవును 30 మీటర్ల నుంచి 58 మీటర్లకు పెంచేలా ప్రాథమిక నమూనాలు సిద్ధం చేసినట్లు చెప్పారు. ఈ ప్రతిపాదనలు తదుపరి సాంకేతిక పరిశీలనలు, అనుమతులకు లోబడి ఉంటాయని వివరించారు. పునరుద్ధరణ పనుల సమయంలోనే కాకుండా, పనులు పూర్తయిన తరువాత కూడా బ్యారేజీల నిర్మాణాల పనితీరును నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు.

ఎల్‌నినోపై రాజకీయాలు చేయొద్దు

ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు సాగునీటి ప్రాజెక్టులు, జల వనరుల సమర్థ నిర్వహణ ఎంతో కీలకమని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వ హయాంలో కీలక ప్రాజెక్టులు పూర్తయి ఉంటే ప్రస్తుతం రైతాంగంపై కరువు ప్రభావం తగ్గేదని పేర్కొన్నారు. ప్రకృతి పరిస్థితులను రాజకీయ విమర్శలకు వేదికగా మార్చడం సరికాదన్నారు. గత ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు బీఆర్ఎస్ నాయకులు విషపూరిత ప్రచారం చేస్తున్నారని, తెలంగాణ ప్రజలు, రైతులు వాస్తవాలను గమనించాలని కోరారు. సాగునీటి రంగంలో గతంలో జరిగిన తప్పిదాలను సరిదిద్దడంతో పాటు, ప్రాజెక్టుల పునరుద్ధరణను సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. బ్యారేజీల పునరుద్ధరణలో ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదని, రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూర్చాలనే చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో మంత్రి వివేక్ వెంకటస్వామి, బ్యారేజీల పునరుద్ధరణ కార్యక్రమంతో అనుబంధం ఉన్న సొరంగ నిర్మాణ నిపుణుడు కల్నల్ పరీక్షిత్ మెహ్రా, ఇంజినీర్ ఇన్ చీఫ్ జనరల్ రమేశ్‌బాబు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సొంతింటి కల నెరవేరుస్తాం

- శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం
- చట్టపరమైన చిక్కులు లేకుండా కేటాయించేలా కార్యాచరణ
- సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ప్రజానావ, హైదరాబాద్: రాష్ట్రంలో ఏళ్ల తరబడి ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్న జర్నలిస్టుల ఆకాంక్షలను నెరవేరుస్తామని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. చట్టపరమైన చిక్కులు లేనివిధంగా, కుటుంబాలతో గౌరవంగా నివసించేందుకు అనువైన ప్రాంతాల్లో స్థలాలు అందించేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోందని శనివారం ప్రకటనలో తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో 2008లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీకి భూముల కేటాయింపునకు ఉత్తర్వులు జారీ అయ్యాయని గుర్తుచేశారు. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండటంతో స్థలాల పంపిణీ ప్రక్రియ దీర్ఘకాలం నిలిచిపోయిందన్నారు. 2022లో న్యాయపరమైన అడ్డంకులు తొలగినప్పటికీ సమస్యకు పూర్తిస్థాయి పరిష్కారం లభించలేదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే ఈ అంశంపై చొరవ తీసుకుందని తెలిపారు. దాదాపు రెండు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీకి 2024 సెప్టెంబర్ 8న రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో భూమిని అప్పగించినట్లు వెల్లడించారు. అయితే, సుప్రీంకోర్టు తుది ఉత్తర్వుల నేపథ్యంలో మరోసారి న్యాయపరమైన సమస్యలు ఎదురుకావడంతో శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ఈ అంశంపై సీఎం రేవంత్‌రెడ్డితోపాటు సహచర మంత్రులతో పలుమార్లు చర్చించి సమగ్రంగా సమీక్షించినట్లు తెలిపారు. గతంలో ఎదురైన న్యాయపరమైన సమస్యలు పునరావృతం కాకుండా, నివాసయోగ్యమైన ప్రాంతాల్లో స్థలాలు అందించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని భరోసా ఇచ్చారు. జర్నలిస్టులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారి సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు అందించామని, మరోసారి కాంగ్రెస్ పాలనలోనే ఈ సమస్యకు పరిష్కారం చూపుతామని పేర్కొన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ప్రజాస్వామ్యంలో కీలక పాత్ర పోషిస్తున్న జర్నలిస్టుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామని, వారి దీర్ఘకాలిక సమస్యను అందరికీ ఆమోదయోగ్యమైన రీతిలో పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి పొంగులేటి వివరించారు.

విద్యార్థుల ఉద్యోగ అవకాశాలను దెబ్బతీయొద్దు

- సీఎంకు హరీశ్ రావు బహిరంగ లేఖ



ప్రజానావ, హైదరాబాద్: తెలంగాణ ఇంజినీరింగ్ విద్యార్థుల ఉద్యోగ అవకాశాలను దెబ్బతీయొద్దని, నవంబర్ 6న జరగనున్న టీజీపీఎస్సీ ఏఈఈ పరీక్షను వెంటనే వాయిదా వేయాలని మాజీమంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఎస్ఎస్సీ జేఈ, టీజీపీఎస్సీ ఏఈఈ పరీక్షలు ఒకే తేదీలో ఉండటంతో వేలాది మంది తెలంగాణ ఇంజినీరింగ్ అభ్యర్థులు ఉద్యోగ అవకాశాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఆయన సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. శనివారం పలువురు ఇంజినీరింగ్ విద్యార్థులు హరీశ్ రావును ఆయన నివాసంలో కలిసి తమ సమస్యను ఆయనతో చెప్పుకున్నారు. దీనికి స్పందనగా హరీశ్ రావు సీఎంకు లేఖ రాశారు. ఇతర రాష్ట్రాల్లో ఎస్ఎస్సీ జేఈ పరీక్ష రాసే అభ్యర్థులు వెంటనే తెలంగాణకు తిరిగొచ్చి ఏఈఈ పరీక్ష రాయడం ఎలా సాధ్యమని ఆయన లేఖలో ప్రశ్నించారు. ఏళ్ల తరబడి కష్టపడి సిద్ధమైన రెండు పోటీ పరీక్షల్లో ఒకదాన్ని వదులుకోవాల్సిన దుస్థితిలో నిరుద్యోగ యువత ఉన్నారని తెలిపారు. పరీక్షల తేదీలు మార్చాలని పలుమార్లు విజ్ఞప్తులు చేసినా టీజీపీఎస్సీ స్పందించకపోవడం శోచనీయమన్నారు. పరీక్షల తేదీలను పునఃపరిశీలించాలని అక్టోబర్ 14నే టీజీపీఎస్సీకి మంత్రి కోమటిరెడ్డి లేఖ రాశారని గుర్తుచేశారు. నిరుద్యోగ యువత రెండు పరీక్షలు రాసే అవకాశం కల్పించాలని మాత్రమే కోరుతున్నారని, ఒడిశా, బీహార్ వంటి రాష్ట్రాల్లో పరీక్షల తేదీలు మార్చినప్పుడు తెలంగాణలో ఎందుకు సాధ్యం కాదని ప్రశ్నించారు. బేషజాలకు పోయి నిరుద్యోగ యువత భవిష్యత్తును బలి చేయవద్దని, తక్షణమే జోక్యం చేసుకొని నవంబర్ 6న జరగనున్న టీజీపీఎస్సీ ఏఈఈ (సివిల్) పరీక్షను వాయిదా వేయాలని, భవిష్యత్తులో ఇలాంటి గందరగోళం పునరావృతం కాకుండా ప్రభుత్వం, టీజీపీఎస్సీ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని హరీశ్ రావు విజ్ఞప్తి చేశారు.

నీటి రక్షణకు అధిక ప్రాధాన్యత కల్పించండి

- అధికారుల సమీక్షలో మంత్రి సీతక్క

ప్రజానావ, హైదరాబాద్: రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో నీటి ఎద్దడి, వ్యవసాయ రంగంలో ఎదురయ్యే సవాళ్లను దృష్టిలో ఉంచుకుని గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పన, నీటి సంరక్షణ, శాశ్వత ఆస్తుల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. వీబీ–జీ రామ్ జీ పథకం కింద అనుమతించిన పనులను ప్రాధాన్యత క్రమంలో విభజించాలని, వచ్చే ఎనిమిది నెలల కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని మంత్రి సూచించారు. పనుల పురోగతి క్షేత్రస్థాయిలో కనిపించాలని, కేవలం సమాధానాలతో సరిపెట్టవద్దని స్పష్టం చేశారు. ఎల్‌నినో నేపథ్యంలో ఉపాధి హామీ పనుల అమలుపై మంత్రి సీతక్క శనివారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ నెల 30వ తేదీలోగా మండలస్థాయి సమన్వయ కమిటీల ఆధ్వర్యంలో పనుల ప్రణాళికలను పూర్తి చేసి, నవంబర్ 1 నుంచి పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. పథకం కింద అనుమతించిన 370 రకాల పనులను ఒకేసారి చేపట్టకుండా.. స్థానిక అవసరాలు, వాతావరణ పరిస్థితులు, కూలీల లభ్యత ఆధారంగా ప్రాధాన్యత కేటాయించాలన్నారు. గుర్తించిన 318 రకాల పనుల్లో గ్రామాలకు అవసరమైన కనీసం 50 ముఖ్యమైన పనులను ఎంపిక చేసి లక్ష్యాల మేరకు పూర్తిచేయాలని సూచించారు. ప్రతి రెండు నెలలకోసారి సమీక్షించి తదుపరి పనులను గుర్తించాలన్నారు.

నీటి సంరక్షణకు పెద్దపీట..

ఎల్‌నినోతో నీటి కొరత ఏర్పడే అవకాశాలున్నందు వల్ల చెరువులు, కుంటల అభివృద్ధి, నీటి నిల్వలు, భూగర్భ జలాల పెంపు, కాలువల మరమ్మతులకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి సూచించారు. గ్రామాల్లో కమ్యూనిటీ హాళ్లు, పాఠశాలల ప్రహరీలు, గ్రామ సంఘాల భవనాలు, పశుగ్రాసం, పశువులకు నీటి తొట్టెల వంటి సామూహిక అవసరాలకు ఉపయోగపడే పనులను చేపట్టాలన్నారు. సాధ్యమైన సౌర విద్యుత్ సంబంధిత పనులను గుర్తించి, అందుబాటులో ఉన్న నిధులను వినియోగించుకోవాలని తెలిపారు. ఉపాధి కల్పనతో పాటు గ్రామాలకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూర్చే ఆస్తులను నిర్మించడమే లక్ష్యంగా ఉండాలని తెలిపారు.

గచ్చిబౌలిలో లెదర్ కామన్ ఫెసిలిటీ సెంటర్

- డిజైనింగ్ నుంచి బ్రాండింగ్ వరకు ఆర్టిజన్లకు చేయూత
- రుక్మాపూర్‌లో పర్యావరణహిత చర్మశుద్ధి పరిశ్రమలు
- ఎస్సీ యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం: మంత్రి శ్రీధర్‌బాబు

ప్రజానావ, హైదరాబాద్: రాష్ట్రంలో లెదర్ పరిశ్రమను బలోపేతం చేయడంతో పాటు, ఎస్సీ యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. ఇందులో భాగంగా గచ్చిబౌలిలో మూడున్నర ఎకరాల విస్తీర్ణంలో అంతర్జాతీయ ప్రమాణాలతో లెదర్ కామన్ ఫెసిలిటీ సెంటర్ (సీఎఫ్‌సీ)ను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం రుక్మాపూర్‌లో సుమారు వెయ్యి మందికి ఉపాధి కల్పించేలా పర్యావరణహిత చర్మశుద్ధి పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. శనివారం సచివాలయంలో తెలంగాణ లెదర్ ఇండస్ట్రీస్ ప్రమోషన్ కార్పొరేషన్ (టీజీఎల్ఐపీసీ) ఉన్నతాధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో లెదర్ పరిశ్రమ అభివృద్ధి, ఆర్టిజన్లకు ప్రోత్సాహం, ఉపాధి అవకాశాల కల్పనకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. గచ్చిబౌలిలో ఏర్పాటు చేయనున్న సీఎఫ్‌సీని హబ్ అండ్ స్పోక్ విధానంలో అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి వివరించారు. ఈ కేంద్రం ద్వారా రాష్ట్రంలోని లెదర్ ఆర్టిజన్లు తయారు చేసే ఉత్పత్తులకు అదనపు విలువను జోడించేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. ఉత్పత్తుల రూపకల్పన (డిజైనింగ్) నుంచి మార్కెటింగ్, బ్రాండింగ్ వరకు వారికి అవసరమైన మార్గనిర్దేశం చేస్తామని పేర్కొన్నారు. ఆధునిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా లెదర్ ఉత్పత్తులకు మెరుగైన గుర్తింపు, మార్కెట్ అవకాశాలు కల్పించడమే లక్ష్యమని తెలిపారు. ఎస్సీ యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ సంకల్పమని శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. లెదర్ రంగంలో నైపుణ్యాలు కలిగినవారికి పరిశ్రమల స్థాపన, ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్ వంటి అంశాల్లో సహకారం అందించేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. అలాగే, హుజూరాబాద్ నియోజకవర్గంలోని జమ్మికుంట, ఆర్మూర్‌లో సూక్ష్మ, చిన్న పరిశ్రమల క్లస్టర్ అభివృద్ధి కార్యక్రమం (ఎంఎస్ఈసీడీపీ) కింద ప్లగ్ అండ్ ప్లే విధానంలో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లను అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సదుపాయాల ద్వారా చిన్న, సూక్ష్మ పారిశ్రామికవేత్తలకు పరిశ్రమల నిర్వహణకు అవసరమైన మౌలిక వసతులు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. గతంలో లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (లిడ్‌క్యాప్)కు వివిధ ప్రాంతాల్లో కేటాయించిన భూముల వివరాలు, వాటి ప్రస్తుత పరిస్థితిపై క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి సమగ్ర నివేదిక అందించాలని సంబంధిత ఉన్నతాధికారులను మంత్రి ఆదేశించారు. భూముల వినియోగం, వాటి ద్వారా పరిశ్రమల అభివృద్ధికి ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, పరిశ్రమల శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి, టీజీఎల్ఐపీసీ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రశాంత్ కుమార్, తెలంగాణ స్టేట్ లెదర్ ఇండస్ట్రియల్ ప్రమోషన్ కో–ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ అధ్యక్షుడు డాక్టర్ ఆరేపల్లి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.





కృష్ణాకాంత్ పార్కులో చెరువు విస్తరణకు హైడ్రా శ్రీకారం

- 3 ఎకరాల నుంచి 12 ఎకరాలకు విస్తరణ
- వరద ముంపు నివారణే లక్ష్యం

ప్రజానావ, హైదరాబాద్ : నగరంలో వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా హైడ్రా చర్యలు చేపట్టింది. జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని కృష్ణాకాంత్ పార్కులో ఉన్న చెరువు విస్తరణ, లోతు పెంపు పనులను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. గతంలో 27 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువుకు జూబ్లీహిల్స్, వెంకటగిరి, కృష్ణానగర్, యూసుఫ్‌గూడ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు చేరేది. కాలక్రమంలో చెరువు ప్రాంతాన్ని కృష్ణాకాంత్ పార్కుగా అభివృద్ధి చేయడంతో జలవనరు కేవలం 3 ఎకరాలకే పరిమితమైంది. దీంతో ఐదు సెంటీమీటర్ల వర్షం కురిసినా కృష్ణానగర్, యూసుఫ్‌గూడ, అమీర్‌పేటలోని మైత్రీవనం పరిసర ప్రాంతాలు వరద ముంపునకు గురవుతున్నాయి. ఈ పరిస్థితిని మార్చి వరద నీటిని సమర్థంగా నిల్వ చేసేలా చెరువును అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనల మేరకు ప్రస్తుతం 3 ఎకరాలుగా ఉన్న చెరువును 12 ఎకరాలకు విస్తరించడంతోపాటు లోతు పెంచే పనులకు హైడ్రా శ్రీకారం చుట్టింది. చెరువు విస్తరణలో భాగంగా అక్కడి చెట్లను సురక్షితంగా, శాస్త్రీయ పద్ధతిలో తరలించేందుకు చర్యలు చేపట్టారు. ట్రీ ప్రొటెక్షన్ కమిటీ అనుమతులు లభించడంతో చెట్లను హైడ్రా అభివృద్ధి చేసిన సున్నం చెరువు సమీపంలో తిరిగి నాటాలని నిర్ణయించారు. ఈ పనులు కూడా త్వరలో ప్రారంభం కానున్నాయి.

పార్కు అందాలకు మరింత మెరుగులు

ప్రస్తుతం మురుగు నీటి నిలయంగా మారిన కృష్ణాకాంత్ పార్కు చెరువును వరద నీటి నిల్వకు అనువుగా తీర్చిదిద్దడంతోపాటు పర్యాటకులు, సందర్శకులకు ఆహ్లాదాన్ని అందించేలా అభివృద్ధి చేయనున్నారు. చెరువు లోతు పెంచి వరద నీరు సులభంగా చేరేలా ఇన్‌లెట్లను, నీరు నిండిన తర్వాత బయటకు వెళ్లేలా ఔట్‌లెట్లను ఆధునికీకరిస్తారు. చెరువు చుట్టూ కట్ట నిర్మించడంతోపాటు నడక మార్గాన్ని ఏర్పాటు చేస్తారు. ఇప్పటికే ఉన్న బహిరంగ వ్యాయామశాలకు అదనంగా మరో ఓపెన్ జిమ్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు. సందర్శకులు కూర్చునేందుకు అనువైన ఏర్పాట్లు చేయడంతోపాటు గజీబోలు, పిల్లల ఆట స్థలాన్ని అభివృద్ధి చేస్తారు. చెరువులోకి ఎవరూ వెళ్లకుండా రక్షణ కంచె ఏర్పాటు చేయనున్నారు. బోటు షికారుకు అనువైన వాతావరణాన్ని కల్పించడంతో పాటు చెరువు సహజ లక్షణాలను పునరుద్ధరించి పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాల పెరుగుదలకు దోహదపడేలా చర్యలు తీసుకుంటున్నారు. విమోస్ టెక్నోక్రాట్స్ పర్యవేక్షణలో ఈ అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి.

ప్రభుత్వ భూమికి రక్షణ కరువైందా?

- పంచవటి కాలనీలో 12 గుంటల స్థలంపై మూడు దశాబ్దాలుగా వివాదం
- కలెక్టర్ జోక్యం చేసుకోవాలి: బి. సాయిరెడ్డి

ప్రజానావ, మణికొండ : ప్రభుత్వ భూములను కాపాడాల్సిన అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందా? విలువైన ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు ఫిర్యాదులు అందుతున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని బీఆర్ఎస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ మాజీ అధ్యక్షుడు బి. సాయిరెడ్డి ప్రశ్నించారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పంచవటి కాలనీలో సర్వే నంబరు 42లో ఉన్న 12 గుంటల ప్రభుత్వ భూమి వ్యవహారంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సుమారు మూడు దశాబ్దాలుగా వివాదం కొనసాగుతున్నా శాశ్వత పరిష్కారం లభించకపోవడం అధికారుల పనితీరుపై అనుమానాలకు తావిస్తోందన్నారు. పంచవటి కాలనీ ఏర్పాటైన ప్పటి నుంచే సదరు ప్రభుత్వ భూమిని అన్యాక్రాంతం చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని, ఈ ప్రయత్నాలను రాఘవరెడ్డి, లక్ష్మణ్, రమేష్ తదితరులు అడ్డుకుంటూ వస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని సంబంధిత తహసీల్దార్‌కు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఆశించిన స్థాయిలో చర్యలు కనిపించడం లేదని విమర్శించారు. ప్రభుత్వ స్థలాలను గుర్తించేందుకు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు సైతం రాత్రికి రాత్రే మాయమవుతున్నాయని ఆరోపించారు. ఈ వ్యవహారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి భూమి హద్దులను నిర్ధారించడంతోపాటు ప్రభుత్వ ఆస్తికి రక్షణ కల్పించాలని కోరారు. కేవలం తనిఖీలకే పరిమితం కాకుండా అందిన ఫిర్యాదులపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని సూచించారు. పంచవటి కాలనీలోని సర్వే నంబరు 42లో ఉన్న 12 గుంటల భూమి వ్యవహారంలో జిల్లా కలెక్టర్, రెవెన్యూ ఉన్నతాధికారులు తక్షణమే జోక్యం చేసుకోవాలని సాయిరెడ్డి డిమాండ్ చేశారు. భూమిని పూర్తిస్థాయిలో సర్వే చేసి, ప్రభుత్వ యాజమాన్యాన్ని నిర్ధారించి, ఆక్రమణలకు అవకాశం లేకుండా పటిష్ఠమైన చర్యలు చేపట్టాలని కోరారు. భూమి స్థితిగతులను పారదర్శకంగా వెల్లడించి, చట్టప్రకారం ప్రజాప్రయోజనాల కోసం వినియోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో జాప్యం జరిగితే ఆక్రమణలకు అవకాశం ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి సర్వే నంబరు 42లోని భూమిపై కొనసాగుతున్న వివాదాన్ని పరిష్కరించి, ప్రభుత్వ భూమికి శాశ్వత రక్షణ కల్పించాలని కోరారు. ఈ వ్యవహారంపై సంబంధిత రెవెన్యూ అధికారుల వివరణ, భూమికి సంబంధించిన అధికారిక రికార్డుల పరిశీలనతోనే పూర్తి వాస్తవాలు వెల్లడికానున్నాయి.

ప్రశాంత్‌నగర్‌లో 2.20 ఎకరాల పార్కులను కాపాడిన హైడ్రా

- అన్యాక్రాంతమైన పార్కు స్థలాలకు విముక్తి

ప్రజానావ, మియాపూర్ : ప్రభుత్వ, ప్రజా అవసరాల కోసం కేటాయించిన పార్కు స్థలాలను ఆక్రమణల నుంచి కాపాడేందుకు హైడ్రా చర్యలు చేపట్టింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం మియాపూర్ లోని ప్రశాంత్‌నగర్ కాలనీలో 2.20 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పార్కు స్థలాలను పరిరక్షించింది. ఈ ప్రాంతంలో 45 ఎకరాలు, 30 ఎకరాల పరిధిలో రెండు దశల్లో ఏర్పాటు చేసిన లేఅవుట్లలో మొత్తం 10 పార్కులను కేటాయించారు. హెచ్ఎండీఏ అనుమతులు పొందిన ఈ లేఅవుట్లలో నాలుగు పార్కులు ఆక్రమణలకు గురయ్యాయి. మరో పార్కును జీహెచ్ఎంసీ అభివృద్ధి చేయగా, మిగిలిన పార్కు స్థలాలను సైతం ఆక్రమించేందుకు కొందరు చిన్న గదులు, షెడ్లు నిర్మించారు. పార్కు స్థలాలను పార్కింగ్ కోసం వినియోగించుకుంటూ ఆక్రమణలకు పాల్పడుతున్నారని ప్రశాంత్‌నగర్ కాలనీ నివాసితులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన హైడ్రా అధికారులు సంబంధిత శాఖల అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆక్రమణలను నిర్ధారించారు. అనంతరం తక్షణ చర్యలు చేపట్టి 2.20 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పార్కు స్థలాల్లో నిర్మించిన షెడ్లను తొలగించారు. పార్కు స్థలాలుగా గుర్తిస్తూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతోపాటు, భవిష్యత్తులో ఆక్రమణలకు తావులేకుండా రక్షణ చర్యల్లో భాగంగా పార్కుల చుట్టూ ఫెన్సింగ్ వేశారు. ప్రజలకు ఉపయోగపడాల్సిన పార్కు స్థలాలను పరిరక్షిస్తూ హైడ్రా చర్యలు చేపట్టింది.







సున్నం చెరువు వద్ద అక్రమ నీటి దందాకు హైడ్రా చెక్

ఇళ్లలోనే బోర్లు.. భూగర్భ పైపులతో నీటి తరలింపు.. 15 బోర్లు తొలగింపు

ప్రజానావ, హైదరాబాద్ : సున్నం చెరువు పరిసరాల్లో సాగుతున్న అక్రమ నీటి వ్యాపారంపై హైడ్రా భారీ ఆపరేషన్ చేపట్టింది. ఇళ్లలో, పడక గదుల్లో, వంటగదుల్లో బోర్లు వేసి, అధిక సామర్థ్యం గల మోటార్లతో నీటిని తోడుతూ భూగర్భంలో వందల మీటర్ల పొడవున పైపులు వేసి తరలిస్తున్న వ్యవహారాన్ని వెలుగులోకి తెచ్చింది. ఒకచోట బోరు వేసి, మరోచోట ట్యాంకులు ఏర్పాటు చేసి, భారీ నీటి ట్యాంకర్ల ద్వారా నీటిని తరలించి చిన్న ట్యాంకర్లలో నింపి విక్రయిస్తున్న తీరును మీడియా సమక్షంలో బయటపెట్టింది. వెంటనే రంగంలోకి దిగిన హైడ్రా అక్రమ నీటి వ్యాపారానికి అడ్డుకట్ట వేసింది. సీఎంసీ, రెవెన్యూ, జలమండలి అధికారులతో కలిసి సంయుక్తంగా నిర్వహించిన ఈ ఆపరేషన్‌లో నవభారత్‌నగర్, బోరబండ ఫేజ్–3 ప్రాంతాల్లో అక్రమంగా ఏర్పాటు చేసిన బోర్లను తొలగించింది. మధ్యాహ్నం వరకు 15 బోర్లను ప్రత్యక్షంగా తొలగించడంతోపాటు, వాటికి అనుసంధానంగా ఉన్న భూగర్భ పైపులనూ పెద్ద సంఖ్యలో తొలగించింది. ఈ తనిఖీలను మరింత విస్తరించాలని హైడ్రా నిర్ణయించింది.

అక్రమ నీటి దందాతో చెరువుకు నష్టం

సున్నం చెరువు పూర్తి స్థాయి నీటి మట్టం (ఎఫ్‌టీఎల్) పరిధిలోనే పెద్ద సంఖ్యలో బోర్లు వేసి నీటిని విక్రయిస్తున్న వ్యవహారంపై గతంలోనూ హైడ్రా చర్యలు చేపట్టింది. కాలుష్య నియంత్రణ మండలి పరీక్షల్లో అక్కడి బోరు నీటిలో కాడ్మియం, సీసం, నికెల్ వంటి ప్రమాదకర లోహాలు అధికంగా ఉన్నట్లు వెల్లడైందని అధికారులు తెలిపారు. ఈ నీటిని తాగడం వల్ల కాలేయ సమస్యలు, క్యాన్సర్ వంటి తీవ్రమైన అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదంతోపాటు గర్భస్రావాలు జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇలాంటి నీటిని మాదాపూర్‌లోని వసతి గృహాలు, హోటళ్లకు సరఫరా చేస్తూ సొమ్ము చేసుకుంటున్న వారిపై చర్యలు చేపట్టారు. సున్నం చెరువు అభివృద్ధిలో భాగంగా అందులో పేరుకుపోయిన సుమారు పది అడుగుల వ్యర్థాలను తొలగించడంతో నీరు భూమిలోకి ఇంకడం ప్రారంభమైందని, తద్వారా భూగర్భ జలాలు పెరిగాయని హైడ్రా అధికారులు తెలిపారు. అయితే ఈ ప్రయోజనాలు స్థానికులకు దక్కకుండా పరిసర ప్రాంతాల్లో భారీగా బోర్లు వేసి నీటిని తోడేస్తున్నారని ఫిర్యాదులు అందడంతో తాజా చర్యలకు ఉపక్రమించారు. పెద్ద సంఖ్యలో ట్యాంకర్లతో నీటిని తరలిస్తున్నారని, చెరువులోకి వర్షాకాలం ఆరంభంలో చేరిన నీటిని సైతం పరిసరాల్లోని బోర్ల ద్వారా తోడేస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు.

ఇళ్లలో పడకల కిందే బోర్లు

సున్నం చెరువు సమీపంలోని నివాసాల్లో ఆశ్చర్యం కలిగించే రీతిలో బోర్లు ఏర్పాటు చేసినట్లు హైడ్రా గుర్తించింది. పడకల కింద, వంటగదుల్లో, నీటి సంపుల్లో భారీ బోర్లు వేసి మోటార్లతో నీటిని తోడుతున్నట్లు గుర్తించి, స్థానికుల సమక్షంలో మోటార్లతో సహా వాటిని తొలగించింది. ఉదయం ఆరున్నర గంటలకు ప్రారంభమైన ఈ ఆపరేషన్ సాయంత్రం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా స్థానికులు తమ నీటి కష్టాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. గతంలో 60 అడుగుల లోతులోనే నీరు పడేదని, ప్రస్తుతం 600 అడుగుల వరకు బోర్లు వేసినా నీరు లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ బోర్లు ఎండిపోవడంతోపాటు మోటార్లు కాలిపోతున్నాయని, దీంతో తాము డబ్బులు పెట్టి నీటిని కొనుగోలు చేయాల్సి వస్తోందని తెలిపారు. మరోవైపు కొందరు నీటిని తోడి విక్రయిస్తూ లాభాలు పొందుతున్నారని ఆరోపించారు. అక్రమ నీటి వ్యాపారం కారణంగా చెరువులో నీటి నిల్వలు తగ్గిపోతున్నాయని, పెద్ద సంఖ్యలో ట్యాంకర్లను నింపేందుకు నీటిని తరలిస్తుండటంతో తమకు నీటి లభ్యత మరింత కష్టంగా మారిందని వాపోయారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గి భవిష్యత్తులో తాగునీటి ఇబ్బందులు పెరిగే ప్రమాదం ఉన్న నేపథ్యంలో ముందస్తుగా హైడ్రా చర్యలు చేపట్టడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

జనవరి 3న టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర మహాసభలు

- హైదరాబాద్‌లో నిర్వహణకు నిర్ణయం
- రాష్ట్ర మీడియా డైరీ కన్వీనర్‌గా ఈ. చంద్రశేఖర్ నియామకం

ప్రజానావ, హైదరాబాద్ : తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర మహాసభలను 2027 జనవరి 3న హైదరాబాద్‌లో నిర్వహించాలని ఫెడరేషన్ రాష్ట్ర ఆఫీస్ బేరర్ల సమావేశం నిర్ణయించింది. శనివారం ఆన్‌లైన్‌లో ఫెడరేషన్ యాక్టింగ్ ప్రెసిడెంట్ పి. రాంచందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర మహాసభల నిర్వహణ, భవిష్యత్ కార్యాచరణ, సంస్థ బలోపేతం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి బి. బసవపున్నయ్య గత కార్యకలాపాలు, భవిష్యత్ కార్యాచరణకు సంబంధించిన నివేదికను ప్రవేశపెట్టగా, రాష్ట్ర ఆఫీస్ బేరర్లు, ఇతర నాయకులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. అనంతరం నవంబర్ 22న హైదరాబాద్‌లో రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమావేశానికి రాష్ట్ర ఆఫీస్ బేరర్లు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. అప్పటిలోగా రాష్ట్ర ఆఫీస్ బేరర్లు జిల్లాల్లో పర్యటించి జిల్లా కమిటీ సమావేశాలు నిర్వహించాలని తీర్మానించారు. టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర మీడియా డైరీ–2027 కన్వీనర్‌గా రాష్ట్ర కార్యదర్శి ఈ. చంద్రశేఖర్‌ను నియమించారు. కొత్త మీడియా డైరీని 2027 జనవరి 14న ఆవిష్కరించాలని నిర్ణయించారు. డైరీ ప్రచురణ కోసం ప్రతి జిల్లా నుంచి ఒక ప్రకటన సమకూర్చడంతోపాటు, రాష్ట్ర మహాసభల నిర్వహణకు ఆర్థిక సహకారం అందించాలని జిల్లా కమిటీలకు సూచించారు. మహాసభల ఏర్పాట్ల పురోగతిని సమీక్షించేందుకు ప్రతి శుక్రవారం ఆన్‌లైన్‌లో రాష్ట్ర ఆఫీస్ బేరర్ల సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆఫీస్ బేరర్లు బి. దయాసాగర్, వై. ప్రభాకర్, తాటికొండ కృష్ణ, ఈ. చంద్రశేఖర్, సలీమ, గుడిగ రఘు, బి. జగదీష్, బి. రాజశేఖర్, వెంకటేష్, కొప్పు నిరంజన్, మాణిక్ ప్రభు, వివేక్, బి. దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

పల్లెలకు పాకిన ఆన్‌లైన్ బెట్టింగ్ భూతం

- అప్పుల ఊబిలో యువత
- వేధింపులతో బలవన్మరణాలు
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు



ప్రజానావ, నిజామాబాద్ : ఒకప్పుడు నగరాలు, పట్టణాలకే పరిమితమైన ఆన్‌లైన్ బెట్టింగ్ ప్రస్తుతం పల్లెలకూ విస్తరించి యువత జీవితాలను ఛిన్నాభిన్నం చేస్తోంది. బెట్టింగ్ యాప్‌లపై నిషేధాలు ఉన్నప్పటికీ కొందరు యువకుల తీరు మారడం లేదు. సరదాగా మొదలుపెట్టి కొందరు, తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఆశతో మరికొందరు ఈ వ్యసనానికి బానిసలవుతున్నారు. నలుగురు యువకులు కలిసినా ఊరి బయట, చెరువుగట్టుపై కూర్చొని చరవాణుల్లో ఆన్‌లైన్ ఆటలు ఆడుతున్నారు. మొదట్లో కొద్దిపాటి మొత్తాలతో ప్రారంభించి, నష్టాలు రావడంతో అప్పులు చేస్తూ క్రమంగా ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతున్నారు. అప్పులు తీర్చలేక, మరోవైపు బెట్టింగ్ నిర్వాహకుల వేధింపులు భరించలేక కొందరు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. చివరకు ప్రాణాలు తీసుకునే పరిస్థితులకు చేరుకుంటుండటం ఆందోళన కలిగిస్తోంది. వీరి నిర్ణయాలతో తల్లిదండ్రులతోపాటు వారిపై ఆధారపడిన భార్యాపిల్లల జీవితాలూ అంధకారంలోకి నెట్టబడుతున్నాయి.

సూచనలు పాటిస్తే మేలు

ఆన్‌లైన్‌లోనైనా, ఆఫ్‌లైన్‌లోనైనా జూదం ఆర్థికంగా నష్టపరిచి కుటుంబాలను రోడ్డున పడేస్తుందని గతంలో చోటుచేసుకున్న అనేక ఘటనలు హెచ్చరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పోలీసులు, సైబర్ నిపుణులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ యువతను అప్రమత్తం చేస్తున్నారు. ఆన్‌లైన్ ఆటలకు దూరంగా ఉండి మైదానాల్లో క్రీడలు ఆడటం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలని సూచిస్తున్నారు. గ్రామాల్లో స్థానిక పాలకవర్గాలు, పోలీసుశాఖ సంయుక్తంగా క్రీడా పోటీలు నిర్వహిస్తూ యువతను ప్రోత్సహిస్తున్నాయి. మరోవైపు తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను నిశితంగా గమనించాలని నిపుణులు సూచిస్తున్నారు. అవసరానికి మించి అప్పులు చేయడం, కుటుంబ సభ్యులకు తెలియకుండా డబ్బులు ఖర్చు చేయడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే అప్రమత్తమై వారికి అండగా నిలవాలి. అవసరమైతే వైద్య నిపుణులు, కౌన్సెలర్ల సహాయం తీసుకోవాలి. బెట్టింగ్ వ్యసనంలో చిక్కుకున్న వారిని నిందించకుండా, సమస్య నుంచి బయటపడేందుకు కుటుంబ సభ్యులు తోడ్పడాలని సూచిస్తున్నారు.

ప్రైవేటు వ్యాపారుల వైపే రైతుల మొగ్గు

- మద్దతు ధరకు మించి ధరలు
- క్షేత్రాల వద్దే పచ్చి ధాన్యం కొనుగోళ్లు



ప్రజానావ, కామారెడ్డి : జిల్లాలో వరి ధాన్యానికి మంచి డిమాండ్ ఏర్పడింది. కోతలు పూర్తికాగానే పచ్చి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు వ్యాపారులు, మిల్లర్లు పోటీ పడుతున్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో ఇప్పటికే సుమారు 60 శాతం వరి కోతలు పూర్తయ్యాయి. ఇక్కడ సాగు చేసిన సన్న రకాలను వ్యాపారులు, మిల్లర్లు వ్యవసాయ క్షేత్రాల వద్దకే వచ్చి కొనుగోలు చేస్తున్నారు. మంచి ధర లభిస్తుండటంతో రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల కంటే ప్రైవేటు వ్యాపారులకే ధాన్యాన్ని విక్రయించేందుకు మొగ్గు చూపుతున్నారు. జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో పండించిన సన్న ధాన్యానికీ డిమాండ్ పెరగగా, దొడ్డు ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు సైతం కొందరు మిల్లర్లు ఆసక్తి చూపుతున్నారు. జిల్లావ్యాప్తంగా 418 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి అక్టోబరు 1న ప్రారంభించారు. ఖరీఫ్ సీజన్‌లో 3.19 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా, 4.57 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అధికారులు అంచనా వేశారు. అయితే, మద్దతు ధర కంటే అధిక ధరలు లభిస్తుండటంతో రైతులు ప్రైవేటు వ్యాపారులకే విక్రయిస్తున్నారు. బాన్సువాడ ప్రాంతంలో క్వింటాల్ ధాన్యాన్ని రూ.3,600 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే డబ్బులు చెల్లిస్తున్నారు. తక్షణమే నగదు కావాలనుకునే రైతులకు లక్ష రూపాయలకు రూ.వెయ్యి చొప్పున తగ్గించి అందజేస్తుండగా, రెండు వారాలు వేచి ఉంటే పూర్తి మొత్తాన్ని చెల్లిస్తున్నారు. దీంతో కొనుగోలు కేంద్రాలకు ఇప్పటివరకు ధాన్యం చేరలేదు. గతేడాది ఇదే సమయానికి కేంద్రాల్లో 3,250 టన్నుల ధాన్యాన్ని రైతులు విక్రయించారు. మరోవైపు కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాల్లో అధికంగా సాగు చేసే దొడ్డు రకం ధాన్యానికీ ఈసారి గిరాకీ పెరిగింది. గతంలో మిల్లర్లు చెల్లించాల్సిన బకాయిల విషయంలో ప్రభుత్వం ఒత్తిడి పెంచడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తుండటంతో బకాయిదారులు రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. ఎండిన దొడ్డు ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,300 చెల్లించేందుకు ముందుకొస్తున్నారు. తమకే ధాన్యం విక్రయించాలని మధ్యవర్తుల ద్వారా రైతులకు సమాచారం పంపుతున్నారు. సన్న ధాన్యాన్ని ఎండబెట్టి విక్రయిస్తే క్వింటాల్‌కు రూ.3,200 ఇస్తామని చెబుతున్నారు. అధిక విస్తీర్ణంలో వరి సాగు చేసిన రైతులతోనూ కొందరు మిల్లర్లు బేరసారాలు సాగిస్తున్నారు. మొత్తంగా ప్రభుత్వ మద్దతు ధర కంటే ఎక్కువ ధరలు లభిస్తుండటంతో రైతులు ప్రైవేటు వ్యాపారుల వద్ద ధాన్యం విక్రయించడానికే ప్రాధాన్యమిస్తున్నట్లు తెలుస్తోంది.



మహిళా సంఘాల రుణాలపై 'కమీషన్' దందా

ప్రజానావ, నిజామాబాద్ : జిల్లాలో నిజామాబాద్ నగరపాలక సంస్థతో పాటు మూడు పురపాలికల పరిధిలో 9,561 పొదుపు సంఘాలు ఉండగా, వాటిలో 94,997 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. వీరికి రుణాల మంజూరులో మెప్మా సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో 328 మంది రిసోర్స్ పర్సన్లు (ఆర్పీలు) విధులు నిర్వహిస్తున్నారు. పది నుంచి 15 మంది సభ్యులున్న స్వయం సహాయక సంఘానికి తొలుత రూ.50 వేల రుణం అందిస్తారు. సక్రమంగా చెల్లిస్తే రెండోసారి రూ.లక్ష, ఆ తర్వాత రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు బ్యాంకు అనుసంధాన రుణాలు మంజూరు చేస్తారు. అయితే సంఘానికి రూ.లక్ష రుణం మంజూరైతే ఒక్కో సభ్యురాలి నుంచి రూ.వెయ్యి చొప్పున మొత్తం రూ.10 వేల వరకు కమీషన్ వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. డబ్బులు ఇవ్వకపోతే సాకులు చెబుతూ రుణం మంజూరును నిలిపివేస్తున్నారని మహిళలు వాపోతున్నారు. మహిళల ఆర్థిక స్వావలం బన కోసం అందించే రుణాల్లోనే అక్రమ వసూళ్లకు పాల్పడటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు.

ఆరోపణలు వచ్చినా చర్యలేవీ?

జిల్లాలో పలువురు ఆర్పీలపై గతంలోనూ ఆరోపణలు వచ్చినట్లు తెలుస్తోంది. అయినా వారిపై కఠిన చర్యలు తీసుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బోధన్‌లో తమ సంఘానికి చెందిన రూ.లక్షను ఓ ఆర్పీ వినియోగించుకున్నారని సభ్యులు అధికారులకు ఫిర్యాదు చేశారు. అయితే బాధ్యు డిపై కఠిన చర్యలు తీసుకోకుండా నామమాత్రపు విచారణ తో సరిపెట్టారనే విమర్శలు ఉన్నాయి. కలెక్టరేట్‌లోని మెప్మా కార్యాలయ సిబ్బందితో ఆర్పీల కు సంబంధాలు ఉండటంతోనే విచారణ సక్రమంగా జరగడం లేదని, అవినీతి ఆరోపణలు వచ్చినా చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నా రు. రుణాల మంజూరు కు కమీషన్ వసూలు చేస్తున్నారనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవా లని మహిళా సంఘాల సభ్యులు కలెక్టర్‌ను కోరుతున్నారు.

ప్రేమ్‌నగర్‌లో ఉచిత వైద్య శిబిరం

ప్రజానావ, హైదరాబాద్ : ప్రేమ్‌నగర్‌లోని అంబేద్కర్ భవన్‌లో ప్రేమ్‌నగర్ పంచాయతీ కమిటీ, జై జవాన్ జై కిసాన్ యువజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అపోలో ఆసుపత్రి, వైద్య కళాశాల వైద్యులతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే ఈ శిబిరంలో సాధారణ వ్యాధులు, ఎముకలు, కీళ్ల సమస్యలు, సీజనల్ వ్యాధులు, చిన్నపిల్లలకు సంబంధించిన అనారోగ్య సమస్యలకు వైద్యులు పరీక్షలు నిర్వహించి చికిత్స అందించనున్నారు. అవసరమైన వారికి ఆరోగ్యశ్రీతోపాటు ఇతర ఆరోగ్య కార్డుల ద్వారా ఎలాంటి ఖర్చు లేకుండా శస్త్రచికిత్సలు కూడా చేయించనున్నట్లు శిబిర సమన్వయకర్త నితిన్ సింగ్, నిర్వాహకులు కే. భగవాన్ దాస్, సుధీర్ కుమార్ తెలిపారు.

మహిళల వాష్‌రూమ్‌లో రహస్యంగా ఫోన్

- వాష్‌బేసిన్ కింద మొబైల్ ఏర్పాటు
- ఫ్లోర్ అటెండెంట్ అరెస్టు, సైబర్ క్రైమ్‌కు కేసు బదిలీ

ప్రజానావ, హైదరాబాద్ : కవాడిగూడలోని పవర్‌గ్రిడ్ కార్యాలయంలో మహిళల వాష్‌రూమ్‌లో రహస్యంగా మొబైల్ ఫోన్ ఏర్పాటు చేసిన ఘటన కలకలం రేపింది. వాష్‌బేసిన్ కింద ద్విపార్శ్వ అంటుకునే టేపుతో ఫోన్‌ను అతికించినట్లు ఓ మహిళా ఉద్యోగిని గుర్తించారు. ఈ విషయాన్ని అక్టోబరు 13న గుర్తించిన ఆమె ఫోన్ ఎవరిదని ప్రశ్నించగా, ఫ్లోర్ అటెండెంట్ భరత్ దాన్ని లాక్కొని పరుగెత్తినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. సహోద్యోగులు, భద్రతా సిబ్బంది సహకారంతో ఉద్యోగులు అతడిని పట్టుకున్నారు. ఫోన్‌లోని వీడియోలను పరిశీలించేందుకు ప్రయత్నించగా, పిన్ లాక్‌తో రక్షించిన ప్రత్యేక ఫోల్డర్ ఉన్నట్లు గుర్తించారు. ఈ క్రమంలో నిందితుడు ఫోన్‌ను నేలకేసి కొట్టినట్లు బాధితురాలు ఫిర్యాదులో తెలిపారు. ఈ ఘటనపై గాంధీనగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా, ఫ్లోర్ అటెండెంట్ భరత్‌ను పోలీసులు అరెస్టు చేశారు. కేసు లోతైన దర్యాప్తు కోసం దాన్ని సిటీ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించే ఈ ఘటనపై పోలీసులు తదుపరి విచారణ చేపట్టారు.



విద్యుత్ కోతలకు నిరసనగా రాస్తారోకో

- పంటలు చేతికొచ్చే వరకు 16 గంటల త్రీఫేస్ సరఫరా చేయాలి
- ఎమ్మెల్యే సునీతారెడ్డి

ప్రజానావ, మాసాయిపేట : విద్యుత్ కోతలను నిరసిస్తూ మెదక్ జిల్లా మాసాయిపేట విద్యుత్ ఉపకేంద్రం ఎదుట నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఉపకేంద్రంలో లాక్‌ను పరిశీలించిన అనంతరం 44వ జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. దీంతో వందలాది వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా సునీతారెడ్డి మాట్లాడుతూ 24 గంటలు కాకపోయినా పంటలు చేతికొచ్చే వరకు కనీసం 16 గంటల పాటు వ్యవసాయానికి త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, వందలాది మంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

పది రూపాయల నాణేలతో భర్తకు బైక్ బహుమతి

- రెండేళ్ల పొదుపుతో రూ.50 వేలు జమ
- భర్తకు భార్య ప్రేమ కానుక

ప్రజానావ, వైరా : పది రూపాయలే కదా అని చిన్నచూపు చూడొద్దు.. చిల్లర నాణేలను క్రమం తప్పకుండా పొదుపు చేస్తే కొన్నేళ్లకు పెద్ద మొత్తమే సమకూరుతుంది. ఈ విషయాన్ని ఆచరణలో చూపించిన ఓ పేదింటి మహిళ తన భర్తకు ద్విచక్ర వాహనాన్ని బహుమతిగా అందించి అందరి దృష్టిని ఆకర్షించారు. ఖమ్మం జిల్లా వైరా పట్టణంలో చోటుచేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వైరా మండలం నారపునేనిపల్లికి చెందిన తడికమల్ల విజయరావు, విజయ దంపతులకు డ్వాక్రా అనుబంధంగా స్త్రీ టీమార్ట్ మంజూరైంది. డ్వాక్రా సంఘం నుంచి రూ.లక్ష, బ్యాంకు నుంచి మరో రూ.లక్ష రుణం తీసుకుని వైరా మున్సిపల్ కార్యాలయం ఎదురుగా రెండేళ్లుగా దుకాణం నిర్వహిస్తున్నారు. విజయరావు వద్ద పాత ద్విచక్ర వాహనం ఉన్నప్పటికీ తరచూ మరమ్మతులకు గురవుతుండటంతో ఇబ్బందులు ఎదురయ్యేవి. ఇద్దరు కుమారులను చదివించడంతో పాటు కుటుంబాన్ని పోషించాల్సిన బాధ్యత ఉండటంతో అదే వాహనాన్ని ఉపయోగిస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో విజయ మొదటి నుంచీ అలవాటు చేసుకున్న పొదుపు సూత్రం భర్తకు కొత్త వాహనం కొనివ్వాలన్న ఆమె కోరికను నెరవేర్చింది. గతంలో ఓ వస్త్ర దుకాణంలో పనిచేసే సమయంలో తన చేతికి వచ్చిన ప్రతి పది రూపాయల నాణేన్ని ఇంట్లోని ఓ పెట్టెలో దాచేవారు. రెండేళ్లుగా టీ దుకాణం నిర్వహిస్తుండటంతో నాణేల పొదుపును మరింత పెంచారు. ఇలా పోగుచేసిన మొత్తాన్ని దసరా సందర్భంగా వైరాలోని ఓ ప్రైవేటు వాహన విక్రయశాలకు తీసుకెళ్లారు. నాణేలను లెక్కించగా మొత్తం రూ.50 వేలు ఉన్నట్లు తేలింది. ఇందులో రూ.20, రూ.5 నాణేల విలువ సుమారు రూ.2 వేల వరకు ఉండగా, మిగిలిన మొత్తమంతా పది రూపాయల నాణేలే కావడం విశేషం. ఈ మొత్తంతో పాటు పాత వాహనాన్ని విక్రయించగా వచ్చిన డబ్బును కలిపి కొత్త టీవీఎస్ ఎక్సెల్ 100 వాహనాన్ని కొనుగోలు చేశారు. మిగిలిన రూ.17 వేల మొత్తాన్ని ఫోన్‌పే ద్వారా చెల్లించారు. భర్తకు కొత్త వాహనం కొనిచ్చిన విజయ.. చిన్నచిన్న మొత్తాల పొదుపుతో పెద్ద లక్ష్యాలను సాధించవచ్చని నిరూపించారు. కుటుంబ బాధ్యతలను నిర్వహిస్తూనే భర్త కోరికను నెరవేర్చిన ఆమె ప్రయత్నం పలువురిని ఆకట్టుకుంటోంది.

వైద్య విద్యకు పేదరికం అడ్డంకి

- నీట్‌లో ప్రతిభ చాటిన సూర్యప్రసాద్
- ఎంబీబీఎస్ సీటు వచ్చినా ఫీజులకు ఆర్థిక ఇబ్బందులు

ప్రజానావ, పెంట్లవెల్లి : వైద్యుడు కావాలనే లక్ష్యంతో కష్టపడి చదివి ఎంబీబీఎస్‌లో ఉచిత సీటు సాధించినా పేదరికం సూర్యప్రసాద్ కలకు అడ్డం కిగా మారింది. వైద్య విద్యను పూర్తిచేసి సమాజానికి సేవ చేయాలనే తపన ఉన్నప్పటికీ, ఆర్థిక పరిస్థితులు సహకరించక దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నాడు. నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండల కేంద్రానికి చెందిన సూర్యప్రసాద్ తండ్రి వెంకటస్వామి డ్రైవర్‌గా పనిచేస్తుండగా, తల్లి దేవేంద్రమ్మ కూలీ పనులు చేస్తోంది. ఇద్దరు అక్కల్లో ఒకరికి వివాహం కాగా, మరొకరు బీఎస్సీ నర్సింగ్ చదువుతున్నారు. రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబంలో లక్షల రూపాయలు ఖర్చు చేసి కుమారుడిని చదివించే స్థోమత లేకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఎవరైనా దాతలు ఆర్థిక సాయం అందిస్తే తమ కుమారుడు వైద్య విద్యను పూర్తిచేయగలడని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. సూర్యప్రసాద్ చదువులో మొదటి నుంచీ ప్రతిభ కనబరిచాడు. కల్వకుర్తిలోని జేపీనగర్ సాంఘిక సంక్షేమ గురుకులంలో పదో తరగతి చదివి 9.0 జీపీఏ సాధించాడు. ఇంటర్మీడియట్‌లో 950 మార్కులు పొందాడు. నీట్‌లో 402 మార్కులతో రాష్ట్రస్థాయిలో 6,000వ ర్యాంకు, ఎస్సీ కేటగిరీలో 320వ ర్యాంకు సాధించి హైదరాబాద్‌లోని నోవా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో ఎంబీబీఎస్ సీటు దక్కించుకున్నాడు. అయితే ఏటా సుమారు రూ.లక్ష వరకు ఫీజు చెల్లించాల్సి ఉండటంతో చదువు కొనసాగించడం కష్టంగా మారింది. ప్రతిభ ఉన్నా ఆర్థిక ఇబ్బందులతో వైద్య విద్యకు దూరమయ్యే పరిస్థితి రాకుండా దాతలు ముందుకొచ్చి సాయం అందించాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.

విద్యుత్ ఉపకేంద్ర నిర్మాణానికి శంకుస్థాపన

- రూ.1.36 కోట్లతో ప్రొద్దుటూరులో నిర్మాణం
- పలు రహదారుల పనులకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క శ్రీకారం



ప్రజానావ, చింతకాని : ఖమ్మం జిల్లా చింతకాని మండలం ప్రొద్దుటూరులో నూతనంగా నిర్మించనున్న విద్యుత్ ఉపకేంద్రానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేశారు. ఈ ఉపకేంద్ర నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.36 కోట్లు మంజూరు చేసింది. అనంతరం తిమ్మినేనిపాలెం, గాంధీనగర్, రామకృష్ణాపురం గ్రామాల్లో పలు రహదారుల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ దివాకర్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, ఆయా గ్రామాల సర్పంచులు, విద్యుత్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశానికి అధికారుల డుమ్మా

- గంట ఆలస్యమైనా రాని అధికారులు
- 32 మంది సర్పంచులకు నలుగురే హాజరు

ప్రజానావ, వెల్దండ : మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమయపాలన పాటించకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఉదయం 10 గంటలకు సమావేశం ఉంటుందని ఎంపీడీవో సులోచన ముందస్తుగా మండల స్థాయి అధికారులు, మండలంలోని సర్పంచులకు సమాచారం అందించారు. అయినప్పటికీ 11 గంటలైనా 32 మంది సర్పంచులకు కేవలం నలుగురు మాత్రమే హాజరయ్యారు. అదేవిధంగా 32 మంది పంచాయతీ కార్యదర్శులకు ఎనిమిది మంది మాత్రమే రావడంతో పాటు ఇతర శాఖల అధికారులు సైతం గైర్హాజరయ్యారు. మండల ప్రత్యేక అధికారి విజయశ్రీ కూడా గంట ఆలస్యంగా 11 గంటలకు సమావేశానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా చెరుకూరు సర్పంచ్ శ్రీనివాసులు సమయపాలన పాటించనప్పుడు సమావేశాలు నిర్వహించడం ఎందుకని ఎంపీడీవోను ప్రశ్నించారు. తమకూ ఇతర పనులు ఉంటాయని, సమావేశాలకు సమయానికి హాజరుకాకపోవడం సరికాదని అసహనం వ్యక్తం చేశారు. ముందస్తుగా సమాచారం ఇచ్చినప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు సమయానికి హాజరుకాకపోవడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి.





నల్లమలలో యథేచ్ఛగా వృక్షాల నరికివేత

- కృష్ణపట్టి అటవీ ప్రాంతం నుంచి కట్టెల మిల్లులు, బొగ్గు బట్టీలకు కలప తరలింపు
- మూసేసిన చెక్‌పోస్టును తెరవాలని స్థానికుల డిమాండ్

ప్రజానావ, దేవరకొండ : నల్లమల అటవీ ప్రాంతంలోని కృష్ణపట్టి ఏరియాలో అక్రమంగా పచ్చని చెట్లను నరికివేస్తూ కొందరు సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గుట్టలు, అడవులకు పేరుగాంచిన దేవరకొండ ప్రాంతంలో అటవీ సంపదకు ముప్పు పొంచి ఉంది. రాత్రి, తెల్లవా రుజామున ట్రాక్టర్ల ద్వారా కలపను దేవరకొండ, కొండమల్లేపల్లిలోని కట్టెల మిల్లులు, బొగ్గు బట్టీలకు తరలిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. కృష్ణపట్టి ప్రాంతంలో ఇటీవల పెద్దపులి సంచరించిన నేపథ్యంలో నల్లమల అటవీ ప్రాధాన్యం మరోసారి వెల్లడైంది. జింకల గంతులు, పక్షుల కిలకిలరావాలు, చిరుతలు, ఇతర వన్యప్రాణుల సంచారంతో కనువిందు చేసే ఈ ప్రాంతం పులుల సంరక్షణ ప్రాంతంగా అటవీశాఖ పరిధిలో ఉంది. అడవి విస్తీర్ణం, పచ్చదనం పెరిగితే వన్యప్రాణులకు ఆవాసం, రక్షణ లభించడంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా అవి తరలివచ్చే అవకాశం ఉంటుంది. దేవరకొండ రేంజ్ పరిధిలో 13,765 హెక్టార్లు, కంబాలపల్లి రేంజ్ పరిధిలో 14 వేల హెక్టార్ల మేర నల్లమల అటవీ విస్తరించి ఉంది. ఈ ప్రాంతంలో సుమారు 26 చిరుతలు, 50 ఎలుగుబంట్లు, 105 రేసుకుక్కలు ఉన్నట్లు అంచనా. ప్రస్తుతం పులుల ఆనవాళ్లు లేవని పేర్కొంటున్నారు. చుక్కల దుప్పులు, నెమళ్లు, మనుబోతులు, ముళ్లపందులు, కొండగొరైలు తదితర వన్యప్రాణులు కూడా పెద్ద సంఖ్యలో ఉన్నాయి. ఇలాంటి జీవవైవిధ్యానికి నిలయమైన అడవుల్లో చెట్ల నరికివేత, కలప అక్రమ రవాణా కొనసాగితే వన్యప్రాణుల మనుగడకే ముప్పు ఏర్పడే ప్రమాదం ఉంది. వన్యప్రాణులను సంరక్షిస్తూ అటవీ సంపదను కాపాడాలన్న ప్రభుత్వ లక్ష్యానికి క్షేత్రస్థాయిలో విఘాతం కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అడవి నుంచి దేవరకొండకు వచ్చే మార్గంలో మూసివేసిన చెక్‌పోస్టును తిరిగి తెరిచి, కలప అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పచ్చి వడ్లకు రికార్డు ధర.. క్వింటా రూ.3,500

- దశాబ్దం తర్వాత రైతులకు ఊరట
- కల్లాల వద్దే కొనుగోళ్లు చేస్తున్న వ్యాపారులు

ప్రజానావ, ఖమ్మం : దశాబ్ద కాలం తర్వాత వరి పంటకు రికార్డు ధర లభిస్తుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా ఆయిల్‌పామ్, మిరప, పత్తి పంటలకు రికార్డు ధరలు పలికిన వార్తలు వినిపిస్తుండగా.. ఈ ఖరీఫ్‌లో వరి ధాన్యానికి అనూహ్యంగా డిమాండ్ పెరిగింది. తేమ శాతంతో సంబంధం లేకుండా వ్యాపారులు కల్లాల వద్దే పచ్చి వడ్లను అధిక ధరకు కొనుగోలు చేస్తున్నారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం తాళ్లమడ, కల్లూరు మండలంలోని పలు గ్రామాల్లో క్వింటా పచ్చి వడ్లను రూ.3,400 నుంచి రూ.3,500 వరకు కొనుగోలు చేస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం గండుగులపల్లిలోనూ క్వింటా పచ్చి వడ్లకు రూ.3,500 చెల్లించి వ్యాపారులు కొనుగోలు చేశారు. ఇదే పరిస్థితి కొనసాగితే రైతులు ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వడ్లు తీసుకురావడం తగ్గిపోవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



వ్యాపారుల పరుగులు..

ఖరీఫ్ ధాన్యం కోసం రెండు జిల్లాల్లోని మిల్లర్లు, పొరుగు రాష్ట్రాల వ్యాపారులు పోటీపడుతున్నారు. రైతుల వివరాలు తెలుసుకుని ముందుగానే వారిని కలిసి డబ్బులు చెల్లిస్తూ తమకే ధాన్యం విక్రయించాలని కోరుతున్నారు. వరి కోత యంత్రాలు పొలాల్లోకి దిగిన వెంటనే పచ్చి వడ్లను ట్రాక్టర్ ట్రక్కుల్లోకి ఎక్కించి తరలిస్తున్నారు. పలు బియ్యం మిల్లుల్లో ధాన్యం ఆరబెట్టేందుకు ఆరబెట్టే యంత్రాలను సైతం ఏర్పాటు చేసుకున్నారు.

డిమాండ్ పెరగడానికి కారణమిదే..

సూపర్ ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో చెరువులు, ప్రాజెక్టుల్లోకి ఆశించిన స్థాయిలో నీరు చేరలేదు. ఖమ్మం జిల్లాలో నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధిలోని 1.27 లక్షల ఎకరాల్లో వరి సాగు కాలేదు. బావులు, బోర్లతో పాటు కొన్ని చెరువుల కింద రైతులు వ్యయప్రయాసలకోర్చి పంట సాగు చేశారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను కొన్ని మండలాలకు అందించారు. రెండు జిల్లాల్లోనూ ఐదు రోజులుగా వరి కోతలు ప్రారంభమయ్యాయి. సాగు విస్తీర్ణం తగ్గడంతో ధాన్యానికి డిమాండ్ పెరిగి ధరలు ఎగబాకుతున్నాయి.

అన్ని ప్రమాణాలు పాటిస్తే క్వింటాకు రూ.2,961

ప్రభుత్వం సాధారణ రకం ధాన్యానికి క్వింటాకు రూ.2,441, గ్రేడ్–ఏ రకానికి రూ.2,461 కనీస మద్దతు ధర ప్రకటించింది. ఏడు రకాల సన్నాలకు క్వింటాకు రూ.500 బోనస్ అందిస్తోంది. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలింపు, ఎగుమతి, దిగుమతి ఖర్చులను పరిగణనలోకి తీసుకుని, తేమ శాతం 17 నిబంధనకు అనుగుణంగా ఉంటే క్వింటాకు రూ.2,961 వరకు లభిస్తుందని అంచనా. అయితే ప్రైవేటు వ్యాపారులు కల్లాల వద్దే 30 శాతం తేమ ఉన్న పచ్చి వడ్లకు సైతం క్వింటాకు రూ.3,500 చెల్లిస్తుండటం గమనార్హం.

ఖరీఫ్ సాగు వివరాలు (ఎకరాల్లో)..

ఉమ్మడి జిల్లాల్లో వరి సాగు లక్ష్యం 3,05,000 ఎకరాలు కాగా, ఇప్పటివరకు 2,41,109 ఎకరాల్లో సాగు చేసినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

తనిఖీల నివేదికపై గప్‌చుప్

- అనుమతులు ముగిసినా తవ్వకాలు
- గద్వాలలో ప్రజాప్రతినిధి బంధువు క్రషర్‌పై ఆరోపణలు
- ఏడాదిగా రెన్యువల్ లేకుండానే నిర్వహణ?

ప్రజానావ, జోగులాంబ గద్వాల : అనుమతుల గడువు ముగిసి ఏడాది కావస్తున్నా తవ్వకాలు కొనసాగుతున్నాయనే ఆరోపణలు గద్వాలలోని ఓ స్టోన్ క్రషర్ వ్యవహారంపై కలకలం రేపుతున్నాయి. తీసుకున్న అనుమతులకు మించి తవ్వకాలు జరిపారన్న విమర్శల నేపథ్యంలో అధికారులు తనిఖీలు నిర్వహించగా, అక్రమాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. అయితే తనిఖీలు పూర్తయిన తర్వాత అధికారులు ఎలాంటి వివరాలు వెల్లడించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఓ ప్రజాప్రతినిధి బంధువు నిర్వహణలో ఉన్న ఈ క్రషర్‌పై ఈ నెల 13న సుమారు 20 మంది అధికారులతో కూడిన బృందం తనిఖీలు నిర్వహించింది. రాష్ట్ర గనుల శాఖ, కేంద్ర పర్యావరణ శాఖ, స్థానిక రెవెన్యూ శాఖలకు చెందిన అధికారులు సంయుక్తంగా ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. అయితే తనిఖీల వివరాలను వెల్లడించకుండా అధికారులు వెనుదిరగడం చర్చనీయాంశమైంది. తనిఖీల సమయంలోనే రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాలతో నివేదికలోని కొన్ని అంశాలు మారినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ కారణంగానే వివరాలు వెల్లడించేందుకు అధికారులు నిరాకరించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండల పరిధిలోని గోనుపాడు శివారులో ఐదు సర్వే నంబర్లలో మైనింగ్ అనుమతులు



తీసుకున్నట్లు గుర్తించిన అధికారులు.. వాస్తవంగా ఎంత మేర తవ్వకాలు జరిగాయన్న అంశంపై పరిశీలన చేపట్టినట్లు సమాచారం. అయితే తవ్వకాలు అనుమతుల పరిధిని దాటాయన్న ఆరోపణలపై అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపారా? లేక నామమాత్రంగా నివేదిక రూపొందించారా? అన్న సందేహాలు వ్యక్తమవుతు న్నాయి. క్రషర్ వద్ద రెండు, మూడు జిలెటిన్ స్టిక్స్ లభ్యమైన నేపథ్యంలో రూరల్ పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేసినట్లు సమాచారం. అయితే క్రషర్ నిర్వాహకులపై తదుపరి ఎలాంటి చర్యలు తీసుకున్నారన్నది స్పష్టత లేదు.

ఏడాదిగా అనుమతులు లేకుండానే నిర్వహణ?

క్రషర్ అనుమతుల గడువు ఏడాది క్రితమే ముగిసినా, వాటిని పునరుద్ధరించకుండా కార్యకలాపాలు కొనసాగించారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అప్పటి నుంచి ఇప్పటివరకు ఎన్ని ఘనపు మీటర్ల మేర తవ్వకాలు జరిపారు? ప్రభుత్వానికి చెల్లించాల్సిన రాయల్టీ ఎంత? ఇప్పటివరకు ఎంత చెల్లించారు? అనుమతులకు మించి తవ్వకాలు జరిగితే ఆ పరిమాణం ఎంత? అదనపు తవ్వకాలకు సంబంధించి ప్రభుత్వానికి ఎంత రాయల్టీ చెల్లించాల్సి ఉంటుంది? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది. విజిలెన్స్ బృందం తనిఖీల్లో గుర్తించిన అంశాలను నమోదు చేసి నివేదిక రూపొందించినప్పటికీ, చివరి దశలో రాజకీయ జోక్యం జరిగి వ్యవహారాన్ని నీరుగార్చారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలపై అధికారిక నిర్ధారణ లేదు. జిల్లా గనుల శాఖ అధికారులు మౌనం వీడితేనే తనిఖీల అసలు వివరాలు, తదుపరి చర్యలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

చెరువులో యువకుడి మృతదేహం లభ్యం

ప్రజానావ, గజ్వేల్ : సిద్దిపేట జిల్లా గజ్వేల్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీ పరిధిలోని పల్లెపహాడు చెరువులో శనివారం ఓ యువకుడి మృతదేహం లభ్యమైంది. మృతుడిని వేములఘాట్‌కు చెందిన పార్థం ప్రదీప్ (16)గా గుర్తించారు. అతడు అర్ధరాత్రి చెరువులో దూకినట్లు తెలుస్తోంది. ప్రదీప్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకు న్నాయి. అతడి మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

భార్యను హతమార్చిన భర్త

ప్రజానావ, మర్రిగూడ : కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ భర్త భార్యను హత్య చేసిన ఘటన నల్గొండ జిల్లా మర్రిగూడ మండలం శివన్నగూడెంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన సుంకరి ఇంద్రయ్య, అనితలకు 2009లో వివాహం కాగా, వారికి ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. కొంతకాలంగా దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. శనివారం ఉదయం మరోసారి వివాదం తలెత్తడంతో ఆగ్రహానికి గురైన ఇంద్రయ్య పక్కనే ఉన్న మారణాయుధంతో అనిత మెడపై విచక్షణారహితంగా దాడి చేశాడు. తీవ్ర రక్తస్రావంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. అనంతరం ఇంద్రయ్య తన ద్విచక్రవాహనంపై మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఎస్సై ఎదుట లొంగిపోయాడు. సమాచారం అందుకున్న ఎస్సై రాంబాబు ఘటనాస్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

సోనామసూరి పేరిట రేషన్ బియ్యం దందా

- రెండుమూడు సార్లు పాలిష్ చేసి బ్రాండ్ల పేరుతో విక్రయాలు
- నాణ్యతపై అనుమానాలు

ప్రజానావ, మహబూబ్‌నగర్ : వర్షాభావ పరిస్థితులతో ధాన్యం దిగుబడులు తగ్గి బియ్యం ధరలు పెరిగాయి. ధరలు అధికమైనా నాణ్యమైన బియ్యమే లభిస్తోందా అంటే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చౌకబియ్యం, నాసిరకం రకాలను రెండుమూడు సార్లు పాలిష్ చేసి సోనామసూరి పేరిట ఆకర్షణీయంగా ప్యాకింగ్ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎల్‌నినో ప్రభావంతో కిలో రూ.65గా ఉన్న సోనామసూరి ధర రూ.85 నుంచి రూ.110కు చేరడంతో కొందరు అక్రమ వ్యాపారులు ఈ పరిస్థితిని సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం. హైదరాబాద్ శివారు ప్రాంతానికి



చెందిన ముగ్గురు మిల్లర్లు రేషన్ బియ్యాన్ని సేకరించి, రీసైక్లింగ్ చేసి వివిధ బ్రాండ్ల పేర్లతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్ల, మహబూబ్‌నగర్, కల్వకుర్తితో పాటు ఇతర ముఖ్య పట్టణాలకు సరఫరా చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. అధిక లాభాలు వస్తుండటంతో స్థానిక వ్యాపారులు కూడా వాటిని కొనుగోలు చేసి విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. కిలోకు సుమారు రూ.50 వరకు లాభం పొందుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

స్థానికంగా నిలిచిన మిల్లులు..

జిల్లాలోని పలు బియ్యం మిల్లులు పనిచేయకపోవడంతో స్థానికంగా బియ్యం సరఫరా తగ్గింది. కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) కింద తీసుకున్న ధాన్యానికి సంబంధించిన బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించకపోవడంతో కొందరు స్థానిక మిల్లర్లు బహిరంగ మార్కెట్‌లో విక్రయాలు జరిపే పరిస్థితి లేదని సమాచారం. అందుబాటులో ఉన్న ధాన్యాన్ని పలువురు ప్రభుత్వానికి అప్పగిస్తుండటంతో మార్కెట్ అవసరాల కోసం ఇతర ప్రాంతాల నుంచి బియ్యం తెప్పించుకోవాల్సి వస్తోంది. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకొని బయటి ప్రాంతాల నుంచి వస్తున్న బియ్యం వ్యాపారం పుంజుకున్నట్లు తెలుస్తోంది.

రోజూ 50 నుంచి 100 లారీలు?

బియ్యాన్ని బ్రాండ్ల పేరుతో ప్యాకింగ్ చేసి విక్రయించాలంటే వాణిజ్య పన్నులు, స్థానిక సంస్థలు, సంబంధిత శాఖల అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. విక్రయాలపై నిబంధనల ప్రకారం జీఎస్టీ కూడా చెల్లించాలి. అయితే జిల్లాకు రోజూ 50 నుంచి 100 లారీల బియ్యం దిగుమతి అవుతున్నట్లు సమాచారం. కొందరు వ్యాపారులు జీఎస్టీ చెల్లింపుల్లో అక్రమాలకు పాల్పడుతూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు నాసిరకం బియ్యాన్ని ప్రముఖ బ్రాండ్ల పేర్లతో విక్రయిస్తే వినియోగదారులు మోసపోయే ప్రమాదం ఉంది. రేషన్ బియ్యం రీసైక్లింగ్, నాణ్యత, బ్రాండ్ల వినియోగం, పన్నుల చెల్లింపులపై సంబంధిత శాఖల అధికారులు తనిఖీలు నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది.



సీఎంఆర్ లక్ష్యం పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- రైస్ మిల్లర్లతో జిల్లా కలెక్టర్ సమీక్ష

ప్రజానావ, సిరిసిల్ల : సీఎంఆర్ లక్ష్యం ప్రభుత్వం నిర్ణయించిన గడువులోగాపూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. యాసంగి 2024–25, అలాగే 2025–26 ఖరీఫ్, యాసంగి సీజన్ సీఎంఆర్ డెలివరీ తదితర అంశాలపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి రైస్ మిల్లర్లు, పౌర సరఫరాల శాఖ అధికారులుతో కలిసి జిల్లా శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. రైస్ మిల్లులకు రోజు వారీ లక్ష్యాలు నిర్ణయించి, వాటిపై సమీక్షించాలని పౌర సరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు. ఏ రైస్ మిల్స్ లక్ష్య సాధనలో వెనుకబడి ఉన్నాయో గుర్తించాలని, నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేసి.. సీఎంఆర్ డెలివరీ చేయించాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా కచ్చితంగా రైస్ మిల్లర్లు ముందుకు వెళ్లాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి తనూజ, డీఎం గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కళాత్మక రంగంలో సిరిసిల్లకు గొప్ప పేరు

- ఫోక్ సాంగ్ ప్రోమో విడుదల చేసిన మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ



ప్రజానావ, సిరిసిల్ల: కళలకు సిరిసిల్ల పుట్టినిల్లు అని, కళాకారులు తమ ప్రతిభతో ఈ ప్రాంతానికి మరింత పేరు తీసుకురావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి అన్నారు. శనివారం ఆమె చేతుల మీదుగా “రింగు రింగు గోల్డ్ రింగు” ఫోక్ సాంగ్ ప్రోమోను విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సోషల్ మీడియా ద్వారా జానపద గీతాలకు ఆదరణ పెరుగుతోందని పేర్కొన్నారు. పాట నిర్మాత ప్రకాష్, నటీనటులు రామ్, హర్షితతో పాటు చిత్రీకరణలో పాల్గొన్న బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. కళాకారులు భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం నిర్మాత ప్రకాష్, నటీనటులు రామ్, హర్షితలను మున్సిపల్ చైర్‌పర్సన్, పాలకవర్గ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దార్ల సందీప్, విప్ బుర్ర మల్లికార్జున్, కౌన్సిలర్లు, పాట చిత్రీకరణ బృందం సభ్యులు పాల్గొన్నారు.

రిమ్స్‌లో గర్భిణి మృతి

- వైద్యుల నిర్లక్ష్యంపై ఆరోపణలు
- ఎంఐసీయూ వద్ద బంధువుల ఆందోళన
- ఘటనపై విచారణకు ఆదేశించిన అధికారులు



ప్రజానావ, ఆదిలాబాద్ : ఆదిలాబాద్ రిమ్స్‌లో చికిత్స పొందుతూ ఏడు నెలల గర్భిణి మృతిచెందారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే ఆమె ప్రాణాలు కోల్పోయారని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు, బంధువులు ఎంఐసీయూ వద్ద ఆందోళన చేపట్టారు. పాత ఉట్నూర్‌కు చెందిన బోర్కరి సునీత (25) ఏడు నెలల గర్భిణి. ఆమె ఈ నెల 21న రిమ్స్‌లో చేరారు. కాగా, గత రాత్రి 12 గంటల సమయంలో సునీత ఆరోగ్య పరిస్థితి విషమించింది. ఈ విషయాన్ని అక్కడి వైద్యులకు తెలియజేసినా నిర్లక్ష్యంగా వ్యవహరించారని, సకాలంలో సరైన చికిత్స అందించలేదని బంధువులు ఆరోపించారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే ఆమె మృతిచెందిందని పేర్కొంటూ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్‌ను వివరణ కోరగా, విచారణ జరిపిస్తున్నట్లు తెలిపారు. మరోవైపు డీఎంహెచ్ఓ సాధన, అదనపు డీఎంహెచ్ఓ కూడుమెత మనోహర్ ఘటనపై ప్రాథమిక విచారణ చేపట్టారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యులపై చర్యలు తీసుకోవాలని మృతురాలి బంధువులు ఆదిలాబాద్ టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. లో వెల్లడయ్యే వివరాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

చెరువులో జారిపడి రజకుడి మృతి

- దుస్తులు ఉతికేందుకు వెళ్లి మృత్యువాత
- గాలింపు చేపట్టి మృతదేహం వెలికితీత



ప్రజానావ, బీర్కూర్ : ప్రమాదవశాత్తు చెరువులో జారిపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై రాములు తెలిపిన వివరాల ప్రకారం.. బైరాపూర్ గ్రామానికి చెందిన మల్లెల శ్యామ్ (45) రజక వృత్తి చేస్తూ కుటుంబాన్ని పోషించేవారు. శనివారం పలువురి దుస్తులు ఉతికేందుకు గ్రామ శివారులోని చెరువు వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడి మునిగిపోయారు. మధ్యాహ్నం అయినా తండ్రి భోజనానికి ఇంటికి రాకపోవడంతో ఆయన కుమారుడు చెరువు వద్దకు వెళ్లి చూడగా అక్కడ దుస్తులు మాత్రమే కనిపించాయి. దీంతో అనుమానం వచ్చి గజ ఈతగాళ్ల సాయంతో చెరువులో గాలించగా శ్యామ్ మృతదేహం లభ్యమైంది. స్థానికులు సమాచారం అందించడంతో పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య వినోద ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాములు తెలిపారు.

ఇంధన పొదుపుతోనే హరిత పరిశ్రమల నిర్మాణం

ముగిసిన రెండు రోజుల బాయిలర్ సిబ్బంది శిక్షణ

ప్రజానావ, సిరిసిల్ల: పరిశ్రమల్లో ఇంధన సామర్థ్యాన్ని పెంచి, కార్బన్ ఉద్గారాలను తగ్గించే సుస్థిర ఉత్పత్తులపై ఎంఎస్ఎంఈలు దృష్టి సారించాలని నిపుణులు సూచించారు. కేంద్ర ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఎన్ఐ–ఎంఎస్ఎంఈ, నేషనల్ ప్రొడక్టివిటీ కౌన్సిల్ (ఎన్‌పీసీ), యునిడో–జీఈఎఫ్ భాగస్వామ్యంతో సిరిసిల్ల కలెక్టరేట్‌లో నిర్వహించిన రెండు రోజుల బాయిలర్ సిబ్బంది శిక్షణ శనివారంతో ముగిసింది. ఐడీఓసీ సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బాయిలర్ ఆపరేటర్లు, టెక్నీషియన్లు, నిర్వహణ సిబ్బందికి ఆవిరి ఉత్పత్తి, వినియోగంలో సామర్థ్యం, ఇంధన పొదుపు పద్ధతులపై ఆచరణాత్మక శిక్షణ ఇచ్చారు. బాయిలర్ల సమర్థ నిర్వహణతో ఇంధన ఖర్చులను తగ్గించవచ్చని నిపుణులు వివరించారు. అనంతరం తంగళ్లపల్లిలోని కుటీర పరిశ్రమలు, బొట్ల ప్రాసెసింగ్, సైజింగ్ యూనిట్, శ్రీ రాఘవేంద్ర రైస్ మిల్లు, జ్యోతినగర్‌లోని టెక్స్‌టైల్ యూనిట్లను సందర్శించి బాయిలర్ వ్యవస్థలను పరిశీలించి సాంకేతిక సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బాయిలర్ నిపుణులు డాక్టర్ ఏ.కె. అస్థానా, ఎన్ఐ–ఎంఎస్ఎంఈ ప్రతినిధి ముత్యాల శరత్, యునిడో కన్సల్టెంట్ నిరంజన్ రావు, కోఆర్డినేటర్ ఎ. అరవింద రావు, ఈడీసీ మేనేజర్ కె. జయంత్, అసిస్టెంట్ మేనేజర్ టి. వెంకటశివసాయి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ వైద్య సేవలతో ఉన్నత స్థానాలకు ఎదగాలి

- సామాజిక సేవలో భాగంగా కొందరికైనా ఉచిత వైద్యం చేయాలి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ప్రభుత్వ వైద్య కళాశాలలో ఘనంగా వైట్ కోట్ సెర్మనీ
- హాజరైన జిల్లా కలెక్టర్, ఎస్పీ మహేష్ బి గీతే



ప్రజానావ, సిరిసిల్ల : వైద్య కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు డాక్టర్లుగా ఉత్తమ వైద్య సేవలు అందించాలని, ఉన్నత స్థానాలకు ఎదగాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకాంక్షించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో వైట్ కోట్ సెర్మనీ శనివారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితె హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు వైద్య విద్యార్థులకు వైట్ కోట్‌లు అందజేసి అభినందించారు. అనంతరం నిర్వాహకులు జిల్లా కలెక్టర్, ఎస్పీని శాలువాతో సన్మానించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ సమాజంలో వైద్యం, విద్యకు అత్యంత ప్రాధాన్యత ఉందని తెలిపారు. వైద్య విద్య అభ్యసించేందుకు చాలా కష్ట పడాల్సి ఉంటుందని, నీట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తేనే ఈ అవకాశం వస్తుందని వివరించారు. ప్రతి విద్యార్థి విజయం వెనుక వారి తల్లిదండ్రుల శ్రమ, ప్రోత్సాహం ఉంటుందని పేర్కొన్నారు. వైద్యుల సేవలు చాలా కీలకమని స్పష్టం చేశారు. గర్భిణులు, పిల్లలు, వివిధ రోగాలతో బాధ పడే వారికి వైద్యులు ఎంతో ఓపికతో సేవలు అందిస్తారని కొనియాడారు. వైద్యులు తాము ఎంచుకున్న విభాగంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. సమాజ సేవలో భాగంగా వైద్యులు కొందరికైనా ఉచిత వైద్య సేవలు అందించాలని సూచించారు. దీంతో ఆత్మ సంతృప్తి ఉంటుందని తెలిపారు. వైద్యం, సేవల్లో మిగతా వారికి ఆదర్శంగా నిలవాలని ఆకాక్షించారు. సిరిసిల్ల వైద్య కళాశాల, బాలికల, బాలుర హాస్టల్ నిర్మాణ పనులను తాను పలుమార్లు సందర్శించానని గుర్తు చేశారు. ప్రస్తుతం బాలికల హాస్టల్ వినియోగంలోకి వచ్చిందని తెలిపారు. మెడికల్ కాలేజీ, బాలుర హాస్టల్ నిర్మాణ పనుల్లో వేగం పెంచి.. త్వరలోనే వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి, వైస్ ప్రిన్సిపాల్ నిర్విష, తహసీల్దార్ మహేష్ కుమార్, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అధికారులు, సిబ్బందికి వ్యాసరచన పోటీలు

పోలీసు అమరవీరుల సంస్కరణ వారోత్సవాలు



ప్రజానావ, సిరిసిల్ల : పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆదేశాల మేరకు శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు అధికారులు, సిబ్బందికి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోలీసు సిబ్బందిలో వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించడం, సామాజిక బాధ్యతను గుర్తుచేయడం, ప్రజాసేవ పట్ల నిబద్ధతను మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజానుకూల పోలీసింగ్‌పై అవగాహన కల్పించడం ఈ పోటీల ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. ఈ పోటీలను రెండు విభాగాలుగా నిర్వహించగా, మొదటి విభాగంలో భాగంగా పోలీస్ కానిస్టేబుల్ నుంచి అసిస్టెంట్ సబ్‌ఇన్‌స్పెక్టర్ (ఏఎస్ఐ) హోదా వరకు ఉన్న సివిల్, ఆర్మ్డ్ రిజర్వ్ (ఏఆర్) సిబ్బందికి కింది అంశాలను కేటాయించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలు పోలీసుల నుంచి ఎలాంటి సేవలను ఆశిస్తారు? పోలీసు అధికారుల జీవితాల్లో సోషల్ మీడియా పాత్ర ఏమిటి? సోషల్ మీడియాకు బానిస కాకుండా వ్యక్తిగత, సామాజిక ప్రయోజనాల కోసం దానిని సద్వినియోగం చేసుకోవడం ఎలా? అనే ప్రశ్నలను పొందుపరిచారు. రెండో విభాగంలో భాగంగా సబ్‌ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ), రిజర్వ్ సబ్‌ఇన్‌స్పెక్టర్ (ఆర్ఎస్ఐ) మరియు ఆపై హోదాల్లో ఉన్న అధికారులకు కింది అంశాలను కేటాయించారు. పౌరుల నుంచి గౌరవం, ఆదరణ, సద్భావన పొందేందుకు పోలీసులు ఎలాంటి కృషి చేయాలి? క్షేత్రస్థాయిలో పోలీసింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడం ఎలా? అనే ప్రశ్నలు చేర్చారు. ఈ వ్యాసరచన పోటీల ద్వారా పోలీసు అధికారులు, సిబ్బంది తమ ఆలోచనలు, అనుభవాలు, విధి నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లు, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు అనుసరించాల్సిన విధానాలను వ్యాసాల రూపంలో వ్యక్తపరిచే అవకాశం కల్పించారు.

అనుమతులు లేకుండానే ప్రైవేటు ల్యాబ్‌లు

- నర్సంపేటలో కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- తప్పుడు నివేదికలతో రోగులకు ఇబ్బందులు

ప్రజానావ, నర్సంపేట : జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రులు, ల్యాబ్‌లపై అధికారుల పర్యవేక్షణ కొర వడిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నర్సం పేటలో అనుమతులు లేకుండానే కొన్ని ల్యాబ్‌లు నిర్వహిస్తున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అర్హత కలిగిన సిబ్బంది లేకుండా పరీక్షలు నిర్వహి స్తుండటంతో తప్పుడు నివేదికలు వస్తున్నాయని, దీంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపణలు న్నాయి. నిబంధనల ప్రకారం ల్యాబ్‌ల ఏర్పాటుకు జిల్లా వైద్యాధికారి అనుమతి తీసుకోవాలి. క్లినికల్ యాక్ట్ నిబంధనల మేరకు అనుమతి పత్రాలు, పరీక్షల రుసుముల పట్టికను కనిపించేలా ప్రదర్శిం చాలి. ప్రభుత్వ ఆమోదిత సంస్థల్లో డీఎంఎల్టీ, బీఎంఎల్టీ కోర్సులు పూర్తిచేసి, పారామెడికల్ బోర్డులో నమోదైన అర్హత కలిగిన సిబ్బందితోనే పరీక్షలు నిర్వహించాలి. నమూనాల సేకరణ గది, పరీక్షలు నిర్వహించే గది వేర్వేరుగా ఉండాలి. పాథాలజిస్టులు, మైక్రోబయాల జిస్టుల సేవలు అవసరమైన చోట నిబంధనల ప్రకారం అందుబాటులో ఉంచాలి. అయితే కొన్ని ప్రైవేటు ల్యాబ్‌లలో ఈ నిబంధనలు పాటించడం లేదనే ఆరోప ణలు వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారులు ఎప్పటి కప్పుడు తనిఖీలు నిర్వహించి ల్యాబ్‌ల రిజిస్ట్రేషన్లు, సిబ్బంది అర్హతలు, పరికరాల నిర్వహణ, పరీక్షల నాణ్యతా ప్రమాణాల ను పరిశీలించాల్సి ఉంది. కానీ ఇప్పటివరకు తనిఖీలు జరిగిన దాఖలాలు కనిపిం చడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై నర్సంపేట డిప్యూటీ డీఎంహెచ్ఓ ప్రకాశ్‌ను వివరణ కోరగా, ప్రైవేటు ల్యాబ్‌లను తనిఖీ చేస్తామని తెలిపారు. అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టి నిబం ధనలు ఉల్లంఘించే ల్యాబ్‌లపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



వస్త్ర దుకాణంలో అగ్నిప్రమాదం

- గాంధీ చౌక్‌లోపై అంతస్తులో చెలరేగిన మంటలు
- అదుపు చేసేందుకు అగ్నిమాపక సిబ్బంది యత్నం

ప్రజానావ, ఆదిలాబాద్ : ఆదిలాబాద్ పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద ఉన్న ఆదిలాబాద్ టెక్స్‌టైల్స్ వస్త్ర దుకాణంలో శనివారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. దుకాణం పై అంతస్తులో ఒక్కసారిగా మంటలు చెలరేగి వ్యాపించాయి. సమాచారం అందుకున్న ఆదిలాబాద్, ఇచ్చోడ అగ్నిమాపక శాఖ సిబ్బందితోపాటు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. అగ్నిప్రమాదంలో ఎంతమేర ఆస్తి నష్టం జరిగిందనే వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

అటవీశాఖలో వరుస వివాదాలు

- అధికారులపై చర్యలు
- భూమునిపాద జలపాతం అభివృద్ధి నిధులపై ఆరోపణలు
- కలప అక్రమ రవాణా వ్యవహారంలో ముగ్గురు ఉద్యోగుల సస్పెన్షన్

ప్రజానావ, గూడూరు : జిల్లాలో అటవీశాఖ పరిధిలో వరుసగా చోటుచేసుకుంటున్న సంఘట నలు ఆ శాఖలో అవినీతి ఆరోపణలకు దారితీస్తున్నాయి. మొక్కల పెంపకం, పర్యావరణ పర్యాటకం తదితర అభివృద్ధి పనుల్లో నిధుల వినియోగంపై పర్యవేక్షణ కొరవడిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విజిలెన్స్, నాణ్యత పరిశీలన అధికారుల తనిఖీలకు అవకాశం లేకపోవడంతో కొందరు అధికారులు, సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గూడూరు అటవీ డివిజన్ పరిధిలో ఇటీవల చోటుచేసుకున్న పలు సంఘటనల నేపథ్యంలో ఇప్పటికే పలువురు అధికారులపై చర్యలు తీసుకోగా, మరికొందరిపై చర్యలకు ఉన్నతాధికా రులు పరిశీలన చేస్తున్నట్లు తెలుస్తోంది. గూడూరు మండలంలోని పర్యాటక ప్రాంతమైన భీమునిపాద జలపాతం అభివృద్ధి కోసం కేటాయించిన నిధులు పక్కదారి పట్టినట్లు అటవీశాఖ పర్యావరణ అభివృద్ధి కమిటీ (ఈడీసీ), స్థానిక సర్పంచి ఆరోపించారు. ఈడీసీ కార్మికుల వేతనాల చెల్లింపుల పేరిట తప్పుడు పత్రాలు సృష్టించి నిధులు కాజేశారని కమిటీ చైర్మన్ రజిత, సర్పంచి మంగీలాల్ ఆరోపించారు. కమిటీ చైర్మన్, సభ్యులకు తెలియకుండానే నిధులు విడుదల కావడంపై వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సామాజిక మాధ్యమాల ద్వారా డిమాండ్ చేశారు. మరోవైపు గూడూరు మండలం లోని దామరవంచ, బ్రాహ్మణపల్లి గ్రామాల పరిధిలో మామిడి చెట్ల నరికివేత వ్యవహారం వివాదాస్పదంగా మారింది. అనుమతించిన సంఖ్య కంటే ఎక్కువ చెట్లను నరికివేయడంతోపాటు, ఇచ్చిన అనుమతులు కూడా చట్టవిరుద్ధంగా ఉన్నట్లు జిల్లా అటవీశాఖ అధికారి లావణ్య గుర్తించారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే కారణంతో ఇద్దరు బీట్ అధికారులను సస్పెండ్ చేశారు. మరో ఇద్దరు అధికారులపై చర్యలు తీసుకోవాలని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టుకు నివేదిక పంపారు. ఇక కొత్తగూడ మండలం ముస్మీలో పట్టుబడిన టేకు దుంగలను వెంటనే తరలించకుండా మరుసటి రోజు తీసుకెళ్తా మని అక్కడే వదిలివేయ డంతో, వాటిలో కొన్ని దుంగలను కలప అక్రమ రవాణాదారులు తరలించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనపై విచారణ జరిపిన ఉన్నతాధికారులు ముగ్గురు ఉద్యోగులను సస్పెండ్ చేశారు. అక్రమంగా కలప తరలించిన వ్యక్తుల నుంచి కొందరు ఉద్యోగులు నగదు తీసుకున్నారనే ఆరోపణలు కూడా వెలువడ్డా యి. ఈ వ్యవహారం జిల్లాలో చర్చనీయాంశమైంది. గూడూరు డివిజన్‌లో ఒక ఘటన మరువకముందే మరో వివాదం వెలుగులోకి వస్తుండటంతో ఉన్నతాధి కారులు ఈ ప్రాంతంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. అటవీ సంపద పరిరక్షణతోపాటు ప్రభుత్వ నిధుల వినియోగంలో పారదర్శకత ఉండేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఉపాధ్యాయుల మానవత్వం

- విద్యార్థికి పునర్జన్మ
- ఐదేళ్లుగా చెవి నొప్పితో బాధపడుతున్న బాలుడికి రూ.2 లక్షలతో శస్త్రచికిత్స

ప్రజానావ, డోర్నకల్ : బడిలో పాఠాలు వినాల్సిన బాలుడు చెవిలో తీవ్రమైన నొప్పితో ఐదేళ్లుగా నరకయాతన అనుభవించాడు. సమస్య మెదడుతో అనుసంధానమై ఉందని వైద్యులు చెప్పడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందారు. నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థి బాధను గమనించిన ఉపాధ్యాయులు మానవత్వంతో స్పందించారు. డోర్నకల్ పీఎంశ్రీ జడ్పీ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఎస్.సంతోష్‌కు దసరా సెలవుల్లో స్టూడెంట్ వెల్ఫేర్ ట్రస్టు ద్వారా రూ.2 లక్షలతో శస్త్రచికిత్స చేయించారు. సంతోష్ తండ్రి కిరణ్ ఆటో డ్రైవర్ కాగా, తల్లి స్రవంతి గృహిణి. చెవికి శస్త్రచికిత్స చేయించాలని వైద్యులు సూచించడంతో ఏం చేయాలో తెలియక తల్లిదండ్రులు ఆందోళన చెందారు. విషయం తెలుసుకున్న పాఠశాల స్టూడెంట్ వెల్ఫేర్ ట్రస్టు అండగా నిలిచింది. ట్రస్టు తరఫున రూ.1.50 లక్షలు సమకూర్చగా, స్థానిక వ్యాపారి మాదప్రసాద్ రూ.50 వేలు అందించారు. మూడు రోజుల క్రితం శస్త్రచికిత్స చేయగా, సంతోష్ కోలుకుని తిరిగి పాఠశాలకు వస్తున్నాడు. విద్యార్థి ఆరోగ్యం మెరుగుపడటంతో పాఠశాల ప్రధానోపా ధ్యాయుడు బండి నర్సింహారావు, ట్రస్టు చైర్మన్ అప్పిరెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్, జాయింట్ చైర్మన్ కూరపాటి శంకర్, కో–చైర్మన్ మంజులత, కోశాధికారి వసంతరాణి, ట్రస్టు సభ్యులు కమల, అనిత, రాంనాయక్ హర్షం వ్యక్తం చేశారు. తమ కుమారుడి చికిత్సకు సహకరించిన ఉపాధ్యాయులు, ట్రస్టు సభ్యుల సేవలను ఎన్నటికీ మరువలేమని సంతోష్ తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.



కవ్వాల్ పులుల రక్షణకు గ్రేహౌండ్స్ బృందాలు

- టైగర్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఏర్పాటుకు ప్రతిపాదనలు
- ప్రభుత్వ సానుకూల స్పందన

ప్రజానావ, జన్నారం : కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రంలో పులుల రక్షణకు ప్రత్యేక టైగర్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఏర్పాటు ప్రతిపాదన అమలుదిశగా అడుగులు పడుతున్నాయి. అటవీశాఖ అధికారులకు ఆయుధాలు అందించాలనే ఆలోచన నేపథ్యంలో గ్రేహౌండ్స్‌లో నైపుణ్యం కలిగిన రెండు బృందాలను కవ్వాల్, అమ్రాబాద్ పులుల సంరక్షణ కేంద్రాల్లో వినియోగించాలని యోచిస్తున్నారు. ఈ ప్రతిపాదనలకు ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన లభించినట్లు తెలుస్తోంది. కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రం 2012లో ఏర్పాటైంది. ఇందులో 892 చదరపు కిలోమీటర్ల కోర్ ఏరియా, 1,123 చదరపు కిలోమీటర్ల బఫర్ ఏరియా ఉన్నాయి. జాతీయ పులుల సంరక్షణ ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఇక్కడ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. పులుల సంరక్షణ, అటవీ రక్షణ కోసం అటవీశాఖ అధికారులు, జంతువుల జాడను గుర్తించే ట్రాకర్లు, బేస్‌క్యాంపు సిబ్బంది పనిచేస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మంచిర్యాల, ఆదిలాబాద్, నిర్మల్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల పరిధిలో ఈ అభయారణ్యం విస్తరించి ఉంది. ఇక్కడ విలువైన టేకు, సండ్ర, మద్ది తదితర వృక్ష సంపద ఉంది. ముఖ్యంగా జన్నారం అటవీ ప్రాంతంలోని టేకు కలపకు మంచి ఆదరణ ఉంది. అయితే ఈ ప్రాంతానికి వలస వస్తున్న పెద్దపులులు తిరిగి వెళ్లిపోతుండటానికి అటవీ ప్రాంతంలో గ్రామాలు ఉండటం కూడా కారణమని అటవీశాఖ భావిస్తోంది. మరోవైపు కవ్వాల్‌లో సంచరించే పులులకు తగిన రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలో నక్సల్స్ కార్యకలా పాలు తగ్గిన నేపథ్యంలో గ్రేహౌండ్స్ బృందాలను పులుల సంరక్షణ విధుల్లో వినియోగించాలని అధికారులు యోచిస్తున్నారు. పులుల ఆవాసాల పరిరక్షణకు దట్టమైన అడవులు, తగినంత నీటి లభ్యత, ఆహారంగా ఉపయోగపడే శాకాహార జంతువుల సంఖ్య పెంపు, వేట నిరోధక చర్యలు కీలకం. అలాగే అటవీ ప్రాంతాల్లో మానవ సంచారం వల్ల పులులకు ఎదురయ్యే ఇబ్బందులను తగ్గించాల్సి ఉంటుంది. అమ్రాబాద్‌లో చెంచు గిరిజనులు, కవ్వాల్‌లో ఆదివాసీ గిరిజనులతోపాటు అటవీ ప్రాంతాల సమీపంలో నివసించే అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యం కూడా అవసరం. కవ్వాల్‌లో గ్రేహౌండ్స్ బృందాల వినియోగంపై జన్నారం అటవీ డివిజనల్ అధికారి ఎం.రామ్‌మోహన్‌ను వివరణ కోరగా, టైగర్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఏర్పాటు ప్రతిపాదన వాస్తవమేనని తెలిపారు. అయితే గ్రేహౌండ్స్ బృందాల నియామకానికి సంబంధించి ఇంకా ఉత్తర్వులు అందలేదని స్పష్టం చేశారు. పులుల సంరక్షణకు ప్రత్యేక బృందం ఏర్పాటు అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు.



ప్రపంచ ఆకలి సూచీలో భారత్‌కు 100వ స్థానం

- 24.1 స్కోరుతో 'తీవ్రమైన' వర్గంలోనే దేశం
- చిన్నారుల్లో పెరుగుతున్న పోషకాహార లోపం

న్యూఢిల్లీ : అభివృద్ధిలో అగ్రరాజ్యాలతో పోటీపడుతున్నామని, ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతున్నామని కేంద్రంలోని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం చెబుతున్నప్పటికీ.. ఆకలి నిర్మూలనలో మాత్రం దేశం ఆశించిన పురోగతి సాధించడం లేదనే అంశాన్ని ప్రపంచ ఆకలి సూచీ వెల్లడించింది. 2026 గ్లోబల్ హంగర్ ఇండెక్స్ (జీహెచ్ఐ)లో 122 దేశాలకు గాను భారత్ 100వ స్థానంలో నిలిచింది. జర్మనీకి చెందిన వెల్ట్‌హంగర్‌హిల్ఫ్ (డబ్ల్యూహెచ్‌హెచ్), ఐర్లాండ్‌కు చెందిన కన్సర్న్ వరల్డ్‌వైడ్, ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఇంటర్నేషనల్ లా ఆఫ్ పీస్ అండ్ ఆర్మ్ కాన్‌ఫ్లిక్ట్, స్విస్ సంస్థ హెల్వటాస్ తదితర సంస్థలు సంయుక్తంగా ఈ సూచీని విడుదల చేశాయి. భారత్ 24.1 స్కోరుతో ఇప్పటికీ 'తీవ్రమైన ఆకలి' వర్గంలోనే కొనసాగుతున్నది. 2012 నుంచి ఈ వర్గం నుంచి దేశం బయటపడలేకపోయింది. దేశ జనాభాలో 9.8 శాతం మంది పోషకాహార లోపంతో బాధపడుతున్నారని సూచీ వెల్లడించింది. ఐదేండ్లలోపు పిల్లల్లో 29 శాతం మంది వయసుకు తగిన ఎదుగుదల లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు పిల్లల్లో వయసుకు తగిన బరువు లేకపోవడాన్ని సూచించే 'వేస్టింగ్' రేటు 19 శాతానికి చేరింది. గతంలో ఇది 16.9 శాతంగా ఉండగా, ప్రస్తుతం దక్షిణాసియాలోనే అత్యధిక స్థాయికి పెరిగింది. ఆకలిని తగ్గించడంలో భారత్ పురోగతి కూడా మందగించినట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. 2018 నుంచి 2026 మధ్య దేశ స్కోరు 25.8 నుంచి కేవలం 1.7 పాయింట్లు మాత్రమే మెరుగుపడింది. 2006 నుంచి 2012 మధ్య నమోదైన 8.2 పాయింట్ల పురోగతితో పోలిస్తే ఇది చాలా తక్కువ. దక్షిణాసియా ప్రాంతం మొత్తం స్కోరు 23.5గా ఉండగా, పిల్లల్లో వేస్టింగ్ రేటు 15.8 శాతంగా నమోదైంది. ప్రపంచంలోని అన్ని ప్రాంతాలతో పోలిస్తే ఈ ప్రాంతంలోనే పిల్లల బరువు లోపం అధికంగా ఉంది. దక్షిణాసియాలో ఆకలి పరిస్థితులు ఇప్పటికీ ఆందోళనకరంగానే ఉన్నాయని సూచీ పేర్కొంది. పలు దేశాల్లో గత కొన్నేళ్లుగా ఆకలి నిర్మూలనలో పురోగతి నిలిచిపోగా, ముఖ్యంగా పాకిస్థాన్ సహా రెండు దేశాల్లో 2018తో పోలిస్తే పరిస్థితులు మరింత దిగజారినట్లు నివేదిక వెల్లడించింది.

ఫిలిప్పైన్స్‌లో ఘోర విమాన ప్రమాదం

- నలుగురు పైలట్లు మృతి
- గాలిలోనే ఢీకొన్న రెండు శిక్షణ విమానాలు
- ఎస్ఎఫ్-260 విమానాల సేవలు తాత్కాలికంగా నిలిపివేత

మనీలా : ఫిలిప్పైన్స్‌లో ఘోర విమాన ప్రమాదం చోటుచేసుకుంది. ఆ దేశ వైమానిక దళానికి చెందిన రెండు శిక్షణ విమానాలు గాలిలోనే ఢీకొని కూలిపోవడంతో నలుగురు పైలట్లు ప్రాణాలు కోల్పోయారు. రాజధాని మనీలాకు దక్షిణంగా ఉన్న బటాంగాస్ ప్రావిన్స్‌లోని ఫెర్నాండో ఎయిర్‌బేస్ సమీపంలో శుక్రవారం ఈ ప్రమాదం జరిగింది. ఎస్ఎఫ్–260 రకానికి చెందిన రెండు విమానాలు శిక్షణలో ఉండగా గాలిలోనే పరస్పరం ఢీకొన్నాయి. అనంతరం ఎయిర్‌బేస్ పరిసరాల్లో కూలిపోయాయి. సమాచారం అందుకున్న సహాయక బృందాలు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. విమానాల్లో ఉన్న నలుగురు పైలట్లు మరణించినట్లు గుర్తించి, వారి మృతదేహాలను స్వాధీనం చేసుకున్నాయి. పైలట్లకు శిక్షణ ఇచ్చేందుకు వినియోగించే ఈ విమానాల ప్రమాదంతో ఫిలిప్పైన్స్ వైమానిక దళం అప్రమత్తమైంది. ముందు జాగ్రత్త చర్యగా ఎస్ఎఫ్–260 విమానాల సేవలను తాత్కాలికంగా నిలిపివేసింది. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకునేందుకు దర్యాప్తు చేపట్టినట్లు సైనిక అధికారులు వెల్లడించారు. శిక్షణలో ఉన్న పైలట్లు ప్రాణాలు కోల్పోవడం విచారకరమని పేర్కొన్నారు. కాగా, ఎస్ఎఫ్–260 విమానాలు గతంలోనూ ప్రమాదాలకు గురయ్యాయి. గత మేలో జరిగిన ఓ ప్రమాదంలో ఇద్దరు పైలట్లు మరణించగా, అంతకుముందు 2023లో ఎస్ఎఫ్–260 టీపీ మార్చెట్టి విమానం కూలిన ఘటనలో మరో ఇద్దరు పైలట్లు ప్రాణాలు కోల్పోయారు. వరుస ప్రమాదాలు ఈ విమానాల భద్రతపై ఆందోళనలను పెంచుతున్నాయి. తాజా ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై దర్యాప్తు బృందం విచారణ కొనసాగిస్తోంది.

టోల్ ఫీజు ఎగ్గొట్టేందుకు ఉద్యోగిని కారుతో ఢీకొట్టి

- బానెట్‌పై ఈడ్చుకెళ్లిన డ్రైవర్
- పంజాబ్‌లో ఘటన
- సీసీటీవీ ఆధారంగా నిందితుడి కోసం పోలీసుల గాలింపు



పటియాలా : పంజాబ్‌లోని పటియాలా జిల్లాలో కారు డ్రైవర్ బీభత్సం సృష్టించాడు. టోల్ ఫీజు చెల్లించకుండా తప్పించుకునేందుకు వేగంగా దూసుకొచ్చి బ్యారియర్లను ఢీకొట్టడమే కాకుండా, అడ్డుగా వచ్చిన ఉద్యోగిని కారుతో ఢీకొట్టి బానెట్‌పై కొంతదూరం ఈడ్చుకెళ్లాడు. పటియాలా–రాజ్‌పురా జాతీయ రహదారిపై ఉన్న ధరేరి జట్టన్ టోల్ ప్లాజా వద్ద తెల్లవారుజామున 3.58 గంటలకు ఈ ఘటన చోటుచేసుకుంది. వేగంగా వచ్చిన తెలుపు రంగు కారు టోల్ ప్లాజా వద్ద ఆగకుండా బూమ్ బ్యారియర్‌ను బలంగా ఢీకొట్టింది. అదే సమయంలో విధుల్లో ఉన్న ఉద్యోగి అమన్‌దీప్ సింగ్‌ను ఢీకొట్టడంతో అతడు కారు బానెట్‌పై పడిపోయాడు. అయినప్పటికీ డ్రైవర్ కారును ఆపకుండా ముందుకు పోనివ్వడంతో అమన్‌దీప్ కొంతదూరం బానెట్‌పైనే ఉండిపోయాడు. ఆ తర్వాత కిందపడిపోగా, డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యా డు. ఈ దృశ్యాలన్నీ టోల్ ప్లాజాలోని నిఘా కెమెరాల్లో రికార్డయ్యాయి. తీవ్రంగా గాయపడిన అమన్‌దీప్ సింగ్‌ను వెంటనే పటియాలాలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతడికి తీవ్ర గాయాలైనప్పటికీ ప్రస్తుతం ప్రాణాపాయం తప్పిందని, చికిత్స కొనసాగుతోందని వైద్యులు తెలిపారు. బాధితుడు పటియాలా జిల్లా ఘుమానా గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు నిఘా కెమెరాల దృశ్యాల ఆధారంగా కారు రిజిస్ట్రేషన్ నంబరును గుర్తించారు. కారులో డ్రైవర్ ఒక్కడే ఉన్నట్లు నిర్ధారించి, అతడి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ ఘటనపై టోల్ ప్లాజా కార్మికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితుడిని వెంటనే అరెస్టు చేయాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టి రహదారులను దిగ్బంధిస్తామని హెచ్చరించారు.




ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు

- టాయిలెట్‌లో హెచ్చరిక నోట్
- రెండు గంటలు ఆలస్యంగా చెన్నైకి బయలుదేరిన విమానం

న్యూఢిల్లీ : ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు రావడంతో ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో కలకలం రేగింది. టేకాఫ్‌కు సిద్ధమవుతున్న సమయంలో విమానం వెనుక భాగంలోని మరుగుదొడ్డిలో బెదిరింపు సందేశంతో కూడిన నోట్‌ను సిబ్బంది గుర్తించారు. శుక్రవారం మధ్యాహ్నం 3.15 గంటలకు ఢిల్లీ నుంచి చెన్నైకు బయలుదేరాల్సిన ఇండిగో విమానం 6ఈ 6091లో ఈ ఘటన చోటుచేసుకుంది. విమానాన్ని చెన్నైకు తీసుకెళ్లవద్దని హెచ్చరిస్తూ ఆ నోట్‌లో సందేశం ఉన్నట్లు గుర్తించారు. దీంతో అప్రమత్తమైన సిబ్బంది సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. నిబంధనల ప్రకారం విమానం టేకాఫ్‌ను నిలిపివేసి, దాన్ని తిరిగి పార్కింగ్ బేకు తీసుకెళ్లారు. అనంతరం భద్రతా తనిఖీలతోపాటు ప్రామాణిక కార్యాచరణ విధానాలను పూర్తి చేశారు. తనిఖీల్లో బాంబు బెదిరింపు సందేశం బూటకమని తేలడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రక్రియ కారణంగా సుమారు రెండు గంటలు ఆలస్యమైన విమానం శుక్రవారం సాయంత్రం 5 గంటల సమయంలో చెన్నైకు బయలుదేరింది. రాత్రి 7.40 గంటలకు చెన్నై విమానాశ్రయంలో సురక్షితంగా దిగినట్లు ఇండిగో అధికారి వెల్లడించారు.

యుద్ధం ముదిరితే ఇంటర్నెట్‌కూ ముప్పు


- సముద్రగర్భ కేబుళ్లే లక్ష్యంగా ఇరాన్ హెచ్చరిక
- భారత్‌లో డిజిటల్ సేవలకు అంతరాయం కలిగే అవకాశం



న్యూఢిల్లీ : ఇరాన్, ఇజ్రాయెల్–అమెరికా మధ్య యుద్ధ ప్రభావం ఇప్పటికే అంతర్జాతీయ ఇంధన ధరలపై పడగా.. పరిస్థితి మరింత తీవ్రతరమైతే భారత్ సహా ప్రపంచంలోని పలు దేశాల్లో ఇంటర్నెట్ సేవలపైనా ప్రభావం పడే ప్రమాదం కనిపిస్తున్నది. ఇరాన్‌తో ఒప్పందం కుదరకపోతే మరోసారి సైనిక దాడులు చేపట్టవచ్చని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించిన నేపథ్యంలో ఉద్రిక్తతలు పెరిగాయి. అమెరికా, ఇజ్రాయెల్ మరోసారి దాడులకు దిగితే గల్ఫ్ ప్రాంతంలోని సముద్రగర్భ కమ్యూనికేషన్ కేబుళ్లను లక్ష్యంగా చేసుకుంటామని ఇరాన్ హెచ్చరించినట్లు కథనాలు వెలువడ్డాయి. ప్రపంచ అంతర్జాతీయ డేటా రవాణాలో సుమారు 95 నుంచి 99 శాతం వరకు సముద్రగర్భ కేబుళ్ల ద్వారానే జరుగుతున్నది. ప్రపంచ వాణిజ్యానికి హోర్ముజ్ జలసంధి ఎంత కీలకమో.. అంతర్జాతీయ సమాచార వ్యవస్థకూ ఈ ప్రాంతం అంతే ప్రాధాన్యం కలిగి ఉంది. గల్ఫ్ ప్రాంతంలోని సముద్రగర్భ కేబుళ్లు ఆసియా, యూరప్, మధ్యప్రాచ్య దేశాల మధ్య ఇంటర్నెట్ కనెక్టివిటీని అందిస్తున్నాయి. వీటి ద్వారా భారీ మొత్తంలో డేటా ఒక దేశం నుంచి మరో దేశానికి చేరుతుంది. ఈ కేబుళ్లు దెబ్బతింటే భారత్‌లోనూ కొన్ని డిజిటల్ సేవలకు అంతరాయం కలిగే అవకా ం ఉంది. బ్యాంకులు, చెల్లింపు వ్యవస్థల సర్వర్లతో అనుసంధానం దెబ్బతింటే కొన్ని లావాదేవీలు విఫలమవ్వడం లేదా ఆలస్యమవడం జరగవచ్చు. వాట్సాప్ సందేశాలు పంపడం, స్వీకరించడం, వాయిస్, వీడియో కాల్స్‌లో సమస్యలు తలెత్తవచ్చు. యూట్యూబ్ వీడియోలు నెమ్మదిగా లోడ్ కావడం, ప్రత్యక్ష ప్రసారాల్లో అంతరాయాలు ఏర్పడటం, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల్లో కంటెంట్ కనిపించేందుకు ఎక్కువ సమయం పట్టడం వంటి సమస్యలు ఎదురుకావచ్చు. విదేశీ సర్వర్లపై ఆధారపడే కొన్ని కృత్రిమ మేధ అప్లికేషన్ల సేవలపైనా ప్రభావం పడే అవకాశం ఉంది. అయితే భారత్‌లో యూపీఐ, వాట్సాప్ సహా అన్ని ఇంటర్నెట్ సేవలు పూర్తిగా నిలిచిపోతాయని చెప్పలేము. దేశానికి అనేక అంతర్జాతీయ సముద్ర గర్భ కేబుళ్లు, ప్రత్యామ్నాయ నెట్‌వర్క్ మార్గాలు అందుబాటులో ఉన్నాయి. కేబుళ్లకు జరిగిన నష్టం ఎంత విస్తృతంగా ఉంది, ఏ మార్గాలు దెబ్బతిన్నాయి, ప్రత్యామ్నాయ మార్గాల సామర్థ్యం ఎంత అనే అంశాలపై అంతరాయం తీవ్రత ఆధారపడి ఉంటుంది. ఒకటి లేదా కొన్ని కేబుళ్లు దెబ్బతిన్నా మిగిలిన మార్గాల ద్వారా డేటాను మళ్లించే అవకాశం ఉంటుంది. అయితే ఒకే కీలక ప్రాంతంలో అనేక కేబుళ్లు ఒకేసారి దెబ్బతింటే ఇంటర్నెట్ వేగం తగ్గడంతోపాటు డిజిటల్ సేవలకు తీవ్ర అంతరాయం కలిగే ప్రమాదం ఉంది.

పసిఫిక్‌లో రికార్డు స్థాయికి చేరిన ఉష్ణోగ్రతలు

- ఎల్‌నినో ప్రభావంతో 30 డిగ్రీలు దాటిన సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు
- భారత్‌లోనూ వర్షపాతంపై ప్రభావం పడే అవకాశం



న్యూఢిల్లీ : పసిఫిక్ మహాసముద్రంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు గతంలో ఎన్నడూ లేనంత గరిష్ఠస్థాయికి చేరాయి. ఎల్‌నినో ప్రభావం పెరుగుతుండటంతో భూమధ్యరేఖకు సమీపంలోని మధ్య పసిఫిక్ ప్రాంతంలో ఉష్ణోగ్రతలు భారీగా పెరుగుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు తొలిసారిగా 30 డిగ్రీల సెల్సియస్ మార్కును దాటినట్లు అమెరికా జాతీయ సముద్ర, వాతావరణ పరిపాలనా సంస్థ సమాచారాన్ని ఆధారంగా చేసుకుని వెల్లడించారు. అక్టోబరు 22న ఈ ప్రాంతంలో ఉష్ణోగ్రత 30 డిగ్రీలకు చేరినట్లు 'ఇండియా టుడే' పేర్కొంది. అందుబాటులో ఉన్న రికార్డుల ప్రకారం పసిఫిక్ మహాసముద్రంలో పగటి ఉష్ణోగ్రతలు ఈ స్థాయికి చేరడం ఇదే తొలిసారి. పసిఫిక్ మహాసముద్రంలోని మధ్య, తూర్పు ఉష్ణమండల ప్రాంతాల్లో సముద్ర ఉపరితల జలాలు సాధారణం కంటే ఎక్కువగా వేడెక్కడాన్ని ఎల్‌నినోగా పిలుస్తారు. ఈ సహజ వాతావరణ పరిణామంతో సముద్రంపై వీచే గాలులు, మేఘాల కదలికలు, వర్షపాత నమూనాల్లో మార్పులు చోటుచేసుకుంటాయి. దీని ప్రభావం పసిఫిక్ ప్రాంతానికే పరిమితం కాకుండా ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల వాతావరణంపై పడుతుంది. కొన్ని ప్రాంతాల్లో కరువు, అధిక ఉష్ణోగ్రతలు పెరిగే ప్రమాదం ఉండగా, మరికొన్ని చోట్ల భారీ వర్షాలు, వరదలు సంభవించే అవకాశముంది. ప్రపంచ వాతావరణ సంస్థ అంచనాల ప్రకారం అక్టోబరు నుంచి డిసెంబరు మధ్య ఎల్‌నినో మరింత బలపడే సూచనలు ఉన్నాయి. డిసెంబరు నాటికి గరిష్ఠ తీవ్రతకు చేరవచ్చని అంచనా వేస్తున్నారు. ఎల్‌నినో తీవ్రతను అంచనా వేసేందుకు శాస్త్రవేత్తలు ఉపయోగించే నినో 3.4 సూచీలో సముద్ర ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే జూన్‌లో 1.6 డిగ్రీలు, ఆగస్టులో 2.5 డిగ్రీలు అధికంగా నమోదయ్యాయి. అక్టోబరు నుంచి డిసెంబరు మధ్య ఈ వ్యత్యాసం 3.7 డిగ్రీలకు చేరవచ్చని ప్రపంచ వాతావరణ సంస్థ అంచనా వేసింది. ఇది గతంలో నమోదైన గరిష్ఠస్థాయి కంటే ఎక్కువ కావడం ఆందోళన కలిగిస్తోంది. ఈ పరిణామాల ప్రభావం భారత్‌పైనా పడే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. దేశంలో నైరుతి రుతుపవనాల సీజన్ సాధారణం కంటే 13 శాతం తక్కువ వర్షపాతంతో ముగిసింది. అక్టోబరు నుంచి డిసెంబరు మధ్య దేశంలోని చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షాలు కురిసే అవకాశముందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. అయితే దక్షిణ ద్వీపకల్ప ప్రాంతంలో మొత్తంగా సాధారణ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. ప్రాంతాలవారీగా వాతావరణ పరిస్థితులు మారవచ్చని, ఎల్‌నినో ఒక్కటే భారత్‌లో వర్షపాతాన్ని నిర్ణయించే అంశం కాదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

నోయిడాలో భారీ అగ్నిప్రమాదం

ఒకరు మృతి

నోయిడా : ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో శనివారం మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఒకరు ప్రాణాలు కోల్పోగా, ఐదు దుకాణాలు అగ్నికి ఆహుతయ్యాయి. సెక్టార్ 125లో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన టీ, చిరుతిళ్ల దుకాణాల్లో తొలుత మంటలు చెలరేగాయి. సెక్టార్ 126 పోలీస్ స్టేషన్ పరిధిలోని రాయ్‌పూర్ ప్రాంతంలో ఉన్న దుకాణాలకు మంటలు వేగంగా వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమా పక, పోలీసు సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని ఆరు అగ్నిమాపక యంత్రాల సాయంతో మంటలను అదుపులోకి తెచ్చేందుకు శ్రమించారు. దట్టమైన నల్లటి పొగ ఆ ప్రాంతమంతా వ్యాపించ దంతో ముందు జాగ్రత్త చర్యగా సమీప రహదారుల ను మూసివేసి సహాయక చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో అపస్మారక స్థితిలో పడి ఉన్న వ్యక్తిని సిబ్బంది గుర్తించి ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉందని అధికారులు తెలిపారు. ప్రమాద స్థలంలో పెద్ద సంఖ్యలో ఎల్పీజీ సిలిండర్లు ఉండటంతో మరిన్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు నోయిడా ప్రధాన అగ్ని మాపక అధికారి ప్రదీప్ కుమార్ వెల్లడించారు. శిథిలాల కింద ఎవరైనా చిక్కుకున్నారా అనే కోణంలో సహాయక బృందాలు గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

వనువాటు తీరంలో వరుస భూకంపాలు

- సునామీ హెచ్చరికలు
- 6.9, 6.3 తీవ్రతతో ప్రకంపనలు
- 300 కిలోమీటర్ల పరిధిలో అప్రమత్తత

వనువాటు : ద్వీపదేశమైన వనువాటు తీరంలో శనివారం భారీ భూకంపం సంభవించింది. 6.9, 6.3 తీవ్రతతో వరుసగా రెండు భూకంపాలు నమోదయ్యాయి. దీంతో భూకంప కేంద్రానికి 300 కిలోమీటర్ల పరిధిలోని దక్షిణ పసిఫిక్ తీర ప్రాంతాలకు సునామీ హెచ్చరికలు జారీ అయ్యాయి. భూకంపం కారణంగా జరిగిన నష్టానికి సంబంధించిన వివరాలు ఇంకా వెల్లడికాలేదు. ప్రాణ, ఆస్తి నష్టంపై ఎలాంటి సమాచారం అందుబాటులో లేదు. పసిఫిక్ తీరంలో ఉన్న ఆస్ట్రేలియాకు సునామీ ముప్పు లేదని నిపుణులు తెలిపారు. అమెరికా భూగర్భ సర్వే సంస్థ (యూఎస్‌జీఎస్) వెల్లడించిన వివరాల ప్రకారం.. వనువాటులోని వెస్ట్ సోలా ప్రాంతానికి సుమారు 200 కిలోమీటర్ల దూరంలో మధ్యాహ్నం 12.31 గంటలకు 6.9 తీవ్రతతో తొలి భూకంపం సంభవించింది. కొద్దిసేపటికే 6.3 తీవ్రతతో మరోసారి భూమి కంపించింది. వాయువ్య వనువాటు తీరంలోని సముద్ర జలాల్లో 10 కిలోమీటర్ల లోతున భూకంపం సంభవించినట్లు గుర్తించారు. దీంతో భూకంప కేంద్రానికి 300 కిలోమీటర్ల పరిధిలోని తీర ప్రాంతాల్లో సునామీ అలలు వచ్చే ప్రమాదం ఉందని పసిఫిక్ సునామీ హెచ్చరికల కేంద్రం (పీటీడబ్ల్యూసీ) అప్రమత్తం చేసింది. వనువాటుపై భూకంప ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉందని పేర్కొంటూ తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. అధికారులు, ప్రభుత్వం జారీ చేసే సూచనలు, హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనించాలని ఆదేశించింది. వనువాటు భూకంపాలు, సునామీలు తరచూ సంభవించే 'పసిఫిక్ రింగ్ ఆఫ్ ఫైర్' ప్రాంతంలో ఉంది. ఫిజీ, టోంగా వంటి ఇతర పసిఫిక్ దేశాలూ ఈ భౌగోళిక మండలంలోనే ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో భూకంపాల కారణంగా సునామీ, భారీ సముద్ర అలలు ఎగసిపడే ప్రమాదం ఉంటుంది.



యూకేలో 'బీ రెడీ' అత్యవసర ప్రచారం

- మూడు రోజులపాటు ఇబ్బందులు తట్టుకునేలా నిత్యావసరాలు సిద్ధం చేసుకోవాలి

లండన్ : తీవ్రమైన వాతావరణ పరిస్థితులు, కార్చిచ్చులు, సైబర్ దాడులు, నిత్యావసర సేవలకు అంతరాయం వంటి అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని యూకే ప్రభుత్వం ప్రజలకు సూచించింది. ఇందులో భాగంగా 'బీ రెడీ' పేరుతో ప్రత్యేక ప్రచారాన్ని ప్రారంభించింది. ఆహారం, తాగునీరు, విద్యుత్, ఇంటర్నెట్, డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలు పనిచేయని పరిస్థితుల్లో కనీసం మూడు రోజులపాటు ఇబ్బందులు తట్టుకునేలా అవసరమైన సామగ్రిని ఇళ్లలో అందుబాటులో ఉంచుకోవాలని అప్రమత్తం చేసింది. తాగునీరు, ఆహార పదార్థాలు, విద్యుత్ అంతరాయం సమయంలో ఉపయోగపడే టార్చి లైట్లు, బ్యాటరీలు, దుప్పట్లు, ఇంటర్నెట్ లేకున్నా వార్తలు తెలుసుకునేందుకు రేడియో, డిజిటల్ చెల్లింపులు సాధ్యం కానప్పుడు వినియోగించేందుకు కొంత నగదు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించింది. ఇందుకు సంబంధించిన నిత్యావసరాల జాబితాను 'బీ రెడీ' వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. ప్రజలు ఒకేసారి పెద్దఎత్తున వస్తువులు కొనుగోలు చేసి నిల్వ చేసుకోవాల్సిన అవసరం లేదని, ప్రతి వారం షాపింగ్‌కు వెళ్లినప్పుడు కొద్దికొద్దిగా అవసరమైన సామగ్రిని సమకూర్చుకోవాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. యూరప్ వ్యాప్తంగా ప్రజలు నిరసనలు కొనసాగిస్తున్న తరుణంలో యూకే ప్రభుత్వం ఈ ప్రచారాన్ని ప్రారంభించడం గమనార్హం.



23 దేశాలు చుట్టి మణిపూర్‌కు చేరిన అమూర్ ఫాల్కన్లు

- 'అపపాంగ్', 'అలాంగ్' పక్షుల వలస ప్రయాణం విజయవంతం
- తదుపరి మజిలీ సోమాలియా

మణిపూర్ : వేలాది కిలోమీటర్ల సుదీర్ఘ ప్రయాణం అనంతరం రెండు అమూర్ ఫాల్కన్ పక్షులు సురక్షితంగా మణిపూర్‌కు తిరిగొచ్చాయి. 'అపపాంగ్', 'అలాంగ్'గా పేరుపెట్టిన ఈ పక్షులు వార్షిక వలస ప్రయాణంలో భాగంగా ఆసియా, ఆఫ్రికా ఖండాల్లోని 23 దేశాలను చుట్టివచ్చినట్లు కేంద్ర పర్యావరణశాఖ మంత్రి భూపేందర్ యాదవ్ వెల్లడించారు. ఈశాన్య చైనాలోని సంతానోత్పత్తి ప్రాంతాల నుంచి బయలుదేరిన 11 రోజుల తర్వాత మణిపూర్‌కు చేరుకున్నాయి. గత నవంబరులో వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా శాస్త్రవేత్తలు ఈ రెండు పక్షులకు ఉపగ్రహ అనుసంధాన గుర్తింపు పరికరాలను అమర్చి వదిలిపెట్టారు. అప్పటి నుంచి వాటి ప్రయాణ మార్గాన్ని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఏడాది తర్వాత అవి తిరిగి మణిపూర్‌కు చేరుకోవడంతో ఈ పర్యవేక్షణ ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది. పక్షుల రాకతో పక్షి ప్రేమికులు, పర్యావరణవేత్తలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ అమూర్ ఫాల్కన్లు మణిపూర్‌లోని తమెంగ్‌లాంగ్ జిల్లా పర్వత ప్రాంతాల్లో రెండు నుంచి మూడు వారాలపాటు బస చేయనున్నాయి. ఈ సమయంలో అక్కడ లభించే చెద పురుగులను ఆహారంగా తీసుకుంటూ, తదుపరి సుదీర్ఘ ప్రయాణానికి అవసరమైన శక్తిని పొందేందుకు శరీరంలో కొవ్వును నిల్వ చేసుకుంటాయి. ఇక్కడ విశ్రాంతి తీసుకున్న అనంతరం తమ వలస ప్రయాణంలో అత్యంత కఠినమైన దశను ప్రారంభించి సోమాలియాకు బయలుదేరతాయి. ఈ ప్రయాణంలో దాదాపు 6,000 కిలోమీటర్ల దూరాన్ని ఎక్కడా ఆగకుండా అధిగమించాల్సి ఉంటుంది. ముఖ్యంగా అరేబియా సముద్రంపై సుమారు 3,000 కిలోమీటర్ల మేర అవిశ్రాంతంగా ఎగరడం ఈ ప్రయాణంలో కీలకమైన దశ. అమూర్ ఫాల్కన్లు ఈశాన్య ఆసియాలో సంతానోత్పత్తి చేసి, శీతాకాలంలో ఆఫ్రికాకు వలస వెళ్తాయి. ఈ క్రమంలో ఈశాన్య భారతదేశం వాటికి కీలకమైన విశ్రాంతి కేంద్రంగా నిలుస్తోంది. ఏటా తమ ప్రాంతానికి వచ్చే ఈ పక్షులను స్థానిక సమాజాలు ఆదరిస్తూ, వాటి సంరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఉపగ్రహ పర్యవేక్షణ ద్వారా పక్షుల వలస మార్గాలు, సుదూర ప్రయాణ సామర్థ్యం, అద్భుతమైన సహనశక్తిపై శాస్త్రవేత్తలకు విలువైన సమాచారం లభిస్తోంది.

ఫరూక్ అబ్దుల్లా వ్యాఖ్యలపై బీజేపీ ఆగ్రహం

- కశ్మీర్ విషయంలో పాక్‌కు అనుకూలంగా మాట్లాడారంటూ విమర్శలు

శ్రీనగర్ : నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ) అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా చేసిన వ్యాఖ్యలు రాజకీయ వివాదానికి దారితీశాయి. బారాముల్లాలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అంతర్జాతీయ వేదికలపై కశ్మీర్ సమస్యను ప్రస్తావిస్తూ, పాకిస్థాన్ ఇక్కడి ప్రజలను కాపాడుతోందని వ్యాఖ్యానించారు. కశ్మీర్ విషయంలో కేంద్ర ప్రభుత్వ ఉద్దేశాలు సరిగా లేవని ఆరోపించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మైనారిటీల ఆస్తులు, ప్రార్థనా మందిరాలను లక్ష్యంగా చేసుకుని కూల్చివేతలు చేపడుతున్నారని విమర్శించారు. ఈ నేపథ్యంలో దేశంలోని ముస్లింలంతా ఐక్యంగా నిలవాలని పిలుపునిచ్చారు. ఫరూక్ అబ్దుల్లా వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. జమ్మూకశ్మీర్ బీజేపీ అధ్యక్షుడు సత్ శర్మ ఆయన వ్యాఖ్యలను దేశద్రోహంగా అభివర్ణించారు.

అమెరికాలో గ్యాంగ్‌స్టర్ హిమాంశు భౌ అరెస్ట్

- లాస్ వెగాస్‌లో పట్టుకున్న ఎఫ్‌బీఐ
- భారత్‌లో 30కి పైగా కేసులు

వాషింగ్టన్ : భారత్‌కు చెందిన మోస్ట్ వాంటెడ్ గ్యాంగ్‌స్టర్ హిమాంశు భౌను అమెరికా ఫెడరల్ దర్యాప్తు సంస్థ (ఎఫ్‌బీఐ) గురువారం అరెస్టు చేసింది. 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' కథనం ప్రకారం.. హిమాంశు లాస్ వెగాస్‌లో దాక్కున్నట్లు గుర్తించిన భారత దర్యాప్తు సంస్థలు ఈ సమాచారాన్ని ఎఫ్‌బీఐకి అందించాయి. అతడిపై భారత్‌లోని వివిధ రాష్ట్రాల్లో హత్య, హత్యాయత్నం, దోపిడీ, ఆయుధాల అక్రమ రవాణా తదితర నేరాలకు సంబంధించి 30కి పైగా కేసులు నమోదయ్యాయి. అతడిని పట్టుకునేందుకు ఇంటర్‌పోల్ 2023లో రెడ్ కార్నర్ నోటీసు జారీ చేసింది. అమెరికాలో ఉంటూనే తన నేర నెట్‌వర్క్ ద్వారా భారత్‌లో నేరాలకు పాల్పడటంతోపాటు వ్యాపారుల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు దర్యాప్తు సంస్థలు వెల్లడించాయి.

కివీస్‌కు తిలక్ జలక్

- 26 బంతుల్లోనే హాఫ్ సెంచరీ బాదిన తిలక్ వర్మ
- రెండో టీ20లో న్యూజిలాండ్‌పై భారత్ గెలుపు
- రాణించిన నితీశ్, నామన్



క్రైస్ట్‌చర్చ్: ఓటమి ఖాయమనుకున్న స్థితి నుంచి టీమ్ ఇండియా అద్భుత విజయాన్ని అందుకుంది. న్యూజిలాండ్‌తో శనివారం జరిగిన రెండో టీ20లో తిలక్ వర్మ (26 బంతుల్లో అజేయంగా 51; 6 ఫోర్లు, 1 సిక్స్), నితీశ్ కుమార్ రెడ్డి (13 బంతుల్లో అజేయంగా 26; 1 ఫోర్, 1 సిక్స్) మెరుపు బ్యాటింగ్‌తో భారత్ నాలుగు వికెట్ల తేడాతో గెలిచింది. 181 పరుగుల లక్ష్య ఛేదనలో 70 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయిన భారత్‌ను ఈ జోడీ అద్భుత భాగస్వామ్యంతో గెలిపించింది. మరో బంతి మిగిలుండగానే 19.5 ఓవర్లలో 181/6తో లక్ష్యాన్ని అందుకుంది. ఛేదనలో భారత్‌కు ఆరంభం నుంచే ఎదురుదెబ్బలు తగిలాయి. సంజూ శాంసన్ (14), వైభవ్ సూర్యవంశీ (4) త్వరగా వెనుదిరిగారు. అభిషేక్ శర్మ (27) ఫర్వాలేదనిపించినా.. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (7), అక్షర్ పటేల్ (11) విఫలమయ్యారు. కివీస్ కెప్టెన్ మిచెల్ సాంట్నర్ నాలుగు వికెట్లతో భారత్‌ను కష్టాల్లోకి నెట్టాడు. ఈ దశలో నామన్ ధీర్ (17 బంతుల్లో 31) దూకుడుగా ఆడి ఆశలు రేపాడు. అయితే అతడూ వెనుదిరగడంతో బాధ్యత తిలక్‌పై పడింది.

ఒత్తిడి లెక్కచేయకుండా..

ఒత్తిడిని లెక్కచేయకుండా తిలక్ బౌండరీలతో విరుచుకుపడ్డాడు. మరోవైపు నితీశ్ కూడా ధాటిగా ఆడటంతో కివీస్ బౌలర్లకు అవకాశం లేకుండా పోయింది. ఈ జోడీ ఏడో వికెట్‌కు కేవలం 30 బంతుల్లోనే అజేయంగా 69 పరుగులు జోడించింది. 25 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేసుకున్న తిలక్.. చివరి వరకు క్రీజులో నిలిచి జట్టును విజయతీరాలకు చేర్చాడు. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 20 ఓవర్లలో ఐదు వికెట్లకు 180 పరుగులు చేసింది. గ్లెన్ ఫిలిప్స్ (43 బంతుల్లో 70), బెవోన్ జాకబ్స్ (46 బంతుల్లో 58) అర్ధశతకాలతో రాణించారు. ఒక దశలో 41 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయిన కివీస్‌ను ఈ ఇద్దరూ ఆదుకున్నారు. నాలుగో వికెట్‌కు 116 పరుగులు జోడించి జట్టుకు గౌరవప్రదమైన స్కోరు అందించారు. ఫిలిప్స్‌ను అర్ష్‌దీప్ సింగ్ ఔట్ చేయడంతో ఈ భాగస్వామ్యానికి తెరపడింది. అర్ష్‌దీప్ రెండు వికెట్లు పడగొట్టగా.. ప్రిన్స్ యాదవ్, భువనేశ్వర్ కుమార్, నితీశ్ రెడ్డి తలో వికెట్ తీశారు.

ముంబై ఇండియన్స్ కోచ్‌గా కీరన్ పొలార్డ్

- 2027 ఐపీఎల్ సీజన్ నుంచి కొత్త బాధ్యతలు
- జయవర్ధనే నిష్క్రమణతో ప్రధాన కోచ్‌గా ప్రమోషన్

ముంబై: ఐపీఎల్‌లో ఐదుసార్లు చాంపియన్‌గా నిలిచిన ముంబై ఇండియన్స్ జట్టు ప్రధాన కోచ్‌గా వెస్టిండీస్ మాజీ ఆల్‌రౌండర్ కీరన్ పొలార్డ్ నియమితుడయ్యాడు. ఇప్పటివరకు జట్టు బ్యాటింగ్ కోచ్‌గా వ్యవహరించిన అతడిని 2027 సీజన్ కోసం ప్రధాన కోచ్‌గా ప్రమోట్ చేసినట్లు ఫ్రాంచైజీ శనివారం ప్రకటించింది. మహేల జయవర్ధనే నిష్క్రమణ నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. 2009 నుంచి 2022 వరకు ముంబై ఇండియన్స్ తరఫున ఐపీఎల్‌లో ఆడిన పొలార్డ్.. అనంతరం బ్యాటింగ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టాడు. ఆటగాడిగా, కోచ్‌గా జట్టుతో సుదీర్ఘ అనుబంధం ఉన్న అతడికి ఇప్పుడు ప్రధాన బాధ్యతలు అప్పగించారు. ముంబై జట్టుతో తనకున్న అనుబంధం ఎంతో ప్రత్యేకమని పొలార్డ్ పేర్కొన్నాడు. జట్టు ప్రాతినిధ్యం వహించడం వెనుక ఉన్న విలువలు, బాధ్యత తనకు తెలుసని తెలిపాడు.

టైటిల్ కరువుకు తెరదించేనా?

ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన జట్లలో ఒకటైన ముంబై ఇండియన్స్ చివరిసారిగా 2020లో టైటిల్ గెలిచింది. గత ఐదు సీజన్లలో ఆ జట్టు ప్రదర్శనలో నిలకడ లోపించింది. కొన్నిసార్లు ప్లేఆఫ్స్‌కు చేరగా.. మరికొన్ని సీజన్లలో పాయింట్ల పట్టికలో అట్టడుగున నిలిచింది. ఈ నేపథ్యంలో జట్టును మళ్లీ విజయాల బాట పట్టించడం పొలార్డ్ ముందున్న ప్రధాన సవాల్. అయితే జట్టులో భారీ మార్పులు చేయాలనే ఆలోచన తనకు లేదని పొలార్డ్ స్పష్టం చేశాడు.

సిరీస్‌పై టీమ్‌ఇండియా కన్ను

- జింబాబ్వేతో నేడు రెండో వన్డే



వడోదర: జింబాబ్వేతో వన్డే సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలుండగానే కైవసం చేసుకోవాలని భారత మహిళల జట్టు పట్టుదలగా ఉంది. ఆదివారం జరిగే రెండో వన్డేలోనూ గెలిచి 2–0తో తిరుగులేని ఆధిక్యం సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే టీ20 సిరీస్‌ను 3–0తో క్లీన్‌స్వీప్ చేసిన భారత్.. తొలి వన్డేలోనూ తొమ్మిది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. బౌలింగ్‌లో శ్రేయా చరణి (4/23), బ్యాటింగ్‌లో ప్రతికా రావల్ అజేయ శతకం భారత్ విజయానికి బాటలు వేశారు.

చరణి స్పిన్ మాయాజాలం

పిచ్ నుంచి పెద్దగా టర్న్ లభించకపోయినా ఎడమచేతి వాటం స్పిన్నర్ శ్రేయా చరణి కచ్చితమైన లైన్, లెంగ్త్‌తో ప్రత్యర్థి బ్యాటర్లను కట్టడి చేసింది. కెరీర్‌లోనే అత్యుత్తమ ప్రదర్శనతో నాలుగు వికెట్లు పడగొట్టింది. పేసర్ క్రాంతి గౌడ్ మూడు వికెట్లు తీయడంతో జింబాబ్వే 197 పరుగులకే కుప్పకూలింది. అనంతరం భారత్ 22 ఓవర్లకు పైగా మిగిలుండగానే లక్ష్యాన్ని ఛేదించింది. బ్యాటింగ్‌కు అనుకూలించిన పిచ్‌పై ప్రతికా రావల్ దూకుడుగా ఆడింది. కెప్టెన్ స్మృతి మంధానతో కలిసి తొలి వికెట్‌కు 94 పరుగులు జోడించింది. ఇద్దరూ ఓవర్‌కు దాదాపు పది పరుగుల వేగంతో స్కోరు సాధించారు. ప్రతికా తన వన్డే కెరీర్‌లో మూడో శతకంతో అజేయంగా నిలిచి జట్టుకు విజయాన్ని అందించింది. అయితే ఫీల్డింగ్‌లో రెండు క్యాచ్‌లు జారవిడవడంపై భారత్ దృష్టి సారించాల్సి ఉంది.

జింబాబ్వే మెరుగుపడేనా?

తొలి వన్డేలో ఓటమి ఎదురైనా జింబాబ్వే బ్యాటర్లు కొన్ని సందర్భాల్లో నిలకడ చూపారు. 17 ఏళ్ల బెలవ్డ్ బిజా 92 బంతుల్లో 62 పరుగులు చేయడం ఆ జట్టుకు సానుకూలాంశం. మిచెల్ మవుంగా 23 బంతుల్లో 29 పరుగులతో చివర్లో వేగం పెంచింది. షార్నే మేయర్స్ నిలకడలేమి, టాప్ ఆర్డర్ వైఫల్యం జట్టును ఇబ్బంది పెడుతున్నాయి. కీలక భాగస్వామ్యాలు నెలకొల్పడంతో పాటు అవకాశాలను సద్వినియోగం చేసుకుంటేనే భారత్‌కు గట్టి పోటీ ఇచ్చే అవకాశం ఉంది.




ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్‌కు సింధు

- జపాన్ షట్లర్‌పై హోరాహోరీ పోరులో అద్భుత విజయం
- ఈ ఏడాది రెండో సూపర్ 750 ఫైనల్‌కు చేరిన భారత షట్లర్
- నేడు టైటిల్ పోరు.. ప్రపంచ నంబర్‌వన్ ఆన్ సెయంగ్‌తో ఢీ

పారిస్: భారత స్టార్ షట్లర్, రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత పీవీ సింధు ఫ్రెంచ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో ఫైనల్‌కు దూసుకెళ్లింది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో జపాన్‌కు చెందిన హినా అకేచిపై 21–10, 20–22, 21–16తో ఉత్కంఠ విజయం సాధించింది. గంటా 13 నిమిషాల పాటు సాగిన పోరులో పట్టుదలతో ఆడిన సింధు.. ఈ ఏడాది రెండో సూపర్ 750 టోర్నీ ఫైనల్‌కు చేరింది. జులైలో జపాన్ ఓపెన్ సూపర్ 750 టైటిల్‌ను సింధు గెలుచుకున్న సంగతి తెలిసిందే. ఆదివారం జరిగే ఫైనల్లో ప్రపంచ నంబర్‌వన్ ఆన్ సెయంగ్ (దక్షిణ కొరియా)తో ఆమె తలపడనుంది.

తొలి గేమ్‌లో జోరు

ప్రపంచ 22వ ర్యాంకర్ అకేచితో ఆరంభంలో సింధుకు గట్టి పోటీ ఎదురైంది. ఇద్దరూ 4–4, 8–8తో సమంగా నిలిచారు. విరామ సమయానికి 11–9తో ఆధిక్యంలోకి వెళ్లిన సింధు.. ఆ తర్వాత ప్రత్యర్థిని కట్టడి చేసింది. చివరి 12 పాయింట్లలో 11 గెలుచుకుని 18 నిమిషాల్లోనే తొలి గేమ్‌ను సొంతం చేసుకుంది. రెండో గేమ్‌లో అకేచి పుంజుకుంది. సింధు వెనుకబడినా తిరిగి స్కోరును సమం చేస్తూ పోరాడింది. ఇద్దరూ నువ్వా నేనా అన్నట్లు తలపడటంతో గేమ్ ఉత్కంఠగా సాగింది. 20–20 వద్ద సింధు సమం చేసినా.. ఆ తర్వాత అకేచి పైచేయి సాధించి గేమ్‌ను గెలుచుకుంది. ఇక నిర్ణయాత్మక మూడో గేమ్‌లో సింధు 5–3తో ఆరంభించినా.. అకేచి పోరాటంతో స్కోరు 15–15కు చేరింది. ఈ దశలో 38 షాట్ల సుదీర్ఘ ర్యాలీని సింధు తనకు అనుకూలంగా మలుచుకుంది. ప్రత్యర్థి నెట్ వద్ద తప్పిదం చేయడంతో 18–16 ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత వరుసగా కీలక పాయింట్లు సాధించి మ్యాచ్‌ను ముగించింది.





అదానీ విండ్‌కు భారీ ఆర్డర్లు

- ఐదు విద్యుత్ సంస్థల నుంచి 696.2 మెగావాట్ల బుకింగ్స్
- గ్రూపేతర సంస్థల నుంచి 1,000 మెగావాట్లు దాటిన ఒప్పందాలు
- ముంద్రా తయారీ సామర్థ్యం 5 గిగావాట్లకు పెంపే లక్ష్యం
- దేశంలో పవన విద్యుత్ టర్బైన్లకు పెరుగుతున్న డిమాండ్



న్యూఢిల్లీ: అదానీ న్యూ ఇండస్ట్రీస్ అనుబంధ సంస్థ అదానీ విండ్ ఐదు విద్యుత్ ఉత్పత్తి సంస్థల నుంచి 696.2 మెగావాట్ల పవన విద్యుత్ టర్బైన్ల సరఫరా ఆర్డర్లను దక్కించుకుంది. దీంతో అదానీ గ్రూపునకు చెందని స్వతంత్ర విద్యుత్ ఉత్పత్తి సంస్థల నుంచి పొందిన మొత్తం ఆర్డర్లు ఒక గిగావాట్ దాటాయి. ఆర్‌పీ–సంజీవ్ గోయెంకా గ్రూపునకు చెందిన పుర్వా గ్రీన్ పవర్ నుంచి 300 మెగావాట్లు, జిందాల్ ఇండియా పవర్ నుంచి 155, ఎన్‌టీపీసీ రెన్యూవబుల్ ఎనర్జీ నుంచి 109.2, ఆదిత్య బిర్లా రెన్యూవబుల్స్ నుంచి 82.5, ఇంటిగ్రమ్ ఎనర్జీ నుంచి 49.5 మెగావాట్ల ఆర్డర్లు లభించాయి. కర్ణాటక, గుజరాత్, మహారాష్ట్రల్లో చేపట్టే ప్రాజెక్టులకు 3.3, 5, 5.2 మెగావాట్ల సామర్థ్యం కలిగిన టర్బైన్లను సరఫరా చేయనుంది. గుజరాత్‌లోని ముంద్రా ప్లాంట్ వార్షిక తయారీ సామర్థ్యాన్ని 2.25 గిగావాట్ల నుంచి 5 గిగావాట్లకు, దీర్ఘకాలంలో 10 గిగావాట్లకు పెంచాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. తక్కువ, మధ్యస్థాయి గాలులకు అనువుగా 185 మీటర్ల రోటర్ వ్యాసంతో ఐదు మెగావాట్ల టర్బైన్‌ను రూపొందించింది.

విస్తరిస్తున్న మార్కెట్

ప్రపంచంలో నాలుగో అతిపెద్ద పవన విద్యుత్ మార్కెట్‌గా ఉన్న భారత్‌లో ప్రస్తుతం 59.2 గిగావాట్ల స్థాపిత సామర్థ్యం ఉండగా, మరో 43 గిగావాట్ల ప్రాజెక్టులు అమలులో ఉన్నాయి. 2026 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో 6.05 గిగావాట్ల సామర్థ్యం అదనంగా చేరింది. 2027 ఆర్థిక సంవత్సరంలో ఎనిమిది గిగావాట్ల స్థాపన పరిశ్రమ లక్ష్యం. పెద్ద టర్బైన్లు, విస్తృత రోటర్లతో భూమి వినియోగాన్ని తగ్గిస్తూ ఉత్పత్తిని పెంచేందుకు కంపెనీలు ప్రయత్నిస్తున్నాయి. దేశీయ మార్కెట్‌తోపాటు విదేశీ అవకాశాలపైనా అదానీ విండ్ దృష్టి సారించింది. యూరప్‌కు యాంటీ ఐసింగ్ సాంకేతికత కలిగిన బ్లేడ్ సెట్లను ఎగుమతి చేసిన సంస్థ.. అమెరికా, ఆస్ట్రేలియా, బ్రెజిల్, ఆగ్నేయాసియా మార్కెట్లలోనూ విస్తర ణకు ప్రయత్నిస్తోంది. తాజా ఆర్డర్లతో మార్కెట్ వాటా పెరిగే అవకాశమున్నా, ఆదాయంపై ప్రభావం సరఫరా, ప్రాజెక్టుల అమలు, విద్యుత్ ఉత్పత్తి ప్రారంభంపై ఆధారపడి ఉంటుంది.

ఏఐ స్టార్టప్‌లకు ఎల్‌అండ్‌టీ ఫైనాన్స్ ప్రోత్సాహం

- రెండో విడత 'పిచ్ పాయింట్' ప్రారంభం
- దరఖాస్తులకు ఈ నెల 31 చివరి గడువు



ముంబై: కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత అంకుర సంస్థలను ప్రోత్సహించేందుకు ఎల్‌అండ్‌టీ ఫైనాన్స్ (ఎల్‌టీఎఫ్) 'పిచ్ పాయింట్' రెండో విడతను ప్రారంభించింది. బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమాతోపాటు ఇతర రంగాల్లో ఏఐ పరిష్కారాలను అభివృద్ధి చేస్తున్న అర్హతగల స్టార్టప్‌లు ఇందులో పాల్గొనవచ్చు. ఎంపికైన సంస్థలకు పెట్టుబడిదారులు, ఎల్‌టీఎఫ్ ఉన్నతాధికారులు, అంతర్జాతీయ పరిశ్రమ నిపుణుల ముందు తమ ఉత్పత్తులను ప్రదర్శించే అవకాశం లభిస్తుంది. తొలి విడత విజేతలైన యారోహెడ్ ఏఐ, స్నూఫ్‌సెన్స్ సంస్థలు ఈ కార్యక్రమం ద్వారా పెద్ద సంస్థలతో అనుసంధానం, సాంకేతిక పరిష్కారాల ధ్రువీకరణ, వ్యాపార విస్తరణకు అవకాశాలు లభించాయని తెలిపాయి. యారోహెడ్ ఏఐ ప్రస్తుతం ఎల్‌టీఎఫ్‌కు వివిధ విభాగాల్లో వాయిస్ ఏఐ భాగస్వామిగా సేవలందిస్తోంది. స్నూఫ్‌సెన్స్ డిజిటల్ గుర్తింపు ధ్రువీకరణ, డీప్‌ఫేక్ గుర్తింపు సాంకేతికతను మెరుగుపర్చుకుంటోంది. సైబర్ భద్రత, మోసాల నివారణ, వ్యవసాయ ఆర్థిక సేవలు, జనరేటివ్ ఏఐ, రుణాల అంచనా, రిస్క్ నిర్వహణ, నియంత్రణ నిబంధనలు, రుణ వసూళ్లు, చిత్రాల గుర్తింపు వంటి రంగాల్లో పరిష్కారాలను అభివృద్ధి చేస్తున్న స్టార్టప్‌లు దరఖాస్తు చేసుకోవచ్చు. అర్హత గల సంస్థలు తమ ఉత్పత్తి వివరాలతో కూడిన పిచ్ డెక్‌ను ఆన్‌లైన్‌లో సమర్పించాలి. ఎంపిక ప్రక్రియ అనంతరం ఐదు సంస్థలకు తుది ప్రదర్శనలో పాల్గొనే అవకాశం కల్పిస్తారు. దరఖాస్తులకు అక్టోబర్ 31 చివరి తేదీ. తుది జాబితాను డిసెంబరు 1న ప్రకటిస్తారు. డిసెంబరు 16న ముంబయిలో జరిగే 'రైజ్–2026' కార్యక్రమంలో తుది ప్రదర్శనలు నిర్వహిస్తారు.

కోటక్ బ్యాంక్‌కు 26శాతం వృద్ధి





- రూ.5,645 కోట్లకు కన్సాలిడేటెడ్ లాభం

ముంబై: కోటక్ మహీంద్రా బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో మెరుగైన ఫలితాలు సాధించింది. సెప్టెంబరుతో ముగిసిన మూడు నెలల్లో కన్సాలిడేటెడ్ నికర లాభం గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 26 శాతం పెరిగి రూ.5,645 కోట్లకు చేరింది. స్టాండలోన్ ప్రాతిపదికన లాభం 29 శాతం వృద్ధితో రూ.4,212 కోట్లకు పెరిగింది. వడ్డీ ఆదాయం పెరగడం, కేటాయింపులు తగ్గడం ఇందుకు దోహదపడ్డాయి. నికర వడ్డీ ఆదాయం 16 శాతం పెరిగి రూ.8,459 కోట్లకు చేరగా, రుణాల వృద్ధి 25 శాతంగా నమోదైంది. అయితే నికర వడ్డీ మార్జిన్ 0.23 శాతం తగ్గింది. ఆర్‌బీఐ రాయితీ స్వాప్ సదుపాయం కింద రూ.55,344 కోట్ల ఎఫ్‌సీఎన్‌ఆర్–బి డిపాజిట్ల సమీకరణ మార్జిన్‌పై ప్రభావం చూపిందని బ్యాంక్ తెలిపింది. ఈ పథకం కింద రూ.16,110 కోట్ల రుణాలు పంపిణీ చేసింది. ఈ ప్రభావం లేకుంటే రుణాలు 19 శాతం, డిపాజిట్లు 13 శాతం వృద్ధి చెందేవని పేర్కొంది. తక్కువ వ్యయంతో లభించే కాసా డిపాజిట్ల వాటా 42.3 శాతం నుంచి 38.2 శాతానికి తగ్గింది. కొత్తగా మొండి బకాయిలుగా మారిన రుణాలు రూ.1,629 కోట్ల నుంచి రూ.1,230 కోట్లకు దిగివచ్చాయి. స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి 1.39 శాతం నుంచి 1.04 శాతానికి తగ్గింది. సెప్టెంబరు 30 నాటికి మూలధన సమృద్ధి నిష్పత్తి 21.9 శాతంగా, కోర్ కామన్ ఈక్విటీ టైర్–1 నిష్పత్తి 21.4 శాతంగా నమోదైంది.

ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లాభం రూ.858 కోట్లు

ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో రూ.858 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గత ఏడాది ఇదే కాలంలోని రూ.561 కోట్లతో పోలిస్తే 53 శాతం వృద్ధి సాధించింది. వడ్డీ ఆదాయం పెరగడం ఇందుకు దోహదపడింది. సెప్టెంబరు త్రైమాసికంలో బ్యాంక్ మొత్తం ఆదాయం రూ.5,224 కోట్ల నుంచి రూ.6,382 కోట్లకు, వడ్డీ ఆదాయం రూ.4,511 కోట్ల నుంచి రూ.5,612 కోట్లకు పెరిగాయి. నికర వడ్డీ ఆదాయం 32 శాతం వృద్ధితో రూ.2,820 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్ 5.5 శాతం నుంచి 5.8 శాతానికి మెరుగుపడింది. మరోవైపు, స్థూల నిరర్థక ఆస్తుల (ఎన్‌పీఏ) నిష్పత్తి 2.41 శాతం నుంచి 1.99 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.88 శాతం నుంచి 0.81 శాతానికి తగ్గాయి. అయితే మూలధన సమృద్ధి నిష్పత్తి 18.78 శాతం నుంచి 18.54 శాతానికి దిగివచ్చింది. వృద్ధి, లాభదాయకతతోపాటు ఆర్థిక క్రమశిక్షణకు ప్రాధాన్యమిస్తున్నామని బ్యాంక్ ఎండీ, సీఈఓ సంజయ్ అగర్వాల్ తెలిపారు. మెరుగైన లాభాలు, స్థిరమైన ఆస్తుల నాణ్యత దీర్ఘకాలిక వృద్ధిపై విశ్వాసాన్ని పెంచుతున్నాయని పేర్కొన్నారు.

బజాజ్ ఇన్సూరెన్స్ సీఈఓగా దీపక్ రెడ్డి

- జనవరి నుంచి బాధ్యతలు



ముంబై: బజాజ్ జనరల్ ఇన్సూరెన్స్ నూతన సీఈఓ డిజిగ్నేట్‌గా దీపక్ రెడ్డి నియమితులయ్యారు. 2027 జనవరి 1 నుంచి బాధ్యతలు చేపట్టనుండగా, ఐఆర్‌డీఏఐ ఆమోదానికి లోబడి ఏప్రిల్ 1 నుంచి ఎండీ, సీఈఓగా వ్యవహరించనున్నారు. అప్పటివరకు ప్రస్తుత అధిపతి తపన్ సింఘెల్ కొనసాగుతారు. ఆర్థిక సేవల రంగంలో 30 ఏళ్లకు పైగా అనుభవమున్న దీపక్ రెడ్డి, బజాజ్ ఫిన్‌సర్వ్‌లో 17 ఏళ్ల పనిచేశారు. బజాజ్ ఫైనాన్స్‌తోపాటు అమెరికన్ ఎక్స్‌ప్రెస్, స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంక్‌లలో సేవలందించారు. ఇటీవల మణప్పురం ఫైనాన్స్ సీఈఓగా ఉన్నారు. ఐఆర్‌డీఏఐ గరిష్ఠ పదవీకాల నిబంధనకు అనుగుణంగా ఈ నాయకత్వ మార్పు చేపట్టినట్లు సంస్థ తెలిపింది. బజాజ్ ఫిన్‌సర్వ్ చైర్మన్ సంజీవ్ బజాజ్.. తపన్ సింఘెల్ సంస్థ అభివృద్ధికి చేసిన కృషిని ప్రశంసించారు.

తీరప్రాంత తెగ జీవనానికి అద్దం పట్టిన 'మందాడి'



తెరపై ఆవిష్కృతమయ్యే కథ వెనుక ఓ సమూహం అస్తిత్వం, సామాజిక నేపథ్యం ముడిపడి ఉన్నప్పుడు ఆ అనుభవం ప్రత్యేకంగా నిలుస్తుంది. కోరమాండల్ తీరంలోని పట్టపు మత్స్యకారుల వాస్తవ జీవనాన్ని నిక్కచ్చిగా చూపించిన చిత్రం 'మందాడి'. తీర ప్రాంతాల్లో వాణిజ్యం విస్తరించే క్రమంలో సమాజంలో చోటుచేసుకున్న ఆశలు, అక్రమాలు, అంతర్గత సంఘర్షణలను ఈ చిత్రం లోతుగా ఆవిష్కరించింది.

చరిత్రలో పట్టపు మూలాలు..

కోరమాండల్ తీరంలోని నాగపట్నం, చెన్నైపట్నం వంటి ప్రాచీన రేవు పట్టణాలను కేంద్రంగా చేసుకుని వేట, నౌకాయానం, వాణిజ్యం సాగించిన సముద్ర సమూహం పట్టణవర్. కాలక్రమంలో ఈ సమూహానికి చెందినవారు తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతాల్లోని పలు ప్రాంతాల్లో పట్టపు మత్స్యకార వర్గంగా స్థిరపడ్డారు. తమిళ తీరంలో వీరిని 'కరైయార్' అని కూడా పిలుస్తారు. క్రీస్తుశకం రెండో శతాబ్దంలోనే గ్రీకు రచయిత టోలెమీ వీరి గురించి ప్రస్తావించినట్లు చారిత్రక కథనాలు చెబుతున్నాయి. పెరియ పట్టణవర్, చిన్న పట్టణవర్ వంటి అంతర్గత వర్గాలు, పడయాచి వంటి శాఖలతో కూడిన వీరి సంస్కృతి, యాసలో తెలుగు, తమిళ భాషల కలయిక సహజంగా కనిపిస్తుంది.

సామాజిక కట్టుబాట్లకు పెద్దపీట..

పట్టపు సమాజంలో ఇప్పటికీ అంతర్గత స్వయంపాలన వ్యవస్థకు ప్రాధాన్యం ఉంది. రాజ్యాంగ చట్టాలు అమల్లో ఉన్నప్పటికీ, సమాజంలోని వివాదాలను పరిష్కరించడంలో గ్రామ పెద్దల పాత్ర కీలకంగా ఉంటుంది. వారి కట్టుబాట్లు, సామాజిక నిర్ణయాలు సమూహ జీవితాన్ని ప్రభావితం చేస్తుంటాయి. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లో బోట్లకు సంబంధించిన వివాదం తలెత్తిన సందర్భంలో జోక్యం చేసుకున్న ఓ ప్రజాప్రతినిధికి భారీ జరిమానా విధించినట్లు ప్రచారంలోకి వచ్చిన ఉదంతం ఈ అంతర్గత వ్యవస్థపై చర్చకు దారితీసింది. బయటి ప్రపంచానికి ఆశ్చర్యంగా అనిపించే ఈ సామాజిక సమీకరణాల వెనుక తరతరాలుగా కొనసాగుతున్న సంప్రదాయాలు, సమష్టి జీవన విధానం ఉన్నాయి. దర్శకుడి

పరిశోధన.. కథకు బలం..

దర్శకుడు మతిమారన్ పుగళేంది క్షేత్రస్థాయి పరిశోధన ఈ చిత్రానికి ప్రధాన బలంగా నిలిచింది. దర్శకుడు వెట్రిమారన్ శిష్యుడిగా ఆయనపై ఉన్న ప్రభావం కథనంలో స్పష్టంగా కనిపిస్తుంది. మత్స్యకారుల సామాజిక కట్టుబాట్లను వక్రీకరించకుండా, తీరప్రాంత జీవన వాస్తవాలను సహజంగా వెండితెరపైకి తీసుకొచ్చారు. అమీర్ జుమాల్ ఖాన్‌తో కలిసి రూపొందించిన సంభాషణలు స్థానిక మాండలికాన్ని, భావోద్వేగాలను ప్రతిబింబించాయి. అయితే తెలుగు అనువాదంలో మరికొంత శ్రద్ధ తీసుకుని ఉంటే ప్రేక్షకులకు మరింత సహజమైన అనుభూతి కలిగేది.

సహజ నటనతో సూరి, సుహాస్..

హీరోయిజానికి దూరంగా ఎండకు మాడిన జాలరి మందాడి పాత్రలో సూరి ఒదిగిపోయారు. సముద్రపు అలలతో పోరాడే నావికుడిగా ఆయన ప్రదర్శించిన శారీరక శ్రమ, నటన ఆకట్టుకుంటాయి. ప్రతినాయక ఛాయలున్న సట్టపులి పాత్రలో తెలుగు నటుడు సుహాస్ ఆధిపత్య కాంక్షను తన హావభావాలతో సమర్థంగా పలికించారు. మహిమా నంబియార్, రవీంద్ర విజయ్, గురువు పాత్రలో సత్యరాజ్ తమ తమ పాత్రలకు న్యాయం చేశారు. ఎస్.ఆర్. కదిర్ ఛాయాగ్రహణం, జి.వి. ప్రకాష్ సంగీతం, ప్రదీప్ ఇ. రాఘవ్ ఎడిటింగ్ ప్రేక్షకులను తీరప్రాంత వాతావరణంలోకి తీసుకెళ్తాయి. తెరచాప పడవల పోటీలను చిత్రీక రించిన కొన్ని సందర్భా ల్లో సినిమా టిక్ స్వేచ్ఛ తీసుకు న్నప్ప టికీ, ఓ సమూహం జీవన విధానాన్ని నిజాయతీగా ఆవిష్కరించిన చిత్రంగా 'మందాడి' నిలుస్తుంది. వారి చరిత్ర, ఆచారాలు, సామాజిక నేపథ్యం తెలిసినప్పుడు తెరపై పాత్రలు ఎదుర్కొనే సంఘర్షణలు మరింత లోతుగా అర్థమవుతాయి. ఇలాంటి కథలు మన కోస్తా ప్రాంతాల్లోనూ, మన్య ప్రాంతాల్లోనూ ఎన్నో ఉన్నాయి. సరైన పరిశోధన, వాస్తవిక దృక్పథం, నిజాయతీతో కూడిన ప్రయత్నం ఉంటే మరుగునపడిన ఎన్నో సజీవ కథలు వెండితెరపై ఆవిష్కృతమయ్యే అవకాశం ఉంది.



'సముక్'లో కథానాయికగా రుక్మిణి మైత్రా

బాలీవుడ్ స్టార్ అక్షయ్ కుమార్ సరికొత్త జోనర్‌లో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న ఏలియన్ సర్వైవల్ యాక్షన్ థ్రిల్లర్ 'సముక్' భారీ హంగులతో తెరకెక్కుతోంది. సన్‌షైన్ పిక్చర్స్ పతాకంపై ప్రముఖ నిర్మాత విపుల్ అమృత్‌లాల్ షా నిర్మిస్తున్న ఈ చిత్రానికి కనిష్క్ వర్మ దర్శకత్వం వహిస్తున్నారు. అంతర్జాతీయ స్థాయి క్రియేచర్, స్టంట్ బృందాలతో రూపొందుతున్న ఈ సినిమా కోసం మేకర్స్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. గత రెండేళ్లుగా ఈ ప్రాజెక్ట్‌పై పని చేస్తుండగా.. సైనిక నేపథ్య వాస్తవికత, ప్రాణాలు నిలుపుకునే పోరాటం, భయానక అంశాలు, ఏలియన్ ప్రపంచాన్ని మేళవించి సరికొత్త కథా ప్రపంచాన్ని సృష్టిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయితో పాటు అంతర్జాతీయ ప్రేక్షకులను దృష్టిలో ఉంచుకొని చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ శరవేగంగా కొనసాగుతుండగా.. తాజాగా ఈ ప్రాజెక్ట్‌లోకి నటి రుక్మిణి మైత్రా అడుగుపెట్టినట్లు చిత్ర నిర్మాణ సంస్థ ప్రకటించింది. అక్షయ్ కుమార్‌కు జోడీగా ఆమె కథానాయికగా నటించనున్నారు. గతంలో 'సనక్' చిత్రంలో నటించిన రుక్మిణి.. మరోసారి సన్‌షైన్ పిక్చర్స్‌తో కలిసి పనిచేస్తున్నారు. ఆమెతో కలిసి పనిచేయడం ఉత్సాహంగా ఉందని నిర్మాణ సంస్థ వెల్లడించింది. అక్షయ్ కుమార్ కెరీర్‌లోనే విభిన్నమైన ఏలియన్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న 'సముక్'పై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది.

ఆస్తులు అమ్ముకున్నా.. అప్పులపాలయ్యా!



టాలీవుడ్‌లో విలక్షణ నటుడిగా గుర్తింపు తెచ్చుకున్న సీనియర్ నటుడు నరేశ్ ప్రస్తుతం విభిన్న పాత్రల్లో నటిస్తూ తన రెండో ఇన్నింగ్స్‌లో బిజీగా ఉన్నారు. ఆయన నటించిన పలు చిత్రాలు విడుదలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో ప్రమోషన్లలో పాల్గొన్న నరేశ్.. తన గత రాజకీయ జీవితానికి సంబంధించిన ఆసక్తికర విషయాలను వెల్లడించారు. హీరోగా మంచి అవకాశాలు వస్తున్న సమయంలోనే రాజకీయాల్లోకి అడుగుపెట్టానని, అయితే డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో కాకుండా ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతోనే ఆ రంగాన్ని ఎంచుకున్నానని తెలిపారు. రాజకీయాల్లో మరుగ్గా పనిచేసిన సమయంలో పార్టీ కార్యక్రమాలు, సామాజిక సేవా కార్యక్రమాల కోసం సొంత డబ్బును భారీగా ఖర్చు చేయాల్సి వచ్చేదని చెప్పారు. మరోవైపు, అదనపు ఆదాయం కోసం ప్రారంభించిన ప్రకటనల సంస్థ వంటి వ్యాపారాలు కూడా ఆశించిన ఫలితాలను ఇవ్వలేదని పేర్కొన్నారు.

'తార'గా రుక్మిణి వసంత్ కొత్త అవతారం

కన్నడ సుందరి రుక్మిణి వసంత్ వరుస అవకాశాలతో దూసుకుపోతున్నారు. దక్షిణాదిలో మోస్ట్ వాంటెడ్ కథానాయికగా గుర్తింపు తెచ్చుకుంటున్న ఈ భామ.. ఇటీవల 'కాంతార: చాప్టర్ 1' విజయంతో మరింత క్రేజ్ సంపాదించుకున్నారు. దీంతో తెలుగులోనూ వరుసగా భారీ అవకాశాలు అందుకుంటున్నారు. ఈ క్రమంలోనే తాజాగా మరో క్రేజీ ప్రాజెక్ట్‌లో భాగమయ్యారు. 'ఒకే ఒక జీవితం' సినిమాతో ప్రేక్షకులను ఆకట్టుకున్న శ్రీ కార్తీక్ హీరోగా నటిస్తున్న కొత్త చిత్రంలో రుక్మిణి వసంత్ కథానాయికగా ఎంపికయ్యారు. ఇందులో ఆమె 'తార' అనే ప్రత్యేకమైన పాత్రలో కనిపించనున్నారు. ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించిన చిత్ర బృందం.. ఆమె పాత్రకు సంబంధించిన చిన్న ప్రచార దృశ్యాన్ని కూడా విడుదల చేసింది. ఈ కొత్త ప్రాజెక్ట్‌పై రుక్మిణి వసంత్ సామాజిక మాధ్యమాల వేదికగా తన ఆనందాన్ని పంచుకున్నారు. తొలి కథనం నుంచే సినిమా చుట్టూ ఉత్సాహం మొదలైందని, చిత్రీకరణ సెట్‌కు వెళ్లిన ప్రతిసారీ ఎంతో ఉత్తేజంగా అనిపించిందని తెలిపారు. మొదటి రోజు నుంచే ఇంతటి ఉత్సాహాన్ని అందించిన చిత్ర బృందానికి కృతజ్ఞతలు చెబుతూ.. ఇలాంటి మరిన్ని అద్భుతమైన అనుభవాలు ఎదురుకావాలని ఆకాంక్షించారు. ఈ చిత్రాన్ని మ్యాడ్ బాయ్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్, సిరుని సినీ కార్పొరేషన్ పతాకాలపై మిసాయ్ కృష్ణ, దేవ్ రామ్‌నాథ్, శ్రీ కార్తీక్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్‌పై ఆసక్తి నెలకొనగా.. త్వరలోనే సినిమాకు సంబంధించిన పవర్‌ఫుల్ టైటిల్‌ను ప్రకటించనున్నట్లు మేకర్స్ వెల్లడించారు.



'ఫౌజీ'లో ప్రభాస్ ప్రోత్సాహం మర్చిపోలేను

ప్రభాస్, హను రాఘవపూడి కాంబినేషన్‌లో మైత్రీ మూవీ మేకర్స్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న భారీ పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'ఫౌజీ'లో కన్నడ నటి చైత్ర అచార్ వైవిధ్యమైన పాత్రలో నటిస్తోంది. ఈ చిత్రంలో ఇమాన్వి కథానాయికగా నటిస్తుండగా.. మిథున్ చక్రవర్తి, అనుపమ్ ఖేర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న చైత్ర.. దర్శకుడు హను రాఘవపూడి తనకు ఫోన్ చేసి ఈ సినిమా గురించి చెప్పినప్పుడు తొలుత ఆశ్చర్యపోయానని, తన పాత్ర గురించి తెలుసుకున్నాక ఎంతో నచ్చిందని తెలిపింది. శారీరకంగా, మానసికంగా సవాళ్లతో కూడిన ఇలాంటి పాత్రలో నటించాలని ఎప్పటి నుంచో కలలు కంటున్నానని, వందలాది మంది పాల్గొనే భారీ కమర్షియల్ సినిమా చిత్రీకరణలో పనిచేయడం ఇదే మొదటిసారని చెప్పింది. ఇక ప్రభాస్ గురించి మాట్లాడుతూ.. ఆయన ఎంతో మంచివారని, చిన్నపిల్లాడిలాంటి అమాయకత్వం ఆయనలో ఉంటుందని, అందుకే అందరూ ప్రేమగా డార్లింగ్ అని పిలుస్తారని పేర్కొంది. ప్రభాస్‌కు భోజనం చేయడం ఎంత ఇష్టమో.. పక్కవారికి ప్రేమగా తినిపించడం కూడా అంతే ఇష్టమని వెల్లడించింది. తనను ప్రభాస్ ఎంతగానో ప్రోత్సహించారని, తాను నటించని సమయంలోనూ తన సన్నివేశాల చిత్రీకరణను చూసి, తన నటనకు థియేటర్లలో విజిల్స్ పడతాయని ప్రశంసించారని చైత్ర అచార్ ఆనందం వ్యక్తం చేసింది.





కొత్త జంటల మనసు గెలిచే 'గడప..' పాట

నిర్మాత బన్నీ వాస్, దర్శకుడు సుకుమార్ తమ బన్నీ వాస్ వర్క్స్, సుకుమార్ రైటింగ్స్ పతాకాలపై ప్రియదర్శి కథానాయకుడిగా 'ఇడుపు కాయితం' చిత్రాన్ని నిర్మిస్తున్నారు. జానపద గీతాలతో గుర్తింపు తెచ్చుకున్న నాగదుర్గ కథానాయికగా నటిస్తుండగా.. యువ దర్శకుడు వంశీరెడ్డి దొండపాటి ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. డిసెంబర్ 11న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా నుంచి తాజాగా 'గడప..' పాటను ఘనంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత బన్నీ వాస్ మాట్లాడుతూ.. ఈ రోజు తనకు ఎంతో ప్రత్యేకమని, శ్రీలత పాటను ప్రేక్షకులతో కలిసి తెరపై చూశానని చెప్పారు. ఆ పాటలో తన కుమార్తె కూడా ఉందని, ఆమెను తెరపై చూడటం ఇదే మొదటిసారని ఆనందం వ్యక్తం చేశారు. దర్శకుడు వంశీరెడ్డి కథ చెప్పినప్పుడు తన చిన్ననాటి ఊరు, ఇంటి వాతావరణం కళ్లకు కట్టినట్లు కనిపించిందని తెలిపారు. కొత్తగా పెళ్లయిన ఇంట్లో చోటుచేసుకునే పరిణామాలను ప్రతి ఒక్కరికీ తమ ఇంటి కథలా అనిపించేలా అద్భుతంగా తెరకెక్కించారని ప్రశంసించారు. కథ, సంభాషణలు, సహజత్వం ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణలని పేర్కొన్నారు. తన సినీ ప్రయాణంలోనే అత్యంత వేగంగా నిర్మించిన చిత్రమిదని, అయితే అది తన గొప్పతనం కాదని, ఈ సినిమా కోసం పనిచేసిన యువ బృందం ప్రతిభకు నిదర్శనమని అన్నారు. కొత్తగా పెళ్లయిన అమ్మాయిలను 'గడప..' పాటలోని సాహిత్యం ఎంతగానో ఆకట్టుకుంటుందని బన్నీ వాస్ అభిప్రాయపడ్డారు. కొత్త జంటలు తమ అత్తామామలతో కలిసి డిసెంబర్‌లో థియేటర్లకు వచ్చి ఈ చిత్రాన్ని చూడాలని కోరారు. సినిమా చూసి బయటకు వెళ్లేటప్పుడు అత్తామామలు ఆప్యాయంగా భుజంపై చేయి వేసి తీసుకెళ్లేంత సహజంగా, భావోద్వేగభరితంగా కథ ఉంటుందని అన్నారు. పెళ్లయిన కొత్తలో ఈ సినిమా చూస్తే 'ఇడుపు కాయితం' గురించి మళ్లీ ఆలోచించాల్సిన అవసరం ఉండదంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

స్నేహానికి క్వాలిటీ ముఖ్యం

మాస్ కా దాస్ విశ్వక్ సేన్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కుతున్న యాక్షన్ థ్రిల్లర్ 'కట్'పై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. గాయత్రి భరద్వాజ్ కథానాయికగా నటిస్తుండగా.. తారక్ పొన్నప్ప ప్రతినాయకుడిగా కనిపించనున్నారు. ఈ చిత్రం విడుదలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో ప్రమోషన్లలో పాల్గొన్న విశ్వక్ సేన్.. తనపై వచ్చే ట్రోలింగ్, స్నేహం గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సోషల్ మీడియాలో నెగిటివిటీ, ట్రోలింగ్ సాధారణమని, సినిమా విజయం సాధించినా.. పరాజయం పాలైనా తాను ఒకేలా ఉంటానని చెప్పారు. ప్రతికూల వ్యాఖ్యలను, ఆన్‌లైన్ ట్రోలింగ్‌ను అస్సలు పట్టించుకోనని, తనపై వచ్చే విమర్శలకు సినిమాలే గట్టి సమాధానం చెబుతాయని విశ్వక్ స్పష్టం చేశారు. ఇక స్నేహం గురించి మాట్లాడుతూ.. తన దృష్టిలో స్నేహితుల సంఖ్య కంటే స్నేహ బంధంలోని నాణ్యతే ముఖ్యమని అన్నారు. ఇప్పటికీ తన చుట్టూ పరిశ్రమకు చెందినవారి కంటే చిన్ననాటి స్నేహితులే ఎక్కువగా ఉంటారని, వారిలో చాలామందితో పదిహేను ఏళ్లకు పైగా అనుబంధం ఉందని వెల్లడించారు. తన బాధలోనైనా, సంతోషంలోనైనా పరిస్థితి ఏదైనా సరే ఆ స్నేహితులే తనకు అండగా ఉంటారని తెలిపారు. తన దగ్గర ఏమీ లేని సమయంలోనూ తనతో ఉన్నవారే నిజమైన స్నేహితులని విశ్వక్ సేన్ తన మనసులోని మాటను పంచుకున్నారు.



Published And Owned By Adula Thirupathi, And Printed By Bommakanti Vinod Kumar, At Vangs Global Technologies Llp, #1-5-431/20/4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri, Telangana - 500010. And Published From D. No.: 8-3-228/157/A/1a, Rehmath Nagar, Jawahar Nagar, Yousufguda, Hyderabad, Telangana - 500045. **Editor: Adula Thirupathi. PRGI Regd No: TGTEL/26/A6187**, Email: Prajanaava@Gmail.Com. Phone No: 99484 33277.